ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 14.03.2026 | సంపుటి : 12 సంచిక : 234 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370






హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


# నిజాం చేసిన అభివృద్ధిలో నాలుగోవంతైనా చేయాలి



## మూసీకి 20 టీఎంసీల గోదావరి జలాలు తరలిస్తాం

- మూసీ అభివృద్ధిని బాధ్యతగా తీసుకున్నాం
- అద్భుత నగరాన్ని కాపాడుకునే బాధ్యత మనది
- ఎవరు సూచనలు ఇచ్చినా తీసుకునేందుకు సిద్ధం
- వరదలు వస్తే ప్రజలు నిరాశ్రయులు అవుతున్నారు
- నదులను ఆక్రమించుకోవడం వల్లనే వరదలు
- ప్రాజెక్టును విమర్శిస్తున్న వారు అక్కడ ఉండగలరా?
- మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విదేశాల్లో పలు నదులను సందర్శించి అధ్యయనం చేశారని, ఇప్పటికీ బృహత్కార్యాచరణ చేపట్టకపోతే భవిష్యత్ తరాలు క్షమించవన్నారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రెండేళ్లుగా నిపుణులు, అధికారులతో క్షుణ్ణంగా ప్రతి అంశం పరిశీలించామని చెప్పారు. నిజాంలు, బ్రిటీషర్లు సికింద్రాబాద్ నగరాన్ని నిర్మించారు. ఈసీ, మూసీ వరదల నియంత్రణకు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు నేటికీ ప్రజల దాహార్తి తీరుస్తున్నాయి. ప్రపంచ పరిణామాలు, పర్యావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలి. అపార మేధో సంపత్తి ఉందని చెప్పేవారు ప్రాజెక్టులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏమైనా తప్పులు చేస్తే సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాం అని బిఆర్‌ఎస్‌ను ఉద్దేశించి అన్నారు. మూసీ, ఈసీ సంగమ స్థానం లంగర్ హౌస్ వద్ద బాపూ ఘాట్‌ను పర్యాటక కేంద్రం చేస్తాం అన్నారు. కృష్ణా, గోదావరి జలాలతో ప్రజల దాహార్తి తీర్చాలని ప్రయత్నించాం. గోదావరి జలాలు 20 టీఎంసీలను మూసీకి తరలించే పనులు చేపట్టామని అన్నారు. మూసీలో నిరంతరం 2.5 టీఎంసీల గోదావరి జలాలు ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నాం. మిగతా 17.5 టీఎంసీల గోదావరి జలాలతో హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చేయత్నం చేస్తున్నాం. ఎంతో ఘనమైన మూసీ చరిత్ర కాలగర్భంలో కలిసిపోతోంది. రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా అని ప్రశ్నించారు. మేం చేపడుతున్న ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం

మిగతా 2లో..

> "నదీ పరివాహక ప్రాంతంలో ఎకనమిక్ జోన్ తయారుచేస్తున్నాం. హైదరాబాద్ నగరంలోని చెరువులు పునరుద్ధరిస్తున్నాం. చెరువులు పునరుద్ధరిస్తున్నందుకు ప్రజలు మాకు ఘనస్వాగతం పలుకుతున్నారు. మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్నవాళ్లు... మూసీ పక్కన నివసిస్తారా? మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్నవాళ్లకు కంటెయినర్ హౌస్‌లు ఇస్తా.. అక్కడ నివసిస్తారా? మూసీ ప్రక్షాళనకు రక్షణ మంత్రిత్వశాఖ 100 ఎకరాలు ఇస్తోంది. మూసీకి వరదలొస్తే వేలాదిమంది నిరాశ్రయులవుతున్నారు. నీళ్లు ప్రవహించే ప్రాంతాలను మనం ఆక్రమించుకోవడం వల్ల వరదలొస్తున్నాయి. మూసీ బ్యూటిఫికేషన్‌ను.. లూటిఫికేషన్ అని విమర్శిస్తున్నారు. మహాత్మాగాంధీ విగ్రహానికి రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని అసత్యాలు చెబుతున్నారు. మహాత్మాగాంధీ విగ్రహానికి రూ.70 కోట్లు ఖర్చు చేస్తున్నాం. యుద్ధాన్ని శాంతితో గెలవచ్చని ప్రపంచానికి సందేశం ఇచ్చిన వ్యక్తి గాంధీ. బ్రిటీషు వాళ్లకు వ్యతిరేకంగా పోరాడినా.. గాంధీపై లాఠీ దెబ్బ పడలేదు. స్వాతంత్ర్యం వచ్చిన ఆర్నెళ్లలోనే గాంధీని పొట్టనపెట్టుకున్నవాళ్లు నీతులు చెబుతున్నారు"
>
> - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# రగులుతున్న పశ్చిమాసియా



## అమెరికా యుద్ధనౌక అబ్రహం లింకన్‌పై దాడి

### ప్రకటించిన ఇరాన్.. తోసిపుచ్చిన అగ్రరాజ్యం

- కూలిన అమెరికా ఈఫ్యూయలింగ్ విమానం
- ఇరాక్‌లో కూలినట్లు ప్రకటించిన అమెరికా
- తామే కూల్చామన్న ఇరాక్ రెబల్స్..
- టెహ్రాన్‌లో భారీ పేలుడు.. పలువురు మృతి
- ఒమన్‌లో డ్రోన్ దాడి.. ఇద్దరు భారతీయులు మృతి, 10 మందికి గాయాలు

**టెహ్రాన్(జనంసాక్షి):** అమెరికా విమాన వాహకనౌక అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించింది. తమ బాలిస్టిక్ క్షిపణులు ఈ యుద్ధ విమానాన్ని ఢీకొట్టాయని వెల్లడించింది. దాంతో అది పనిచేయడం లేదని, గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని పేర్కొంది. అయితే అమెరికా ఈ ప్రకటనను తోసిపుచ్చింది. ఇరాన్‌పై అమెరికా చేస్తోన్న 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'కి ఈ నౌక మద్దతు ఇస్తూనే ఉందంటూ ఇరాన్ ప్రకటనలను ఖండించింది. ఈమేరకు అమెరికా సెంట్రల్ కమాండ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టింది. అమెరికా మీడియా కథనాల ప్రకారం.. అబ్రహం లింకన్‌కు అతిదగ్గరగా ఓ ఇరాన్ పడవ వచ్చింది. దానిని గుర్తించిన అమెరికా దళాలు కాల్పులు జరిపాయి. అయితే ఈ ఘటనలో యూఎస్ నౌక దెబ్బతిన్నదా, లేదా అని మాత్రం పేర్కొనలేదు. ఇక, ఇరాన్‌తో యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ట్రంప్ సేనలు దీనిని దక్షిణ చైనా సముద్రం నుంచి పశ్చిమాసియాకు తరలించాయి. ఇందులో ఎనిమిది స్క్వాడ్రన్ల యుద్ధ విమానాలు ఉంటాయి.

మిగతా 2లో..

## త్వరలోనే ఇరాన్ లొంగిపోతుంది

- యుద్ధంపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు
- మొజ్తాబా ఖమేనీ తీవ్రంగా గాయపడ్డారు
- గుర్తుపట్టలేని విధంగా మారినట్లు భావిస్తున్నాం
- అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కీలక వ్యాఖ్యలు

**టెహ్రాన్(జనంసాక్షి):** దాదాపు రెండు వారాలుగా కొనసాగుతున్న ఇరాన్‌తో యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్? త్వరలోనే లొంగిపోతుందని పేర్కొన్నారు. రెండ్రోజుల క్రితం జీ7 నేతల వర్చువల్ భేటీలో ట్రంప్ పేర్కొన్నట్లు ఓ వార్త సంస్థ తెలిపింది. అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు ప్రతికారం తీర్చుకుంటామని, వారికి వ్యతిరేకంగా తమ పోరాటాన్ని కొనసాగించాలని ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ వ్యాఖ్యలకు ముందు ట్రంప్ చేపినట్లు తెలిపింది.

మిగతా 2లో..

## మా ఎల్పీజీ ట్యాంకర్లు హర్మూజ్ దాటేందుకు అనుమతివ్వండి

- ఇరాన్‌తో భారత్ చర్చలు
- భారత్ మా మిత్రదేశం
- అందుకే సురక్షిత మార్గం కల్పిస్తున్నాం: ఇరాన్ రాయబారి
- రష్యా నుంచి చమురు కొనుగోళ్లకు భారత్‌కు అమెరికా వాణిజ్య శాఖ అనుమతి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశంలో వంటగ్యాస్ కొరతపై ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం చర్యలు చేపట్టింది. ఇప్పటికే బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు ప్రయత్నిస్తుండగా.. వంట గ్యాస్ లభ్యతను పెంచేందుకు

మిగతా 2లో..



2లో..

# నిషేధం ఎత్తివేయండి.. లీగల్‌గా పనిచేస్తాం



## ఆపరేషన్ కగార్‌లో ఒకరికి 100 మంది చుట్టుముట్టారు

- నంబాల ఎన్‌కౌంటర్ తర్వాత సోను, సతీష్‌ల కుట్ర పార్టీకి అతిపెద్ద దెబ్బ
- వాళ్లు శత్రువులతో ములాఖత్ అయ్యారు..
- రివార్డు పెంచాలని కిందిస్థాయి వాళ్లు కోరడంపై క్షమాపణలు చెబుతున్నా..
- మీడియా సంస్థలతో దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి వెల్లడి

**హైదరాబాద్, మార్చి 13 (జనంసాక్షి) :** 'ప్రజల సమస్యల కోసం నిన్నటిదాకా సాయుధులుగా పోరాడాం. చట్టబద్ధ పరిధిలో ఇప్పుడు ప్రజల దైనందిన మౌలిక సమస్యల మీద పోరాటం చేస్తాం. పార్లమెంటరీ రాజకీయాల్లోకి వస్తున్నారని రకరకాల ఊహాగానాలతో తప్పుడు ప్రచారం చేయొద్దు' అని మావోయిస్టు పార్టీ మాజీ అగ్రనేత, అప్రటిత కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ స్పష్టం చేశారు. వ్యక్తిగత జీవితం కోసం బహిరంగ జీవనంలోకి రాలేదని, ప్రజా రాజకీయం కోసం మాత్రమే జనజీవన స్రవంతిలోకి వచ్చినట్టు వెల్లడించారు. అరెస్టయిన స్థితిలో అనివార్యంగా లొంగిపోయాం కానీ చావుకు భయపడలేదన్నారు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతం ప్రకారమే మా నడవడిక కొనసాగుతుందని, పార్టీపై నిషేధం ఎత్తివేస్తే లీగల్ ఫ్రేమ్ వర్క్‌లో పనిచేస్తామని చెప్పారు. పట్టణ, మైదాన, అటవీ ప్రాంతాల్లోని అన్నివర్గాల ప్రజల మౌలిక సమస్యలపైనా మా పోరాటం కొనసాగిస్తామని ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. ఫిబ్రవరి 24న మావోయిస్టు పార్టీ కీలక నేతలు దేవ్‌జీ, మల్లారాజిరెడ్డి, బడే చొక్కారావు, నూనె నరసింహారెడ్డి తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయిన విషయం విదితమే. తదనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సచివాలయంలో కీలక భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు ప్రతిపాదనలను సీఎం దృష్టికి తీసుకెళ్లిన దేవ్ జీ.. తాజాగా శుక్రవారం వివిధ మీడియా సంస్థలతో ముచ్చటించారు. ఆపరేషన్ కగార్, ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు తదితర అంశాలకు సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. తమది లొంగుబాటు కాదని, అడవిని వీడి బహిరంగ జీవితంలోకి


మిగతా 2లో..

## నేటినుంచి 'పది' పరీక్షలు

- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- హాల్ టిక్కెట్ చూపిస్తే ఉచిత బస్సు ప్రయాణం
- సకాలంలో సెంటర్‌కు చేరుకోవాలన్న అధికారులు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో పదో తంగతి వార్షిక పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ భారీగా ఏర్పాట్లు చేసింది. పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. హాల్ టిక్కెట్ చూపిస్తే దిగాల్సిన చోటు వరకు ఉచితంగా

మిగతా 2లో..





# అత్యవసర సేవలకు ఎటువంటి ఆటంకం కలగొద్దు

## మార్కెటింగ్ కంపెనీలతో సమన్వయం కోసం కమిటీలు

- కేంద్రం మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు
- అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చిన మంత్రి ఉత్తమ్
- ఇంధన, గ్యాస్ కొరతపై ప్రభుత్వం సమీక్ష

**హైదరాబాద్(జనంసాక్షి):** దేశవ్యాప్తంగా నెలకొన్న ఇంధన, గ్యాస్ సరఫరా పరిణామాలపై తెలంగాణ ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టింది. అత్యవసర సేవలకు ఎటువంటి ఆటంకం కలగకుండా గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరా అనేది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని గుర్తు చేస్తూ.. ప్రస్తుత పరిస్థితులపై మంత్రి ఉత్తమ్ పలు కీలక వివరాలను వెల్లడించారు. మార్కెట్‌లో కొంత మేర గ్యాస్ కొరత ఉందని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ప్రకటించిందని,

మిగతా 2లో..

## గ్యాస్ అనవసర బుకింగ్స్ వద్దు

### దేశంలో గ్యాస్ కొరత లేదు

### కేంద్రప్రభుత్వం స్పష్టీకరణ



2లో..




## తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్

### డిమాండ్లతో కూడిన నోటీస్ ఇచ్చిన జేఏసీ

**సికింద్రాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ఆర్టీసీలో మరోసారి సమ్మె సైరన్ మోగింది. టీజీఎస్ ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. శుక్రవారం నాడు బస్ భవన్‌లో ఆర్టీసీ ఉన్నతాధికారులకు జేఏసీ నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. అనంతరం లేబర్ కమిషనర్ కార్యాలయంలో సమ్మె నోటీసు ఇచ్చారు. ఆర్టీసీ సమ్మె తేదీపై 14 రోజుల తరువాత నిర్ణయం తీసుకుంటామని.. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లడం ఖాయమని

మిగతా 2లో..

## 90రోజుల నిబంధనపై సుప్రీంకోర్టు స్టే



- హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు నిలిపివేత
- కొత్త సినిమాలకు ఊరట..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సినిమా టికెట్ ధరల పెంపుపై ఇటీవల తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. టికెట్ రేట్లు పెంచాలంటే చట్టంలో ఉన్న నిబంధన ప్రకారం.. సినిమా విడుదలకు 90 రోజుల ముందే ప్రభుత్వం మెమో ఇవ్వాలని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై శుక్రవారం విచారణ జరగ్గా జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది. ప్రస్తుతానికి టికెట్ ధరల పెంపుపై ఎప్పుడూ అనుసరిస్తున్న విధానాన్నే కొనసాగించాలని సూచించింది. దీంతో త్వరలో విడుదల కాబోయే చిత్రాలకు ఊరట లభించింది. ప్రీమియర్స్‌తో పాటు, టికెట్ ధరలను పెంచుకునేందుకు వెసులుబాటు లభించింది. సంక్రాంతి సందర్భంగా విడుదలైన తెలుగు సినిమాల టికెట్ ధరల పెంచుతూ రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి మెమో జారీ చేశారు. దీనిపై హైకోర్టులో పిటిషన్ దాఖలు కాగా, న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. భవిష్యత్తులో టికెట్ ధరలను పెంచరాదంటూ స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా

మిగతా 2లో..

## అది మహిళల ఉద్యోగాలకే ముప్పు

### 'నెలసరి' సెలవుపై సుప్రీంకోర్టు

2లో..

## తప్పుడు హామీలతో దశాబ్దాలుగా వంచించారు

- అందుకే బోడోలాండ్ ప్రజలు కాంగ్రెస్‌కు ఉద్వాసన చెప్పి బీజేపీ-ఎన్డీయేకు పట్టం కట్టారు
- అసోంలో రూ.4,500 కోట్ల విలువైన ప్రాజెక్టులకు మోడీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

**గువాహటి(జనంసాక్షి):** అస్సాం అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారంనాడు ఆ రాష్ట్రంలో పర్యటించారు. రూ.4,500 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. షెడ్యూల్ ప్రకారం కోకరాఝార్‌లోని బహిరంగ సభలో మోదీ ప్రసంగించాల్సి ఉన్నప్పటికీ వాతావరణ ప్రతికూలత కారణంగా వేదిక వద్దకు

మిగతా 2లో..



## సీఈసీ అభిశంసనకు విపక్షాల నోటీసులు




**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కసరత్తులో అధికార భాజపాకు ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరిస్తోందని విపక్షాలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు లోక్‌సభ, రాజ్యసభల్లో అభిశంసన

మిగతా 2లో..



## రాజ్యాంగమే ప్రజల అసలైన గొంతుక

- గాడ్సే, వీర్‌సావర్క్‌ది కాదు
- అమెరికా కోసం మోదీ పనిచేస్తున్నారు
- సంవిధాన్ సమ్మేళన్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** రాజ్యాంగం ప్రజల గొంతుకని, నాథూరామ్ గాడ్సే, వీర్ సావర్కర్‌లది కాదని లోక్‌సభలో విపక్షనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగ సిద్ధాంతాన్ని పాటించరని ఆరోపించారు. ఉత్తర్‌ప్రదేశ్ లఖ్‌నవూలో జరిగిన సంవిధాన్ సమ్మేళన్‌లో రాహుల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "నిన్న పార్లమెంట్‌లో నేను ఎప్స్టీన్ అనే పదాన్ని ఉచ్చరించాను. దేశంలో గ్యాస్ సిలిండర్లు అందుబాటులో లేనందున ఈ సమస్య ఇంధన భద్రతకు సంబంధించినదని చెప్పాను. దేశ ఇంధన భద్రతలో మోదీ రాజీపడ్డారు.

మిగతా 9లో..

## తప్పుడు హామీలతో దశాబ్దాలుగా వంచించారు

చేరుకోలేకపోయారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. అస్సాం అభివృద్ధికి రూ.4,500 కోట్లతో పలు పనులు ప్రారంభించామని, ఇందులో రూ.1,100 కోట్లు బోడోలాండ్ ప్రాంతంలోని రోడ్ల కోసం ఖర్చు చేయనున్నామని చెప్పారు. అస్సాం మేళా ఇనిషియేటివ్ మూడో దశలో అస్సాంలో రోడ్ల అనుసంధానం మరింత పటిష్టమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, గౌహతి-న్యూ జల్‌పాయ్‌గురి ఎక్స్‌ప్రెస్‌లను మోదీ జెండా ఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ బోడోలాండ్‌ను తప్పుడు హామీలతో దశాబ్దాలుగా వంచించిందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే బోడోలాండ్ ప్రాంత ప్రజల కలలు సాకారమయ్యాయని అన్నారు. అటు కేంద్రంలో, ఇటు అస్సాంలో కాంగ్రెస్‌కు ప్రజలు ఉద్వాసన చెప్పి బీజేపీ-ఎన్డీయేకు అవకాశం ఇవ్వడంతో చిత్తశుద్ధితో తాము అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. కాంగ్రెస్ వివిధ గ్రూపుల మధ్య అసంతృప్తిని పెంచితే, శాంతి కోసం బీజేపీ పాటుపడిందని, బోడో పీస్ ఒప్పందంపై సంతకం చేసి అన్ని ప్రధాన సంస్థలు, గ్రూపులను ఏకతాటిపైకి తెచ్చిందని చెప్పారు. అస్సాంలో చొరబాటుదారులను కాంగ్రెస్ ప్రోత్సహించిందని, గిరిజనుల భూములను అక్రమంగా చొరబాటుదారులకు కట్టబెట్టిందని మోదీ విమర్శించారు. అయితే గిరిజనుల భూములు వారికే తిరిగి ఇప్పించేందుకు ముఖ్యమంత్రి శర్మ అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. దీనికి ముందు, అస్సాంలో రెండ్రోజుల పర్యటన కోసం గౌహతి వచ్చిన మోదీకి రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ, పలువురు రాష్ట్ర మంత్రులు, సీనియర్ అధికారులు సాదర స్వాగతం పలికారు.

## సీఈసీ అభిశంసనకు విపక్షాల నోటీసులు

తీర్మానం నోటీసులు అందజేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. నోటీసులపై 130 మంది లోక్‌సభ, 63 మంది రాజ్యసభ ఎంపీలు సంతకాలు చేసినట్లు సమాచారం.కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై అభిశంసన నోటీసు ఇవ్వడం ఇదే తొలిసారి. అయితే, సీఈసీ పక్షపాతంగా వ్యవహరించడం..తదితర ఏడు అభియోగాలు మోపినట్లు తెలుస్తోంది. విపక్ష ఇండియా కూటమిలో ఆమ్‌ఆద్మీ పార్టీ లేనప్పటికీ.. విపక్షాల తీర్మానంపై సంతకాలు చేసినట్లు తెలుస్తోంది. కొందరు స్వతంత్ర ఎంపీలు కూడా సంతకాలు చేయగా.. మరింత మంది ఎంపీలు ఈ తీర్మానానికి మద్దతుగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

## 90రోజుల నిబంధనపై సుప్రీంకోర్టు స్టే

విషయంలో ఎలా అనుమతించారని నిలదీసింది. 'రాజాసాబ్'తో పాటు ఈ సినిమాకూ ఒకే రోజు టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ మెమో జారీ చేసినప్పుడు.. ఆ విషయాన్ని కోర్టు దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించింది. టికెట్ ధరలు పెంచొద్దని హైకోర్టు ఉత్తర్వులు వెలువరించిన విషయం తెలిసీ ఈ నెల 10న పబ్లిక్ డొమైన్‌లో 'ధరల పెంపు మెమో'ను పెట్టడంపై సుమోటో కోర్టు ధిక్కరణగా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిపింది. ఇకపై టికెట్ ధరల పెంపు నిర్ణయాన్ని సినిమా విడుదలకు 90 రోజుల ముందే వెల్లడించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలపై మైత్రీ మూవీ మేకర్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఆ ఉత్తర్వులపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది.

## అది మహిళల ఉద్యోగాలకే ముప్పు

న్యూఢిల్లీ(జనంసాక్షి):నెలసరి సెలవును తప్పనిసరి చేస్తే అది మహిళల ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. మనం అలాంటి చట్టాలు చేస్తే.. కంపెనీలు మహిళలను తీసుకోవని అభిప్రాయపడింది. ఆ సెలవుకు సంబంధించిన నియమాలను రూపొందించేలా రాష్ట్రాలను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది."అలాంటి చట్టం తాము పురుషుల కంటే తక్కువ అనే భయం ఉద్యోగాలు చేసే మహిళల్లో సృష్టించే అవకాశం ఉంది. రుతుక్రమం అంశంపై అవగాహన కల్పించడం వేరు.. దానిని సెన్సేషన్ చేయడం వేరు. ఈ సెలవును తప్పనిసరి చేస్తూ చట్టాన్ని తీసుకువచ్చిన మరుక్షణం ఎవరూ వారిని నియమించుకోరు. సంస్థల యాజమాన్యాల మనస్తత్వం మీకు తెలియదు" అంటూ పిటిషనర్‌ను ఉద్దేశించి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు.ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది ఎంఆర్ షంషద్ తన వాదనలు వినిపించారు. 2013లో ప్రభుత్వం ఆధ్వర్యంలోని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థినులకు నెలసరి సెలవును మంజూరుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రైవేటు కంపెనీలు కూడా అలాంటి వెలుసుబాటును కల్పించాయని కోర్టుకు వెల్లడించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. అవన్నీ స్వచ్ఛందంగా తీసుకున్న చర్యలన్నారు. ఆ సెలవును తప్పనిసరి చేస్తే.. మహిళల కెరీర్ ముగుస్తుందని మరోసారి ప్రస్తావించారు.మహిళల కెరీర్‌ను దృష్టిలోపెట్టుకొని గతంలో ఈ అంశంపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "ఇందులో రెండు పార్శ్వాలు ఉన్నాయి. నెలసరి సెలవులు ఇస్తే ఉద్యోగాల్లో చేరేందుకు మరింతమంది మహిళలను ప్రోత్సహించినట్లవుతుంది. అయితే, వీటిని తప్పనిసరి చేయాలని యజమానులను బలవంతపెడితే అది ప్రతికూల పరిస్థితులకు దారితీయొచ్చు. మహిళలను ఉద్యోగాల్లో నియమించుకునే అవకాశాలు కూడా తగ్గొచ్చు. అది మేం కోరుకోవట్లేదు.

# నిజాం చేసిన అభివృద్ధిలో నాలుగొవంతైనా చేయాలి

కాదు. పాతబస్తీలో మెట్రో, రోడ్ల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అభివృద్ధి పనుల కోసం రూ. వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం అని వివరించారు. హైదరాబాద్ నగరంలోని చెరువులను పునరుద్ధరిస్తున్నాం. అందుకు ప్రజలు మాకు ఘన స్వాగతం పలుకుతున్నారు. మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్నవాళ్లు.. మూసీ పక్కన నివసిస్తారా? అలాంటి వాళ్లకు కంటెయినర్ హౌస్‌లు ఇస్తా.. అక్కడ నివసిస్తారా? మూసీకి వరదలొస్తే వేలాదిమంది నిరాశ్రయులవుతున్నారు. నీళ్లు ప్రవహించే ప్రాంతాలను మనం ఆక్రమించుకోవడం వల్లే వరదలొస్తున్నాయి. మూసీ ప్రక్షాళన చేయక పోతే నల్గొండ ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. భవిష్యత్ తరాలకు కోలుకోలేని దెబ్బ తగులుతుంది. వారి బాధల్ని కూడా పరిగణలోకి తీసుకొని ప్రాజెక్టుపై ముందుకు వెళ్తున్నాం. దీనికి అందరి సహకారం కావాలని రేవంత్‌రెడ్డి అన్నారు.మూసీ ప్రాజెక్టుపై కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రజల్ని ఆందోళనకు గురి చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మరికొందరు అసంపూర్తి సమాచారంతో తప్పుడు ప్రచారం చేశారన్నారు. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఇతర దేశాలు వేగంగా అభివృద్ధి వైపు పయనిస్తున్నాయని తెలిపారు. మనం కూడా అభివృద్ధి వైపు పయనిం చాలనే మూసీ పునరుజ్జీవం చేస్తున్నట్లు సీఎం రేవంత్ వివరించారు. ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం ఇచ్చారన్నారు. వారికి తాము కాపాలదారులుగా ఉంటామని స్పష్టం చేశారు. సింగపూర్, దుబాయ్, లండన్, సియోల్ నగరాలలో తాను పర్యటించానని చెప్పారు. మనకు ఏం అవసరమో అక్కడ స్టడీ చేసి వచ్చామన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లోనే ఆర్థిక వ్యవస్థ విరాజిల్లిందన్నారు. గొప్ప నగరం హైదరాబాద్‌ను నిజాం రాజులు మనకు అందించారని తెలిపారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు నేటికీ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని చెప్పారు. మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. తమకు పొలిటికల్ డిఫరెన్స్ ఉండొచ్చు.. కానీ పొలిటికల్ పెరాలసిస్ లేదని కుండబద్దలు కొట్టారు. మూసీ పునరుజ్జీవనాన్ని బీఆర్ఎస్, బీజేపీలు ఎందుకు వ్యతిరేకిస్తున్నాయని ఆయన సందేహం వ్యక్తం చేశారు. వ్యతిరేకించడం కాదు.. ఎలా చేద్దామో సలహా ఇవ్వండంటూ ఆయా పార్టీల అధినేతలు, అగ్రనేతలకు సీఎం రేవంత్ సూచించారు. మీ సలహాలు స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ప్రపంచంతో పోటీ పడుతూ అభివృద్ధి జరగొద్దా? అని ఆయా పార్టీల నేతలకు సీఎం రేవంత్ ఈ సందర్భంగా చురకలంటించారు. అపార మేధో సంపత్తి ఉందని చెప్పేవారు ప్రాజెక్టుల్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. పాలసీలు, వర్కింగ్ స్టైల్ మార్చుకున్నామని చెప్పారు. కొద్దిమంది ముఖ్యమంత్రులే ప్రజలకు గుర్తున్నారని పేర్కొన్నారు. వారు వేసిన పునాదులే అలా గుర్తుంచుకునేలా చేశాయని చెప్పారు. ఎంతసేపు రంగారెడ్డి జిల్లా గురించే ఆలోచిస్తున్నారన్నారు. నల్గొండ జిల్లా గురించి ఎవరైనా ఆలోచిస్తున్నారా? అని ప్రశ్నించారు. మేం తెచ్చే ప్రాజెక్ట్ ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. బుల్‌డోజర్లతో కూల్చేస్తున్నారని అంటున్నారని చెప్పారు. అవి చదువుకున్నవాళ్లు మాట్లాడే మాటలా అని ప్రతిపక్షాలను ఆయన సూటిగా ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టును అడ్డుకునే వాళ్లు మూడు నెలలు అక్కడ నివసిస్తారా? అంటూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. కన్యాకుమారి లాగా బాపూఘాట్ కూడా రెండు నదుల సంగమం అని ఎంతమందికి తెలుసునని ప్రశ్నించారు. గోదావరి జలాల్లో 20 టీఎంసీలను మూసీకి తరలించే పనులు చేపట్టినట్లు తెలిపారు. గాంధీ విగ్రహానికి సుమారుగా రూ.75 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ వాళ్లు అంబేద్కర్ విగ్రహానికి కోట్లు ఖర్చు చేస్తే తాము వ్యతిరేకించలేదని సీఎం రేవంత్ చెప్పారు.

## అత్యవసర సేవలకు ఎటువంటి ఆటంకం కలగొద్దు

దానికి అనుగుణంగా రాష్ట్రాలకు కొన్ని మార్గదర్శకాలను జారీ చేసిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గ్యాస్ ప్రొడక్షన్‌ను పెంచామని కేంద్రం తెలిపిందని, ఈ నేపథ్యంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్రానికి 1740 కిలో లీటర్ల కిరోసిన్ సరఫరా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో సివిల్ సప్లై కమిషనర్, పోలీస్ అధికారులు, ఇతర ఉన్నతాధికారులతో రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ప్రతి జిల్లాలో కలెక్టర్, ఎస్పీ, వైద్య అధికారులు కంపెనీ ప్రతినిధులతో కూడిన కమిటీలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తాయి. కమాండ్ కంట్రోల్ రూమ్: హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయంలో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, సరఫరాలో అంతరాయాలను నివారిస్తున్నారు. తమను కూడా అత్యవసర సేవల కింద గుర్తించి సిలిండర్లు సరఫరా చేయాలని హోటల్, రెస్టారెంట్ యజమానులు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అత్యవసర సేవలకు గ్యాస్ కొరత లేకుండా చూసే పూర్తి బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుందని ఉత్తమ్ చెప్పారు.

## నేటినుంచి 'పది' పరీక్షలు

ప్రయాణం కల్పిస్తారు. ఇకపోతే పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని అధికారులు సూచించారు. ఐదు నిముషాల ఆలస్యాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,28,239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో 5,17,727మంది రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన 10,512మంది విద్యార్థులు ఉన్నారు. ఈసారి ప్రైవేటు పాఠశాల నుంచి అత్యధికంగా 2,50,015 విద్యార్థులుండగా, ప్రభుత్వ బడుల నుంచి 2,07,573 మంది, సంక్షేమ గురుకులాల నుంచి 60,139 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 1,582 ప్రభుత్వ, 1,094 ప్రైవేటు విద్యాసంస్థలు ఉన్నాయి. హాల్ టికెట్లు ఇప్పటికే అన్ని పాఠశాలకు పంపించామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. పాఠశాల గుర్తింపు తెలియకుండా సాధారణ దుస్తుల్లోనే విద్యార్థులు పరీక్షకు రావాలని కోరారు. పరీక్షల పర్యవేక్షణకు 144 ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటుచేశామన్నారు. పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30వరకు ఉంటాయి. పదవ తరగతి పరీక్షల సమయం సమీపిస్తున్న కొద్దీ విద్యార్థుల్లో ఒత్తిడి మొదలవుతుంది. ఒత్తిడిని జయించడానికి విద్యార్థులు ఏకాగ్రతతో ప్రణాళికబద్ధంగా చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారని నిపుణులు సూచిస్తున్నారు. ఇతర ఆలోచనలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షల సమయంలో సెల్‌ఫోన్, టీవీ వైపు మనస్సు మరలకుండా చూసుకోవాలి. ప్రతిరోజూ విద్యార్థి ఏర్పాటు చేసుకున్న టైం టేబుల్ ప్రకారం చదువు కోవాల్సి ఉంటుంది.

## త్వరలోనే ఇరాన్ లొంగిపోతుంది

ఇరాన్‌కు మరోసారి అమెరికా అధ్యక్షుడుల డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. మతిచెడిన ఉన్మాదులకు ఇవాళ ఏం జరుగుతుందో చూడండని అంటూ ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యిందని, వైమానికదళం కూడా ఇక లేదని తెలిపారు. ఇరాన్ నాయకులు భూమిపై నుంచి తుడిచిపెట్టుకుపోయారని పేర్కొన్నారు. వారి క్షిపణులు, డ్రోన్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని పేర్కొన్నారు. 47 ఏళ్లుగా ఇరాన్ నేతలు అమాయకులను పొట్టనపెట్టుకున్నారన్నారని తెలిపారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా వారిని అంతం చేయడం తనకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్టు చెప్పారు.

మొజ్తాబా ఖమేనీ తీవ్రంగా గాయపడ్డారు

అమెరికా, ఇజ్రాయెల్‌లపై ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ నూతన సుప్రీం లీడర్ ఆయతుల్లా మొజ్తాబా ఖమేనీ ప్రకటించిన నేపథ్యంలో అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కీలక వ్యాఖ్యలు చేశారు. సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తీవ్రంగా గాయపడ్డారని, గుర్తుపట్టలేని విధంగా మారినట్లు భావిస్తున్నామన్నారు. అయితే, వీటికి సంబంధించి ఎటువంటి ఆధారాలు చూపించలేదు. పెంటగాన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన.. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాన్ని అంతం చేయడంపైనే అధ్యక్షుడు ట్రంప్ దృష్టి పెట్టారని అన్నారు. ఇరాన్ అణ్వాయుధాల కార్యక్రమం ముగింపే తమ ప్రధాన లక్ష్యమని అమెరికా రక్షణ మంత్రి పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌తో కలిసి ఇప్పటివరకు 15వేల లక్ష్యాలపై దాడులు చేశామన్నారు. మిగతా అన్ని స్థావరాలను ధ్వంసం చేయాలని యోచిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో దాడులు మరింత తీవ్రంగా ఉంటాయన్నారు. ప్రాథమిక పాఠశాలపై ఎలా దాడి జరిగిందని అడిగిన ప్రశ్నకు సమాధానం దాటవేసిన పీట్ హెగ్సెత్.. అమెరికా ఎన్నడూ పౌరులను లక్ష్యంగా చేసుకోదన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు జరిపేందుకు ఓ అధికారిని నియమించామన్నారు.

## తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్

జేఏసీ నేతలు తేల్చి చెప్పారు.తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే చేపట్టాలన్నారు. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలి. మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా రూ.350 కోట్లు కోత లేకుండా ఇవ్వాలి.పాత బకాయిలు రూ.2,500 కోట్లు వెంటనే విడుదల చేయాలి.ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలి.అన్ని కేటగిరీల్లో పనిచేసే ఉద్యోగులపై అధిక పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు.

## గ్యాస్ అనవసర బుకింగ్స్ వద్దు

న్యూఢిల్లీ(జనంసాక్షి):పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎల్‌పీజీ కొరత ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఎలాంటి భయాందోళనలు వద్దని, 'ప్యానిక్ బుకింగ్' అవసరం లేదని తెలిపింది. సంక్షోభం లేదని వివరించింది. గృహావసరాల కోసం ఎలాంటి అంతరాయం లేకుండా పైపుల ద్వారా సహజ వాయివు , కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ సరఫరాకు భరోసా ఇచ్చింది. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ శుక్రవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ, ఆసుపత్రులు, హాస్టల్స్‌కు ఎల్‌పీజీ సరఫరాకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. మార్చి 2026తో పోల్చుకుంటే దేశంలో ఎల్‌పీజీ ఉత్పత్తి 40 శాతం పెరిగిందని, అదనంగా రాష్ట్రాలకు 48,000 కిలోలీటర్ల (సుమారు 48 మిలియన్ లీటర్లు) కిరోసిన్ పంపిణీ చేశామని తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లకు బొగ్గు సరఫరా చేయాలని కోల్ ఇండియాను ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు.



## రగులుతున్న పశ్చిమాసియా

అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించడం ఇదే తొలిసారి కాదు. యుద్ధం ప్రారంభమైన మూడు రోజుల తర్వాత నాలుగు క్షిపణులతో దాడి చేశామని చేసిన ప్రకటన కలకలం సృష్టించింది. అయితే ఆ ప్రకటనలో నిజం లేదని అప్పుడు కూడా అమెరికా తోసిపుచ్చింది. ఇరాన్ వద్ద భారీస్థాయిలో హైపర్‌సోనిక్, నౌకా విధ్వంసక క్షిపణులు ఉన్నప్పటికీ అవి అమెరికన్ విమాన వాహక నౌకను తాకడం దాదాపుగా అసాధ్యమనే చెబుతుంటారు. విమాన వాహక నౌక ప్రధాన బలం దాని మీద ఉండే యుద్ధ విమానాలే. యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌పై ఎఫ్/ఏ-18 సూపర్ హార్నెట్, ఎఫ్-35సి స్టెల్త్ యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు సహా అనేక విమానాలు ఉన్నాయి. ఇవి శత్రువుపై దాడి చేయడంతోపాటు విమాన వాహకనౌకను రక్షించే సామర్థ్యాన్ని కలిగిఉన్నాయి. పోరు సమయంలో విమాన వాహక నౌక సాగరంలో స్థిరంగా ఉండదు. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో కదులుతుంటుంది. రియల్‌టైమ్ ఉపగ్రహ నెట్‌వర్క్ లేకుండా దీని జాడను ఎప్పటికప్పుడు పసిగట్టడం కష్టం. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ ప్రస్తుతం అరేబియా సముద్రంలో.. ఇరాన్ తీరానికి దూరంలో వ్యూహాత్మక ప్రదేశంలో సంచరిస్తున్నట్లు తెలుస్తోంది.ఇరాన్ సమీపంలో మోహరించిన అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ లో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. 'జెరాల్డ్‌లోని లాండ్రీ ప్రదేశాల్లో ఈ మంటలు చెలరేగాయి. అయితే అందుకు యుద్ధం కారణం కాదు. ఆ మంటలను ఆర్పేశాం. నౌకలోని ప్రొపల్షన్ ప్లాంట్‌కు ఎలాంటి డ్యామేజ్ జరగలేదు. గాయపడిన ఇద్దరు నావికులకు చికిత్స అందుతోంది. వారి ఆరోగ్యం నిలకడగా ఉంది. ఈ నౌక ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో భాగంగా ఎర్రసముద్రంలో తన సహకారాన్ని కొనసాగిస్తోందని సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.

కూలిన అమెరికా ఈఫ్యూయలింగ్ విమానం

అమెరికా వాయుసేనకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ-135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్‌లో గురువారం కుప్పకూలింది. అయితే ఈ ప్రమాదంలో ఎంతమంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారో అమెరికా అధికారులు ప్రకటించలేదు. సహాయ కార్యక్రమాలు చేపట్టినట్లు చెబుతున్నారు. ఈ ఘటనపై అమెరికా సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. రెండు సైనిక ట్యాంకర్ విమానాలు ల్యాండ్ అవుతుండగా ఈ ఘటన జరిగినట్లు వెల్లడించింది. రెండో విమానం సురక్షితంగా దిగినట్లు పేర్కొంది. మరోవైపు ఇరాక్‌కు చెందిన ఇస్లామిక్ రెసిస్టెన్స్ రెబల్ గ్రూప్ తామే అమెరికా విమానాన్ని కూల్చేసినట్లు ప్రకటించింది. ఈ గ్రూప్ ఇరాన్‌కు అనుకూలంగా పనిచేస్తోంది. ఆ సంస్థ అధికారిక టెలిగ్రామ్ ఛానెల్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. అయితే ఈ ప్రకటనను అమెరికా సెంట్రల్ కమాండ్ తోసిపుచ్చింది. శత్రువుల దాడి లేదా ఫ్రెండ్లీ ఫైర్‌లో ఇది కూలిపోలేదని వెల్లడించింది. ఈ ఘటనలో ఆరుగురు సిబ్బంది చనిపోయినట్లు ఇరాన్ మీడియా చెబుతోంది. కేసీ-135 స్ట్రాటోట్యాంకర్‌లో కనీసం ముగ్గురు సిబ్బంది ఉండాల్సి ఉంటుంది. వీరిలో పైలట్, కోపైలట్, ఆపరేటర్ ఉంటారు. వీరితోపాటు నేవిగేటర్, మిషన్ ఆధారంగా అదనపు సిబ్బందిని తరలిస్తుంటారు. ఇరాన్ యుద్ధంలో తీవ్రమైన పనిఒత్తిడి ఉన్న కార్యక్రమం విమానాలకు గాల్లో ఇంధనం నింపడమే. వందల సంఖ్యలో అమెరికా, ఇజ్రాయెల్ విమానాలు దాడులకు వెళుతుండటంతో ట్యాంకర్ విమానాల అవసరాలు గణనీయంగా పెరిగాయి.

టెహ్రాన్‌లో భారీ పేలుడు..

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు సంభవించింది. అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా టెహ్రాన్ స్క్వేర్‌లో ఆందోళనకారులు నిరసన వ్యక్తం చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు అక్కడి అధికారిక మీడియా వెల్లడించింది. ఇరాన్‌లోని మరో నగరం ఖజ్విన్‌లోనూ భారీ పేలుడు సంభవించింది. ఈ దాడులు ఎవరు చేశారనే విషయం తెలియరాలేదు. అయితే, ఖజ్విన్, టెహ్రాన్‌లో పేలుళ్లు జరుపుతామని ఇజ్రాయెల్ ముందే హెచ్చరించింది. మరోవైపు.. దాడులు జరుగుతున్నప్పటికీ వేలాది మంది పౌరులు టెహ్రాన్ వీధుల్లోకి వచ్చి ఇజ్రాయెల్, అమెరికాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండటం గమనార్హం.ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి హెచ్చరికలు చేశారు. మతి చెడిన నేతలకు ఇవాళ ఏం జరుగుతుందో మీరే చూస్తారని అన్నారు.

## నిషేధం ఎత్తివేయండి.. లీగల్‌గా పనిచేస్తాం

వచ్చామని తెలిపారు. మావోయిస్టు పార్టీది చాలా సమగ్రమైన ఏజెండా అని వివరించారు. 'ఆర్థిక, రాజకీయ, సామాజిక సాంస్కృతిక, పర్యావరణం వంటి అంశాలు మా కీలక ఏజెండాలు. భూగోళం సంక్షోభంలో ఉన్నప్పుడు పర్యావరణం గురించి ఆలోచించాం. దళితులు, బీసీల ఆత్మగౌరవ సమస్యలతో పాటు భూ సమస్యలున్నాయి. ఇవి ఉన్నంతకాలం ప్రజల గుండెల్లో మావోయిస్టు పార్టీ ఉంటుంది. కోట్లాది మంది తమకు మావోయిస్టు పార్టీయే నాయకత్వం వహిస్తుందని నమ్ముతున్నారు' అని దేవ్‌జీ పేర్కొన్నారు. సమాజంలో పరిస్థితులు మారినా పేదరికం, వేధింపులు తగ్గలేదని, దోపిడీ రూపం మారింది కానీ ఆగలేదన్నారు. దోపిడీ ఉన్నంతకాలం మావోయిస్టు ఉద్యమం ఉంటుందని వెల్లడించారు.

**హిడ్మాది బూటకపు ఎన్‌కౌంటర్**

హిడ్మా లొంగిపోతానని చెప్పినప్పుడు తాము వారించామని, అయితే పోలీసుల ట్రాప్‌లో పడి ఆయన ప్రాణాలు కోల్పోయారని దేవ్‌జీ అన్నారు. హిడ్మాది వంద శాతం బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఆయనను చిత్రహింసలకు గురిచేసి చంపేశారని ఆయన ఆరోపించారు. 'ఆపరేషన్ కగార్' సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోకపోవడం వల్లే ప్రతిఘటన అనివార్యమైందని, ఆ పోరాటంలోనే బస్వరాజును కోల్పోయామని వెల్లడించారు. మరోవైపు, అగ్రనేత గణపతి గురించి స్పందిస్తూ.. 2023లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఆయనను చివరిసారిగా చూశానని, ఆ తర్వాత ఆయనతో సంబంధాలు లేవని దేవ్‌జీ స్పష్టం చేశారు. సమాజంలో దోపిడీ రూపం మార్చుకుందే తప్ప తొలగిపోలేదని, దోపిడీ ఉన్నంత కాలం ఉద్యమం కొనసాగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మావోయిస్టు పార్టీపై నిషేధాన్ని ఎత్తివేసి, జైళ్లలో ఉన్న వారిని రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు.

**విజ్ఞప్తులను కేంద్రం పట్టించుకోలేదు..**

ఆపరేషన్ కగార్ యుద్ధం మొదలయ్యే సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోలేదు. కేంద్రం పట్టించుకోనందునే ప్రతిఘటన అనివార్యమైంది. ఈ పోరాటంలో బస్వరాజును కోల్పోయాం. ఆయన మరణం అనంతరం కొందరు లోపల (అడవుల్లో).. కొందరు బయట(జనంలో) ఉండాలని నిర్ణయించుకున్నాం అని దేవ్‌జీ చెప్పారు. ఈ క్రమంలోనే హిడ్మా లొంగిపోవాలనుకోవడం, ట్రాప్‌లో పడి ఎన్‌కౌంటర్ కావడం జరిగింది. ప్రస్తుతం గణపతి ఎక్కడున్నారో మాకు తెలియదు. 2023లో చివరిగా సెంట్రల్ కమిటీ సమావేశం జరిగింది. 2023 తర్వాత పార్టీకి దిశా నిర్దేశం చేయడం సాధ్యం కాలేదు. మావోయిస్టు పార్టీ అనేది ఒక రాజకీయ పార్టీ. పార్టీ నడవాలంటే డబ్బులు కావాల్సి ఉంటుంది. డబ్బు రూపకంగా కాకుండా.. ఉన్న డబ్బుతో బంగారాన్ని కొనుగోలు చేస్తే బాగుంటుందని భావించా. బంగారాన్ని కొనుగోలు చేశాం. అయితే.. కిలోల కొద్దీ బంగారం, కోట్ల రూపాయల డబ్బు ఉందని మాపైన, పార్టీపైన దురుద్దేశంతో ప్రచారం జరిగిందని దేవ్‌జీ పేర్కొన్నారు. పార్లమెంటరీ వ్యవస్థలోని ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ అవ్వాలని నా మనసులో లేదు. ప్రజల్లో ఉండి ప్రజల కోసం లీగల్‌గా పోరాటం చేయడమే నా రాజకీయ జీవితం. జైల్లో ఉన్నవారిని విడుదల చేయాలని కోరాం' అని అన్నారు.

ఒక్కరికి వందలాది మంది బలగాలు..

ఒక్కో పార్టీ కార్యకర్త లేదా గెరిల్లా వెనుక 100 నుండి 200 మంది బలగాలను మోహరించి, మూడు-నాలుగు అంచెలుగా సైనిక దాడి జరిపారని దేవ్‌జీ వివరించారు. ఒక చిన్న గెరిల్లా దళాన్ని నిర్మూలించడానికి దేశవ్యాప్తంగా 8.5 లక్షలకు పైగా పోలీసు, పారా మిలటరీ, వివిధ రకాల కమాండో దళాలతో పాటు భారత సైన్యం, వాయుసేనను కూడా రంగంలోకి దించి కేంద్రం యుద్ధం చేసిందని పేర్కొన్నారు. తమ లొంగుబాటుకు ఇవన్నీ సెంకడరీ కారణాలైతే.. రాజకీయంగా ఒక బలమైన నినాదాన్ని తీసుకుని ప్రజల ముందుకు వెళ్లకపోవడమే ప్రధాన పొరపాటని ఆయన విశ్లేషించారు. గెరిల్లా ఎత్తుగడలు అజేయమైనవని, కానీ వాటిని సరైన విధంగా ఆచరించకపోవడం వల్లే పార్టీ నిర్వీర్యమైందని దేవ్ జీ వెల్లడించారు. 'ఆపరేషన్ కగార్' తమకు చాలా చిన్న విషయమని దేవ్ జీ పేర్కొన్నారు. పార్టీలో లక్షలాది మంది ప్రజలతో కలిసి పట్టణాల్లో, మైదానాల్లో, అడవుల్లో దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగించినట్లయితే.. అంతటి ప్రజా పునాది కలిగిన మావోయిస్టు పార్టీని ఏ 'ఆపరేషన్ కగార్' కూడా ఏమీ చేయలేదని ఆయన స్పష్టం చేశారు. రాజకీయంగా సకాలంలో సరైన నిర్ణయం తీసుకోకపోవడమే పార్టీకి నష్టం కలిగించిందని, ఆ లోపాన్ని సరిదిద్దుకునే అవకాశం లేకుండా కేంద్ర బలగాలు తమపై ఎడతెరిపి లేకుండా దాడులు చేశాయని తెలిపారు. పార్టీ వైఫల్యాలను సమీక్షించుకునేలోపే ప్రభుత్వం 'పిచ్చుకపై బ్రహ్మాస్త్రం'లాగా ఈ ఆపరేషన్ చేపట్టిందన్నారు

## మా ఎల్పీజీ ట్యాంకర్లలకు హర్మూజ్ దాటేందుకు అనుమత్విండి

భారత్‌కు రావాల్సిన ఎల్పీజీ ట్యాంకర్ల కోసం ఇరాన్‌తో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ జాతీయమీడియా కథనాలు వెల్లడించాయి.భారత్‌కు పయనమైన 8 ఎల్పీజీ ట్యాంకర్లు ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రస్తుతం హర్మూజ్ జలసంధి వద్ద నిలిచిపోయాయి. వీటిని సురక్షితంగా జలసంధిని దాటించేందుకు భారత ప్రభుత్వం ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఇందుకు ఇరాన్ అధికారులు సానుకూలంగానే స్పందిస్తున్నారని, త్వరలోనే ఆ ట్యాంకర్లు హర్మూజ్‌ను దాటే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.మరోవైపు, ఇప్పటికే పశ్చిమాసియా యుద్ధ జ్వాలల నుంచి రెండు చమురు నౌకలు చాకచక్యంగా బయటపడ్డాయి. ఇందులో ఒకటి బుధవారం భారత్‌కు చేరుకోగా.. మరొకటి రెండ్రోజుల్లో రానుంది. ఈ రెండింటి ద్వారా 3 మిలియన్ బ్యారెళ్ల చమురు అందుబాటులోకి రానుంది.

కేరళలో 40శాతం హోటళ్లు బంద్

ఇదిలాఉండగా.. దేశంలో వంటగ్యాస్ కొరత ఆందోళనలు రోజురోజుకీ తీవ్రమవుతున్నాయి. ఇప్పటికే పలు నగరాల్లో వాణిజ్య సిలిండర్లు దొరకట్లేదు. దీంతో హోటళ్లు, రెస్టారంట్లు, హాస్టళ్ల నిర్వహణకు ఇబ్బందులు తలెత్తాయి. ఇప్పటికే కొన్ని హోటళ్లు మూతపడ్డాయి. కేరళలో శుక్రవారం నాటికి 40శాతం రెస్టారంట్లు పనిచేయడం లేదు. ప్రత్యామ్నాయ కుకింగ్‌కు అవకాశం లేకపోవడంతో తాము వ్యాపారం నిలిపివేస్తున్నామని ఆయా రెస్టారంట్ల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి. దేశంలో ఇంధన కొరత లేదని కేంద్రం ప్రకటించినప్పటికీ.. కొన్ని గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాలు, పెట్రోల్ బంకుల బయట ప్రజలు బారులు తీరడం ఆందోళన కలిగిస్తోంది.

**రష్యా నుంచి చమురు కొనుగోళ్లు**

ఇరాన్ - ఇజ్రాయెల్, అమెరికాల ఉద్రిక్తతల నేపథ్యంలో తీవ్ర ఇంధన సంక్షోభం ఎదుర్కొంటున్న వేళ ప్రపంచ దేశాలకు కాస్త ఉపశమనం లభించింది. రష్యా చమురు కొనుగోలుకు స్వల్పకాలికంగా అనుమతినిస్తూ అమెరికా ఉత్తర్వులు జారీ చేసింది. సముద్రంలో నిలిచిపోయిన చమురును కొనుగోలు చేసేందుకు ఏప్రిల్ 11 వరకు అవకాశం కల్పించింది. ఇరాన్ - ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లో నెలకొన్న అనిశ్చితిని తొలగించేందుకు అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్న తరుణంలో గ్లోబల్ ఎనర్జీ మార్కెట్‌లో స్థిరత్వాన్ని తీసుకు రావడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్టు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 'ప్రపంచ ఇంధన మార్కెట్‌లో స్థిరత్వాన్ని పెంపొందించడం, ధరలను అదుపులో ఉంచేందుకే ట్రంప్ ఈ నిర్ణయాత్మక చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతానికి సముద్రంలో నిలిచిపోయిన చమురు రవాణాకు మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయి' అని బెసెంట్ స్పష్టం చేశారు. రష్యాపై ఆంక్షలు అమల్లో ఉన్నప్పటి కీ అమెరికా తాత్కాలిక సడలింపులతో పుతిన్ ప్రభుత్వానికి పెద్దగా ఆర్థిక ప్రయోజనం ఉండదని బెసెంట్ అన్నారు. రష్యాకు వచ్చే ఆదాయంలో అధిక భాగం చమురు వెలికితీసే సమయంలోనే పన్నుల రూపంలో అందుతుందని, ఇప్పుడు రవాణాలో ఉన్న చమురు అమ్మకం వల్ల వారికి అదనపు ప్రయోజనమేమీ ఉండదని ఆయన వివరించారు. ఈ నిర్ణయం వల్ల స్వల్పకాలికంగా ధరలు పెరిగినా.. దీర్ఘకాలంలో అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఇది ఎంతో మేలుచేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అయితే.. తాజా సడలింపులతో మార్చి 12 నాటికి నౌకల్లో లోడ్ అయిన రష్యా ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులను ఏప్రిల్ 11 వరకు విక్రయించుకోవచ్చు. గతంలో అమెరికా ఆంక్షలు విధించిన రష్యన్ సంస్థల నుంచి ఉత్పత్తైన చమురును కూడా ఇప్పుడు కొనుగోలు చేసుకోవచ్చు. ఇకపోతే ప్రపంచ దేశాల్లో ఇంధన సంక్షోభం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో భారత్‌కు ఇరాన్ ఉపశమనం కలిగించింది. భారతీయ ట్యాంకర్లను హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లేందుకు అనుమతించింది. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రమణ్యం జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మధ్య జరిగిన చర్చల అనంతరం.. భారత జెండాలు కలిగిన నౌకలకు టెహ్రాన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు పలు మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ పరిణామంతో అమెరికా, ఇజ్రాయెల్, ఐరోపా దేశాలకు చెందిన నౌకలు ఆంక్షలు ఎదుర్కొంటున్నప్పటికీ.. పుష్పక్, పరిమళ్ అనే రెండు భారతీయ ట్యాంకర్లు వ్యూహాత్మకంగా హోర్ముజ్ జలసంధిని దాటినట్టు పేర్కొన్నాయి.

## తార్నాక ఆర్టీసీ ఆసుపత్రికి కొత్త హంగులు

**రోగుల వద్దకే వెళ్లే అత్యాధునిక పోర్టబుల్ ఎక్స్‌రే సౌకర్యం**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ఆర్టీసీ వీసీ, ఎండీ వై. నాగిరెడ్డి చొరవతో తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రి వైద్య సేవల్లో మరో ముందడుగు పడింది. సామాజిక బాధ్యతలో భాగంగా కెనరా బ్యాంక్ అనుబంధ సంస్థ 'క్యాన్ ఫిన్ హోమ్స్' వారు రూ. 20 లక్షల విలువైన అత్యాధునిక 'మొబైల్ డిజిటల్ పోర్టబుల్ ఎక్సరే' మిషన్‌ను ఆసుపత్రికి విరాళంగా అందజేశారు. ఈ నూతన యంత్రాన్ని కెనరా బ్యాంక్ తెలంగాణ జోనల్ హెడ్ శ్రీ గూడ లక్ష్మణ్ మరియు ఆసుపత్రి సూపరింటెండెంట్, సిఎమ్‌ఓ ఎన్.శైలజ మూర్తి శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెం డెంట్, సీఎంఓ శైలజ మూర్తి మాట్లాడుతూ.. సమాజ సేవలో భాగంగా బ్యాంకింగ్ సంస్థలు ముందుకు వచ్చి తమవంతు సహాయం అందించడం అభినం దనీయమని కొనియాడారు. ఈ మొబైల్ డిజిటల్ పోర్టబుల్ ఎక్సరే మిషన్ అందుబాటులోకి రావడంతో వార్డుల్లో ఉన్న పేషంట్ల వద్దకే నేరుగా వెళ్లి ఎక్సరే తీసే అవకాశం ఉంటుందని, దీనివల్ల రోగులకు మరింత త్వరితగతిన మరియు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆమె వివరించారు. కెనరా బ్యాంక్ తెలంగాణ జోనల్ హెడ్ గూడ లక్ష్మణ్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వీసీ, ఎండీ నాగిరెడ్డి నేతృత్వంలో తార్నాక ఆసుపత్రి సూపరింటెండెంట్, సిబ్బంది చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో కెనరా బ్యాంక్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ అడ్మినిస్ట్రేటర్ పి. శ్రీనివాస్, కెనరా బ్యాంక్ మేనేజర్లు టి.టి. అచ్యుతానందం, అశోక్ గౌతమ్, పలువురు వైద్యులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ నిధి రుణాలపై కమీషన్ల దందా

**ఖానాపూర్ మార్చి 13 (జనం సాక్షి) :** పొదుపు సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక బలాన్ని చేకూర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకంలో భాగంగా బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తూ తిరిగి చెల్లింపు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో మహిళలు రుణాలు తీసుకుంటున్న క్రమంలో సంబంధిత శాఖలో పనిచేస్తున్న అధికారులే బకాసురుల్లా మారి బక్షిస్తున్న వైనం ఖానాపూర్ లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే విద్యానగర్ కాలనీకి చెందిన ఓ పొదుపు సంఘం నుండి ఆ సంస్థలో బాధ్యతయుతమైన స్థానంలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి డబ్బులు ఇవ్వాలని ఫోన్ ద్వారా వసూలు చేసేందుకు మహిళలను ఆశ్రయిస్తున్నాడు. ఇది ఇలా ఉండగా ఒకే గ్రూపులో నలుగురు మహిళలకు రుణాలు మంజూరు ఇప్పించడంలో ఒకరికి రూ.75000/- లు చొప్పున నలుగురికి రుణం మంజూరి ఇప్పిస్తామని గ్రూపు సభ్యులకు చెప్పారు. కాగా అందులో ఒకరికి లక్ష రూపాయలు మంజూరు చేయించారని గ్రూపు సభ్యురాలు అయిన ఝాన్సీ లక్ష్మీ మహిళా మండలి అధ్యక్షురాలు జక్కుల గంగమని ఇదేంటని ప్రశ్నించడంతో తిరిగి ఖాతాలో జమ చేయించారని ఆమె తెలిపారు. సంబంధిత శాఖలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పొదుపు చేస్తున్న రుణగ్రస్తులైన మహిళలల నుండి అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. రుణాలు ఖాతాల్లో జమ చేయాలంటే ఒక లెక్క రుణాలు మంజూరి చేయించాలంటే మరో లెక్క ఇలా వసూలు చేస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ విషయమై సంబంధిత మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇచ్చిన స్పందించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు అధికారిపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె చెప్పారు.

## చందానగర్ ఫర్నీచర్ షాపులో అగ్నిప్రమాదం

- కాలి బూడిదైన ఫర్నీచర్ సామాన్లు



**హైదరాబాద్, మార్చి13 (జనంసాక్షి) :** నగరంలోని చందానగర్ ప్రాంతంలో ఉన్న ఒక ఫర్నిచర్ దుకాణంలో గురువారం అర్ధరాత్రి తర్వాత భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దుకాణంలోని ఐదు అంతస్తుల్లో నిల్వ చేసిన ఫర్నిచర్ మొత్తం తగలబడింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుంది. 7 ఫైర్ ఇంజన్లు, 11 వాటర్ ట్యాంకర్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. దుకాణం ఐదు అంతస్తుల భవనంలో ఉండటం, లోపల సోఫాలు, బెడ్‌లు, టేబుల్స్ తదితరాలు ఉండడం వల్ల మంటలు వేగంగా వ్యాపించినట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదానికి కారణం ఏంటనేది తెలియాల్సి ఉంది. షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లీకేజీ లేదా ఇతర కారణాలు ఉండవచ్చని భావిస్తున్నారు. పోలీసులు, అగ్నిమాపక అధికారులు సంయుక్తంగా ఘటన స్థలంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదం కారణంగా చందానగర్ ప్రాంతంలో కొంత వరకూ సేవలకు అంతరాయం కలిగినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రంజాన్ గిఫ్ట్ ప్యాక్‌పై మంత్రి అజహారుద్దీన్ ఫోటో విస్మరించడం సరికాదు

- మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యాకూబ్ పాషా ఆగ్రహం






**హైదరాబాద్ (జనంసాక్షి) :** పవిత్ర రంజాన్ పండుగ పురస్కరించుకొని నిరుపేద ముస్లింలకు అందించే గిఫ్ట్ ప్యాక్ లపై రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖా మంత్రి అజహారుద్దీన్ ఫోటోను విస్మరించడం పట్ల మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యండీ యాకూబ్ పాషా శుక్రవారం నాడు ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేసారు. రాష్టంలోని 44,57,012 మైనారిటీ జనాభా కు ప్రతినిధ్యం వహిస్తూ, క్యాబినెట్ హోదాను కలిగివున్న మైనారిటీ మంత్రిని నిర్లక్ష్యం చేస్తున్నారని, రాష్ట్రంలో గల మైనారిటీ సమస్యలు పరిష్కార దిశగా నిరంతరం శ్రమిస్తున్న అజహారుద్దీన్ ను విస్మరించడం సరికాదని అన్నారు. తమది ప్రజా పాలన అని క్యాబినెట్లో మంత్రు లందరికి సమాన గౌరవం ఉంటుందని చెప్తున్న కాంగ్రెస్ పార్టీ, రంజాన్ గిఫ్ట్ ప్యాక్ కవర్లపై ఒక ముఖ్యమంత్రి ఫోటోను ముద్రించి మైనారిటీ మంత్రిని ఎందుకు విస్మరించారో రాష్ట్ర మైనారిటీ సమాజానికి జవాబు చెప్పాలని అన్నారు.

## జిల్లాలో గృహ అవసరాలకు ఎల్పీజీ గ్యాస్ కొరత లేదు

- జిల్లా కలెక్టర్ కె.హరిత

**అసిఫాబాద్, మార్చ్13 (జనంసాక్షి) :** జిల్లాలో గృహ అవసరాలకు ఎల్పిజి గ్యాస్ కొరత లేదని వినియోగదారులు ఎటువంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో నిల్వలను అందుబాటులో ఉంచినట్లు, ఎల్పిజి సిలిండర్లు పక్కదారి పట్టకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సరైన విధంగా సిలిండర్లు ఉపయోగించేటట్లు చూడడానికి ప్రత్యేక మానిటరింగ్ కమిటీని నియమించినట్లు తెలిపారు. ప్రజలు ఎవరు కూడా ముందస్తు బుకింగ్ లు అవసరం లేదని, వినియోగదారుల అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నట్లు తెలిపారు. బుకింగ్ లు నిలువలపై రోజువారి సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకుంటామని, అటువంటివి ఎక్కడైనా సంభవిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

# పెరిగిన బుకింగ్‌లు.. సరఫరాపై నిబంధనలు

- కట్టెలను ఆశ్రయిస్తున్న గృహస్థులు, హోటల్ నిర్వాహకులు
- గ్యాస్ దొరక్క మూతపడుతున్న అనేక హోటళ్లు




**నిజామాబాద్, మార్చి13 (జనంసాక్షి) :** యుద్ధం రోజురోజుకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో గ్యాస్, పెట్రోలు, డీజిల్ సరఫరాలో మార్పులు జరుగుతున్నాయి. ఇప్పటికే మార్కెట్‌లో కమర్షియల్ సిలిండర్ల కొరత పెరిగింది. ఇదే పరిస్థితి మరికొద్ది రోజులుంటే హోటళ్లు మూసివేయాల్సి వస్తుందని యాజమాన్యాలు ఇప్పటికే ప్రకటించాయి. డిమాండ్‌కు సరిపడా కమర్షియల్ సిలిండర్లు లేకపోవడం, సరఫరా చేసే అవకాశాలు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడినట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం ఈ ప్రభావం గృహ కనెక్షన్లపైనా స్పష్టంగా కనిపిస్తున్నది. ఎల్పీజీ కొరత లేదని అధికారులు చెబుతున్నా.. కొరత ఉంటుందనే వార్తలు వెలువడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వినియోగదారులు భయాందోళనకు గురవుతున్నారు. సిలిండర్లు బుక్ చేసేందుకు పోటీ పడుతున్నారు. ఈక్రమంలో బుకింగ్‌ల సంఖ్య ఒక్కసారిగా పెరుగుతున్నది. గడిచిన నాలుగు రోజులుగా రోజుకు 25వేల పైచిలుకు బుకింగ్ అవుతున్నట్టు ఆయా గ్యాస్ కంపెనీలు ఏజెన్సీల ద్వారా తెలుస్తున్నది. గతంలో ఒక సిలిండర్ పూర్తయిన తర్వాత బుక్ చేసుకునేవారు. ప్రస్తుతం సిలిండర్ పూర్తి కాకముందే ముందు జాగ్రత్తగా గ్యాస్ బుక్ చేసుకుంటున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. అయితే డిమాండ్‌కు అనుగుణంగా గ్యాస్ సరఫరా లేక బుక్ కావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. సరఫరా విషయంలో ఇప్పటికే కంపెనీలు, ఏజెన్సీలు పలు నిబంధనలు పెట్టాయి. ఒక సిలిండర్ కనెక్షన్ ఉన్న వారు 21 రోజుల తర్వాత బుక్ చేసుకోవాలని, అలాగే రెండు సిలిండర్లు ఉన్న వారు 30 రోజుల తర్వాత బుక్ చేసుకోవాలని సూచిస్తున్నాయి. ఆ ప్రకారం బుక్ చేసినా సీరియల్ సంఖ్యను బట్టి డెలివరీ ఉంటుందని చెబుతున్నాయి. ఈ నిబంధన ఉమ్మడి కుటుంబాలు, ఎక్కువ కుటుం బ సభ్యులున్న కుటుంబాలకు ఇబ్బందిగా మారుతున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుతానికి గ్యాస్ కొరత లేదని, కానీ, నిబంధనలు మాత్రం అమలు చేయక తప్పదని ఉమ్మడి జిల్లాలోని పౌర సరఫరా అధికారులు స్పష్టం చేస్తున్నారు. నిజానికి ఇంకా వీలైనంత ఎక్కువ విక్రయించడానికి ఇన్నాళ్లూ ఆయా కంపెనీలు బంకు యజమానులకు వివిధ రకాల స్కీంలను అమలు చేశాయి. కానీ, మూడు రోజులుగా ఆ స్కీములను ఎత్తివేశాయి. దీనికి కారణం ఆయా కంపెనీలు వీలైనంత మేరకు.. డీజీల్ విక్రయాలను తగ్గించే దిశగానే ఆలోచనలు చేస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పరిశ్రమలను డీజిల్ కొరత వెంటాడుతున్నది. వాహనాలపై కూడా ఇప్పుడిప్పుడే ప్రభావం చూపుతున్నట్టు తెలుస్తున్నది. పరిస్థితి ఇలానే ఉంటే మరో మూడు నాలుగురోజుల్లో డీజిల్ ప్రభావం ప్రారంభమయ్యే అవకాశాలు ఉంటాయని యజమానులు చెబుతున్నారు. ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత లేదంటూ చమురు సంస్థలు ప్రకటనలు చేస్తున్నాయి. గ్యాస్ కనెక్షన్‌దారులకు స్వయంగా మెసేజ్‌లు సైతం పంపిస్తూ అప్రమత్తం చేస్తున్నాయి. అవసరానికి తగిన మొత్తంలో సిలిండర్ల సరఫరా ఉందని చెబుతున్నారు. క్షేత్ర స్థాయిలో కాసులకు కక్కుర్తి పడుతోన్న గ్యాస్ ఏజెన్సీలు భిన్నంగా ప్రవర్తిస్తున్నాయి. కొరత ఉందంటూ ప్రచారం చేస్తూ డబ్బులు దండుకుంటున్నారని ఎల్పీజీ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. సిలిండర్ బుకింగ్ చేసేందుకు క్యాష్ మాత్రమే తీసుకుంటుండటం అనుమానాలకు తావిస్తోంది. వారం క్రితం వరకు ఎల్పీజీ సిలిండర్ ధర రూ.928.50 ఉండగా రూ.60 పెంపుదలతో రూ.988కి చేరింది. వంటింట్లో సిలిండర్ అత్యవసరం కావడంతో రూ.వేయి వెచ్చిస్తున్నప్పటికీ సిలిండర్లు ఇంటికి చేరడం లేదు. ఇంట్లో పొయ్యి వెలిగించడమే గగనమైంది. సిలిండర్ బుక్ చేసేందుకు కొరత పేరుతో రూ.50 నుంచి రూ.100 వరకు గ్యాస్ ఏజెన్సీలు వసూళ్లకు పాల్పడుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. బుకింగ్ చేసుకున్న తర్వాత ఇంటికి సిలిండర్ చేర్చేందుకు సైతం సతాయిస్తున్నాయి. రద్దీ ఎక్కువగా ఉందంటూ తప్పించుకుంటుండడంతో అదనంగా డబ్బులు ఇచ్చిన వారికే సరఫరా చేస్తున్నట్లుగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాణిజ్య సిలిండర్ల సరఫరా భారీగా క్షీణించింది. చమురు సంస్థల నుంచి డిమాం డ్‌కు సరిపడా రాకపోవడంతో హోటళు స్వచ్ఛందంగా మూసేస్తున్నారు. వ్యాపారాలు బంద్ చేసుకుని మిన్నకుండిపో తున్నారు. హోటళ్లు మూత పడటంతో ఉపాధి దెబ్బతిని కార్మికులు విలవిల్లాడుతున్నారు. మరోవైపు వివాహాల సీజన్ కావడంతో వాణిజ్య సిలిండర్ల కొరత ప్రభావం సెగలు పుట్టిస్తోంది. కట్టెల వంటపైనే వివాహాల్లో భోజనాలు రెడీ చేస్తున్నారు. ఒక్కసారిగా కట్టెలకు డిమాండ్ పెరుగుతుండటంతో వాటి ధరలు సైతం పెరిగినట్లుగా తెలుస్తోంది. కిరాయి ఇంట్లో జీవనం సాగించే వారికి చుక్కలు కనిపిస్తున్నాయి.

## మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేయాలి

- రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ





**ఖమ్మం టౌన్, మార్చి 13 (జనం సాక్షి) :** రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలకు అన్ని రంగాల్లో సముచిత ప్రాధాన్యం కల్పించాలని కోరుతూ రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఫౌండర్, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి 12 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఏదులాపురం మున్సిపల్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఈ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాదిక్ అలీ మాట్లాడుతూ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా నిరుపేదలకు రుణాలు అందించేందుకు ప్రతి జిల్లాకు రూ.150 కోట్లు కేటాయించాలని, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన ముస్లిం కుటుంబాలకు ఇండ్లు మరియు ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాలు మరియు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో షాదీఖానాలు నిర్మించాలని, ముస్లిం సమాజ అవసరాల కోసం ప్రతి మండల కేంద్రం లో జనాజా వాహనం మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అదే విధంగా మసీదుల మరమ్మత్తులకు నిధులు కేటాయించడం, ఖబరస్తాన్ స్థలాల కేటాయింపు మరియు కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టడం, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉర్దూ నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. మైనార్టీ కుల ధృవీకరణ పత్రాలు, విద్యార్థులకు ఆదాయ ధృవీకరణ పత్రాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఏదులాపురం మున్సిపాలిటీలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచే విధంగా రోల్ మోడల్ షాదీఖానా నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ దావతులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు మహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమం ముగింపులో రాజ్యాంగ పరిరక్షణ వేదిక కార్యదర్శి తల్హా రాషిద్ ప్రత్యేక దువా చేసి, అనంతరం ఉపవాస దీక్షలు విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కార్యాలయ ఇంచార్జి తుంబురు దయాకర రెడ్డి, ఏదులాపురం మున్సిపల్ చైర్మన్ పోకల అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఎస్‌కే నజీరుద్దీన్, ఎస్‌కే హుస్సేన్, జాన్ ఖాన్, జాఫర్ పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలకు మరో రూ.640 కోట్లు విడుదల

- నిధులను త్వరితగతిన విడుదల చేయాలని కేంద్రాన్ని కోరిన మంత్రి సీతక్క

**హైదరాబాద్ (జనంసాక్షి) :** పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధుల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం తాజాగా గ్రామ పంచాయతీలకు మరో రూ.640 కోట్లు విడుదల చేసింది. ఇంతకుముందు కూడా కేంద్రం రూ.640 కోట్లు విడుదల చేయగా, తాజా విడతతో కలిపి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొత్తం బకాయిల చెల్లింపులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు అవసరమైన యుటిలిటీ సర్టిఫికెట్లు, ఇతర నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తున్నందున నిధుల విడుదల ప్రక్రియ వేగవంతమైందన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధించిన పనులను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా అమలు చేస్తున్నందుకు గుర్తింపుగా కేంద్రం ఈ నిధులను విడుదల చేసినట్లు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సుమారు రూ.1255 కోట్లు ఇంకా కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని మంత్రి పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు ఆ నిధులు అత్యంత అవసరమని తెలిపారు. ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న నిధులను కూడా త్వరితగతిన విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. 15వ ఆర్థిక సంఘం గడువు మరో 15 రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో మిగిలి ఉన్న బకాయిలను ఆలస్యం చేయకుండా విడుదల చేయాలని కేంద్రాన్ని ఆమె కోరారు. నిధులు సమయానికి విడుదలైతే గ్రామ స్థాయిలో మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగంగా కొనసాగుతుందని మంత్రి పేర్కొన్నారు.

ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనలకు అనుగుణంగా గ్రామ పంచాయతీల్లో ఖర్చు చేస్తామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్రామాలలో ఇప్పటికే చేపట్టిన పనులు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి కార్యక్రమాలకు ఆయా సమయాల్లో చేసిన ఖర్చుకు అనుగుణంగా బిల్లులు చెల్లిస్తామని ఆమె వెల్లడించారు. గ్రామ పంచాయతీల బలోపేతం ద్వారా గ్రామీణాభివృద్ధి వేగవంతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించి మిగిలిన నిధులను త్వరగా విడుదల చేస్తే గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగం అందుకుంటాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

## సివిల్ సప్లై ఎన్ఫోర్స్మెంట్ అధికారుల దాడులు

- గ్యాస్ సిలిండర్ల వాడకంపై హోటళ్లలో తనిఖీలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో శుక్రవారం సివిల్ సప్లై ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. గ్యాస్ సిలిండర్ల వాడకంపై వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో తనిఖీలు చేపట్టారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సివిల్ సప్లై శాఖ ఎన్ఫోర్స్మెంట్ టీం ప్రత్యేక బృందంగా ఏర్పడి పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. గృహ అవసరాల కోసం ప్రభుత్వం అందించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను కొందరు వ్యాపారులు తమ హోటల్ వ్యాపార నిమిత్తం కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్నారనే సమాచారం అందడంతో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో గృహ అవసరాల కోసం వినియోగించాల్సిన 13 డొమెస్టిక్ సిలిండర్లు అక్రమంగా కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఆరుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. ఎవరైనా గృహ అవసరాల సిలిండర్ల నుండి అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తే, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ తనిఖీల అనంతరం పూర్తి వివరాలతో జిల్లా కలెక్టర్, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో సివిల్ సప్లై ఇన్స్పెక్టర్లు భాస్కర్ రాజు, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.



## కొత్త రైలు మంజూరు చేయాలని రైల్వే మంత్రికి వినతి

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 13(జనంసాక్షి):** న్యూఢిల్లీ పార్లమెంట్ భవనంలో శుక్రవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్(యూనియన్ మినిస్టర్ అఫ్ రైల్వేస్ అశ్విని వైష్ణవ్)ను సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు కలిసి చర్లపల్లి నుండి సిర్పూర్ కాగజ్‌నగర్, నాగపూర్ మీదుగా హౌరా వరకు కొత్త రైలును నడపాలని వినతిపత్రం అందజేశారు. కాజీపేట, మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్, చంద్రాపూర్, బల్లార్షా, నాగపూర్ ప్రాంతాల్లో నివసిస్తున్న బెంగాలీ ప్రజల సౌకర్యార్థం ఈ కొత్త రైలును మంజూరు చేస్తే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ విషయమై రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్ ను కూడా కలిసి కొత్త రైలు ప్రతిపాదనను సమర్పించినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనపై త్వరలోనే సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి, రైల్వే బోర్డు చైర్మన్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## రైతుల పంటలకు నీరు అందేలా చర్యలు చేపట్టాలి

- కెనాల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**హనుమకొండ ప్రతినిధి మార్చి 13 (జనం సాక్షి) :** శుక్రవారం హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం సింగారం గ్రామ శివారులోని డి 8 కెనాల్‌ను అధికారులతో కలిసి పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలిం చారు. సింగారం వద్ద కెనాల్ గెట్ కిందకు వేసి వెల్డింగ్ చేయడం వల్ల సంగెం మండలంలోని ఆశాలపల్లి, గవిచర్ల, రామచంద్ర పురం, షాపురం, కొత్తగూడెం, గ్రామాలకు కెనాల్ నీరు రావడం లేదని ఆయా గ్రామాల సర్పం చులు, రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా గ్రామాల రైతులకు కెనాల్ నీరు అందే విదంగా అదికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## జ్యువెలరీ షాపులో దొంగతనం

- తాళాలు పగులగొట్టి ఆభరణాల చోరీ

**జగిత్యాల, మార్చి13 (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లాలో దొంగలు రెచ్చిపోయారు. మెట్‌పల్లిలో తాళాలు పగులగొట్టి ఓ ఆభరణాల షాపులో చోరీకి పాల్పడ్డారు. లాకర్ తెరిచేందుకు విఫలయత్నం చేశారు. 30 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లారు. ఉదయం షాపు తాళాలు పగులగొట్టి ఉండటంతో గమనించిన షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఇటీవల కాలంలో వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. పోలీసులు గస్తీని పెంచి రక్షణ కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
14 మార్చి 2026

# నిర్బంధ వందేమాతరం - నాగాల అభ్యంతరం!




నిరుద్యోగం, అధికధరలు, పెరిగిపోతున్న అసమానతలు, అదానీ, అంబానీల వంటి కార్పొరేట్ల కోసమే తయారవుతున్న పాలనా విధానాలు, మన సమాజానికి అత్యవసరమైన సహజ వనరులను దేశదేశాలకు దోచిపెట్టడం, అధికార వర్గాలు సాగిస్తున్న విష విద్వేష ప్రచారం వంటి ప్రజలు సతమత మవుతున్న, చర్చించవలసిన, పరిష్కారాలు వెతకవలసిన నిత్యజీవిత సమస్యలు అనేకం ఉండగా, వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించే పనులు చేపట్టడం పాలకులు ఒక కళగా అభివృద్ధి చేశారు. అటువంటి పనుల్లో ఒకటి అనవసరమైన వివాదాలు రేకెత్తించి ప్రజల సమయమూ శక్తీ అంతా వాటిలో వృథా అయ్యేలా చూడడం.

ఫిబ్రవరి 11న కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ జాతీయ గీతం గురించి జారీ చేసిన కొత్త మార్గదర్శక సూత్రాలు అటువంటి దారిమళ్లింపు వ్యూహాలలో ప్రధానమైనది. వందే మాతర గీతానికి 150 సంవత్సరాలు నిండిన సందర్భాన్ని అవకాశంగా తీసుకుని, ఇకనుంచి ఆ గీతం పూర్తి పాఠాన్ని పాడాలని హోమ్ మంత్రిత్వశాఖ ఆదేశించింది. ఏయే సందర్భాలలో ఆ గీతం పాడాలో, అది పాడుతున్నప్పుడు అందరూ ఎలా గొంతు కలపాలో, ఎలా లేచి నిలబడాలో ఈ మార్గదర్శక సూత్రాలలో వివరించారు.

ఈ ఆదేశాలకు కొన్ని వారాల ముందే సంఘ్ పరివార్ ప్రభుత్వం వందేమాతర గీతపు 150 ఏళ్ల సందర్భంగా పార్లమెంటులో చర్చ పెట్టింది. ఆరు చరణాల గీతంలోంచి మొదటి రెండు చరణాలు మాత్రమే జాతీయ గీతంగా ప్రకటించడం కాంగ్రెస్ కుట్ర అని, ముస్లింల బుజ్జగింపు అని, దేశ విభజనకు మొదటి మెట్టు అని స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ సంఘ్ శాఖల్లో చెప్పే చరిత్ర, వాట్సప్ యూనివర్సిటీ చరిత్ర వల్లించాడు.

నిజానికి వందే మాత్రా గీతపు చరిత్ర అంత సులభమైనది కాదు. బాంగ్లా రచయిత బంకిమ్ చంద్ర చటర్జీ 1875-76 లో రాసిన ఈ గీతం, 1882లో వెలువడిన ఆయన నవల ఆనందమఠ్ లో భాగమయింది. ఆ మొత్తం గీతం తెలిసినా తెలియకపోయినా 'వందే మాతరం' (మాతృభూమీ, వందనం) అనేది జాతీయోద్యమ సమర నినాదంగా మారింది. ఆ మాటను ఉద్యమకారుల నినాదంగా గ్రహించవచ్చునని మొదట చూపినది 1905-11 బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమం. ఆ తర్వాత జాతీయోద్యమం వేరువేరు సందర్భాలలో ఆ నినాదాన్ని స్వీకరించింది. 1920లలో భగత్ సింగ్ తదితర విప్లవకారులు ఆ నినాదం స్థానంలో 'ఇంఖిలాబ్ జిందాబాద్' నినాదం చేపట్టారు. కాంగ్రెస్ నాయకత్వం వందే మాత్రం నినాదాన్ని కొనసాగించింది. ఆ గీతంలో మొత్తంగా దేశానికి ఒక మాతృమూర్తి స్వరూపాన్ని ఇవ్వడం ఉన్నదని, అది భారతీయ ప్రజానీకంలోని హైందవేతర మతాలలో విశ్వాసం ఉన్నవారికి సరిపడదని, అంతకన్నా ముఖ్యంగా నాలుగో చరణంలో, దేశాన్ని దుర్గ, కమల (లక్ష్మి), వాణి (సరస్వతి) అని ఒక మతం లోని దేవతలతో పోల్చడం బహుమతాల సహజీవన బహుళత్వ సంస్కృతిగా ఉన్న భారత సమాజానికి సరిపడదని ఆలోచనలు 1930లలో మొదలయ్యాయి. ఆ వివాదాన్ని పరిష్కరించడం కోసం భారత జాతీయ కాంగ్రెస్ రవీంద్ర నాథ్ టాగోర్, జవాహర్లాల్ నెహ్రూ, సుభాష్ చంద్ర బోస్, మౌలానా ఆజాద్, ఆచార్య నరేంద్ర దేవలతో ఒక కమిటీ వేసి, ఆ కమిటీ సిఫారసు ప్రకారం ఆరు చరణాల ఆ గీతం నుంచి మొదటి రెండు చరణాలు మాత్రం జాతీయ గీతంగా గుర్తించింది. అదే నిర్ణయాన్ని రాజ్యాంగ నిర్ణయ సభలో అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ 1950 జనవరి 24న ప్రకటించారు. నిజానికి ఆ రెండు చరణాలలో కూడా హైందవేతర మత విశ్వాసాలకు భిన్నమైన భావాలు ఉన్నాయి గాని, కనీసం ఏ ఒక్క మత విశ్వాసానికీ చెందిన ప్రత్యేక అంశాలు లేవు. అందువల్లనే గత డెబ్బై ఐదు సంవత్సరాలుగా భిన్న మతాల ప్రజలు ఆ గీతాన్ని ఆమోదిస్తున్నారు, గౌరవిస్తున్నారు.

జనమే సాక్షి

ఈ సమయంలో, ఆరు చరణాల గీతం పూర్తి పాఠం పాడాలని అనడం కేవలం ఒక అనవసరమైన వివాదాన్ని రేకెత్తించడం మాత్రమే కాదు, బహు మతాల ప్రజలు నివసిస్తున్న, బహు దేవతారాధనలు, బహుళ ఆరాధనా పద్ధతులు ఉన్న భారతదేశంలో ఒకే ఒక్క మత ప్రార్థనను ఇతర మతస్తుల మీద బలవంతంగా, నిర్బంధంగా రుద్దడమే అవుతుంది. అటువంటి నిర్ణయం భారత సమాజ బహుళత్వ స్వరూపం పట్ల గౌరవం లేకపోవడమే. ఇతర మతాల ప్రజలను అవమానించడమే. ఆరాధనా, విశ్వాస స్వేచ్ఛను వ్యక్తిగత హక్కుగా గుర్తిస్తున్న రాజ్యాంగాన్ని అవమానించడమే. కాని సంఘ్ పరివార్ కు అటువంటి పనులే పోషకాలు. ఇతర మతస్తులను అవమానించి, ఘర్షణలు సృష్టించడం, బహుళత్వాన్ని తొక్కివేసి ఒకే దేశం, ఒకే మతం పద్ధతిని ప్రవేశపెట్టే నిరంకుశత్వం దాని లక్షణాలు. ఈ గీతం మీద 1930 నుంచీ చర్చ ఉంది గనుక, 1937లోనే పరిష్కారమైపోయిన చర్చను మరొకసారి రేకెత్తించి, హిందూ ముస్లిం ఘర్షణ సృష్టించాలని సంఘ్ పరివార్ ఉద్దేశం.

ఫిబ్రవరి 11న ఆదేశాలు వెలువడితే, ఆ ఆదేశాల మంచి చెడులు, వందే మాతరం గీత చరిత్ర, ఆరు చరణాల లోంచి రెండు చరణాలే ఎంపిక చేసిన చరిత్ర చర్చకు వచ్చాయి. పూర్తి పాఠం పాడడం నిర్బంధం చేస్తే ముస్లింలు వ్యతిరేకత వ్యక్తం చేస్తారని, దానితో మత ఘర్షణల అవకాశం వస్తుందని, ఆ ఘర్షణలను దేశభక్తి, జాతీయగీతం పట్ల గౌరవం వంటి ముసుగుల కింద ముస్లింల మీద దాడులుగా మార్చవచ్చునని సంఘ్ పరివార్ ఆలోచన.

కాని ఆశ్చర్యంగా వందేమాతర గీతం పూర్తి పాఠం మీద విమర్శ, తీవ్రమైన నిరసన మరొక చోటి నుంచి పెల్లుబుకుతున్నది. భారతీయ జనతా పార్టీ భాగస్వామిగా ఉన్న నాగా లాండ్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి, నాగా సమాజం నుం చి ఆ వ్యతిరేకత వస్తున్నది. ప్రధానంగా క్రైస్తవ సమా జం (జనాభాలో 87 శాతం) అయిన నాగాలాండ్ హిందూ దేవతల ఆరాధన ఉన్న వందేమాతర గీత చరణాలను అంగీకరించడం లేదు. భాజపాతో కలిసి అధికారం నెరపుతున్న నాగా పీపుల్స్ ఫ్రంట్ ఆ పూర్తి పాఠాన్ని విద్యా సంస్థలలో, శాసనసభలో పాడడాన్ని నిరసిస్తూ అధికారికంగా ప్రకటన చేసింది. ఈ ఆదేశా లను పునఃపరిశీలించాలని, వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆ ఆదేశాలు "రాజ్యాంగ అధికరణం 371(ఎ) కింద రక్షణలో ఉన్న నాగా సంస్కృతి మీద, విశ్వాసాల మీద ప్రత్యక్ష దాడి. మాకు పరాయిదైన ఆ గీతాన్ని మామీద నిర్బంధంగా రుద్దడం, ఎంతమాత్రమూ స్నేహపూరితం కాదు. అది మా ప్రాథమిక హక్కులను భంగపరచడమే" అని నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్ పి ఎఫ్) ప్రకటించింది.

ఈ ప్రకటనకు ముందు రోజు మార్చ్ 3న రాష్ట్ర శాసన సభలో ఈ విషయం మీద ఉద్రేకపూరితమైన చర్చ జరిగింది. అంతకు ముందు రోజు నాగాలాండ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలను ప్రారంభిస్తూ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా ప్రసంగించే ముందు వందేమాతరం పూర్తి పాఠం వినిపించారు. మర్నాడు శాసన సభ్యులందరూ దానికి వ్యతిరేకంగా మాట్లాడారు. నిజానికి ఆ శాసన సభలో ప్రతిపక్షం అనేదే లేదు. 60 స్థానాలున్న శాసన సభలో 35 మంది సభ్యులతో నాగా పీపుల్స్ ఫ్రంట్, 12 మంది సభ్యులతో భారతీయ జనతా పార్టీ కూటమి అధికార పక్షం కాగా, మిగిలిన 13 మంది సభ్యులు కూడా ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నవారే. కాని ఒక్కరు మినహా అందరికంద రూ వందేమాతర గీతం పూర్తి పాఠం వినిపించడాన్ని ప్రశ్నించారు.


"ఇరవై నాలుగేళ్లుగా శాసనసభ్యుడిగా ఉన్నాను. నిన్న జరిగినటువంటి సంగతి ఎప్పుడూ చూడలేదు. ఇది చాలా ఆందోళనకరం" అని అధికార ఎన్ పి ఎఫ్ కు చెందిన కుఝోలూజో నియెను అన్నారు. ఆయనా, ఇతర శాసన సభ్యుల ందరూ కూడా మాతృభూమిని దుర్గ, సరస్వతి, లక్ష్మి వంటి హిందూ దేవతలతో పోల్చిన నాలుగో చరణం గురించి తమ తీవ్ర అభ్యంతరం తెలిపారు. "క్రైస్తవుడిగా నేను ఒకే దైవాన్ని నమ్ముతాను. ఈ గీతం పట్ల నా తీవ్ర అభ్యంతరాన్నీ, అసంతృప్తినీ ప్రకటిస్తున్నాను. ఇటువంటివి ఆమోదించ డానికి వీలు లేదు" అని ఆయన అన్నారు.

ఎన్ డి ఎ కూటమిలో మరొక భాగస్వామ్య పార్టీ అయిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అఠవాలే) శాసనసభ్యుడు వై లిమా ఒనెన్ చాంగ్, "మన రాజ్యాంగంలో అధికరణం 25 దేశంలో ప్రతి ఒక్కరికీ ఏ మతాన్నయినా పాటించే, ప్రచారం చేసుకునే, ఆరాధించే స్వేచ్ఛ ఇచ్చింది. నేను ఇతర మతాలను, వారి నమ్మకాలను గౌరవిస్తాను. అట్లాగే నా మతాన్ని, నా విశ్వాసాలను ఇతరులు గౌరవించాలని కోరుకుంటాను. కాని వారి ఇష్టాన్ని నా మీద రుద్దడానికి వీల్లేదు" అన్నారు.

శాసనసభలో బిజెపి నాయకుడు, మంత్రి తెంజెన్ ఇమ్నా అలాంగ్ వందేమాతర గీతాన్ని సమర్థించిన ఏకైక శాసనసభ్యుడిగా మిగిలారు. ఆయన సమర్థనను వ్యతిరేకిస్తూ, ఎన్ పి ఎఫ్ ప్రధాన కార్యదర్శి, శాసనసభ్యుడు అచుంబెమో కికోన్స్, "కాంగ్రెస్ కూడా సరిగ్గా ఇట్లాగే ఇందిర అంటే ఇండియా, ఇండియా అంటే ఇందిర అన్నందుకే ప్రాంతీయ పార్టీలన్నీ కలిసి వారిని గద్దె మీది నుంచి దింపేశాయి. ఇప్పుడు మా బిజెపి మిత్రులు చాలా బలవంతులం అనుకుంటున్నారు. ఈ రకంగానే అధికార దుర్వినియోగం చేసిన, అధికారం తలకెక్కిన పార్టీలను ప్రజలు ఎలా గద్దె దించారో గుర్తు పెట్టుకోవాలి" అన్నారు. చివరికి ముఖ్యమంత్రి, ఎన్ పి ఎఫ్ నాయకుడు నెయిఫియూ రియో, ఈ వ్యవహారాన్ని పరిశీలించడానికి ఒక సెలెక్ట్ కమిటీని నియమిస్తామని చర్చను ముగించారు.

శాసనసభ చర్చ తర్వాత నాగాలాండ్ రాష్ట్రవ్యాప్తంగా అనేక విద్యార్థి సంఘాలు, ఆదివాసి సంఘాలు, చర్చ్ సంస్థలు, ఎన్నో పౌరసమాజ సంస్థలు ఈ విషయం చేపట్టాయి. మార్చ్ 6 శుక్రవారం నాడు రాష్ట్ర బంద్ కు నాగా స్టూడెంట్స్ ఫెడరేషన్ పిలుపు ఇచ్చింది. ఆరోజే నాగాలాండ్ యూనివర్సిటీ లుమామి క్యాంపస్ లో జరిగిన కాన్వొకేషన్ కు ఉపరాష్ట్రపతి సి పి రాధాకృష్ణన్ అతిథిగా రాగా, అక్కడ వందేమాతర గీతం పూర్తి పాఠం వినిపిస్తే, అనేక మంది విద్యార్థులు లేచి నిలబడకుండా నిరసన తెలిపారు. నాగాలాండ్ లోని ప్రధాన ఇంగ్లిష్ దినపత్రికలు నాగాలాండ్ పోస్ట్, ది మోరుంగ్ ఎక్స్ ప్రెస్ లలో ప్రతి రోజూ వందేమాతర గీతం పూర్తి పాఠాన్ని తాము ఎందుకు వ్యతిరేకిస్తున్నామో వివరిస్తూ ఎందరో నాగా మేధావులు వ్యాసాలు రాస్తున్నారు. వివిధ సంఘాల ఖండన ప్రకటనలు వస్తున్నాయి. క్రమంగా ఈ నిరసన పొరుగు రాష్ట్రాలైన మేఘాలయకూ, మిజోరాంకూ వ్యాపిస్తున్నాయి.

బహు మతాల, బహు విశ్వాసాల, బహు దేవతారాధనల బహుళత్వ సమాజంలో ఉమ్మడి నిర్ణయాలను తీసుకునేటప్పుడు ఒక కేంద్ర ప్రభుత్వాన్ని నడిపే పార్టీ, దాన్ని నడిపే భావజాల సంస్థ ఎంత జాగ్రత్తగా, ఔదార్యం తో, భిన్నాభిప్రాయాల పట్ల గౌరవంతో, ప్రజాస్వామికంగా ఉండాలో ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అలా లేదని ఈ నిర్ణయమూ, దాని పర్యవసానాలూ చూపుతున్నాయి. ఈ నిర్ణయం ఉద్దేశపూర్వకమైతే దుర్మార్గం. అనుద్దేశపూర్వకంగానే జరిగి ఉంటే తక్షణమే సవరించుకోవలసిన తెలివితక్కువ తనం.



**ఎన్ వేణుగోపాల్**
కవి, సాహిత్య విమర్శకుడు, పాత్రికేయుడు, ప్రజా వక్త, వ్యాఖ్యాత, రాజకీయ, ఆర్థిక,సామాజిక అంశాలపై కాలమిస్ట్.

# త్యాగాలు ఎవరివి? భోగభాగ్యాలు ఎవరికీ?

## ఎందుకిలా? దీన్ని మార్చాల్సింది ఎవరు?




మావోయిస్టులు ఎన్నో త్యాగాలు చేశారు. ప్రజల కోసం కుటుంబాన్ని పుట్టి పెరిగినవఊరును వదిలేసారు. సమాజం మారాలని, పేదరికం పోవాలని, దోపిడి పీడన, అణచివేత లేని సమసమాజం రావాలని కోరుకున్నారు. ప్రజల లో కలిసి పని చేసారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పాల్గొన్నారు. ఎన్నో ఎదురుదెబ్బలు తిన్నారు. నిర్బంధాలు ఎదుర్కొన్నారు. చిత్ర హింసలు అనుభవించారు. చావు కు భయపడని ధీరులుగా నిలిచారు. ఎన్ కౌంటర్లు పేరిట హత్యల కు గురయ్యారు. అవన్నీ తమ లక్ష్య సాధన కోసం భరిస్తూ ముందు కు సాగారు. 12 రాష్ట్రాలకు మావోయిస్టు పార్టీ విస్తరించింది. తరువాత త్యాగాలు ఎవరివి భోగ భాగ్యాలు ఎవరికి? ఎందుకిలా జరిగింది? దీన్ని మార్చాల్సింది ఎవరు?

### మన ఇల్లును ఆక్రమిస్తే దొంగలకే వదిలేయాలా?

కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు , అవినీతి పరులై , అక్రమ సంపాదనకు దోపిడీకి అలవాటై అదే జీవన విధానం గా మార్చుకున్న రాజకీయ నాయకులు, ఎంఎల్ఏలు, ఎంపీలు, మంత్రు లు ముఖ్యమంత్రులు , కాంట్రాక్టర్లు, సహజ సంపదలు దోచుకొని చూసే పారిశ్రామికవేత్తలు, అభివృద్ధి పేరిట ప్రకృతిని పర్యావరణా న్ని, ప్రజల జీవితాలను విధ్వంసం చేస్తూ, నిర్వాసితులను చేస్తున్న వారికి ప్రజలను చైతన్యవంతం చేస్తున్న ఉద్యమాలపై కసి, కోపం. అభివృద్ధి అందరికి అందేదైతే ప్రజలు ఎందుకు వ్యతిరేకిస్తారు? విప్లవ కారులు స్థానిక ప్రజల పక్షాన నిలబడ్డారు. అది అంతర్గత వలస వాదులకు, దోపిడి దారులకు, ప్రజలను నిర్వాసితులను చేసి పరిశ్రమలు పెట్టాలనుకునే ప్రభుత్వాలకు, పారిశ్రామిక వేత్తలకు, అంతర్జాతీయ కార్పోరేట్ వర్గాలకు అడుగడుగునా అడ్డు పడడం తో సంఘర్షణ తీవ్రమైంది. తన ప్రజలపై ప్రభుత్వాలు పోలీసుల ను, సైన్యాన్ని, ఆయుధాలను ప్రయోగించడం జరుజరుగుతూ వయ్యున్నది. అక్రమ సంపాదనతో, దోపిడీతో వేల కోట్లకు ఎదిగారు.

### ప్రయివేటైజేషన్, గ్లోబలైజేషన్ తెచ్చిన రాజకీయ మార్పులు

గ్లోబలైజేషన్, ప్రయివేటీకరణ దశలో ఈ క్రమం వందల రెట్లు పెరిగింది. లక్షల కోట్లు బ్యాంకు లను కూడా ముంచారు. అదంతా ప్రజల సొమ్ము. ప్రజల కష్టార్జితం దోపిడీ చేయ బడింది. ఇలాంటి పరిణామాలు జరుగుతున్నప్పుడు, వారే ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తున్నపుడు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికల్లో గెలిచి మొత్తం రాజ్యాంగ యంత్రాంగాలపై తమ ఆధిపత్యాన్ని చెలాయిస్తూ వస్తున్నపుడు వారిని ఎన్నికల్లో ఓడించి సరైన నాయకులను ఎన్నుకోవడం అవసరం. ప్రజలు చైతన్యవంతమైనపుడే ఆయుధ పోరాటం చేస్తారు. అంత చైతన్యవంతమైన ప్రజలు ఎన్నికలలో ఓడించడం, గెలిపించడం ఎంతో సులభం. చైతన్యాన్ని అలా మలచాలి. తామే ఎన్నికల్లో నిలబడాలి. లేదా ఆరెసెన్ వలె తాము ప్రత్యక్షంగా పరోక్షంగా మద్దతు ఇచ్చి గెలిపించడం, వ్యతిరేకించి ఓడించడంలో క్రియాశీల పాత్ర నిర్వహించాలి.

### 1967 ప్రపంచ వ్యాప్త చైతన్యం

1967లో ప్రపంచ వ్యాప్తంగా వెల్లువెత్తిన యువత ఈ మలుపు తీసుకున్న చోట ప్రభుత్వాలు మారాయి. అధికారం లోకి వచ్చారు. నక్సలైట్ ఉద్యమం దానికదే విడి గా ఎదిగిన పరిణామమే "కాదు. పైగా నక్సలైట్ ఉద్యమం ప్రజల చైతన్యాన్ని తప్పుదారి పట్టించింది. ఎక్కడో చైనాలో వున్న మావో యే మా చైర్మన్ అని, పదేళ్లలో విప్లవం వచ్చేస్తుంది అని నమ్మ పలికారు. 60 ఏళ్లు గడిచాయి. ఉద్యమ కారుల త్యాగాల చరిత్ర మిగిలింది. పార్టీలు, ఉద్యమాలు అణిచివేత కు గురయ్యాయి. పజలు కష్టాల పాలయ్యారు. ఉద్యమాలతో దున్ను తున్న భూమి కెసిఆర్ పాలనలో రైతు బంధు పేర అనుభవదారు కాలమ్ తీసేసి లక్షలాది పేద రైతులను బేదఖలు చేశారు. 60 ఏళ్ళు గా నక్సలైట్ మావోయిస్టు ఉద్యమాలు ప్రజల చైతన్యాన్ని పక్కదారి పట్టించాయి. అందుకోవాల్సి న అవకాశాలకు, దూరం చేశాయి.

### ప్రస్తుత కర్తవ్యాలు

భారత రాజ్యాంగం పరిధి లో గల అవకాశాలు అనుసరించి ఆయుధాలు అవసరం లేని ఉద్యమాలు చేయడం, ప్రజలను చైత న్యం చేయడం అవసరం. రహస్య ఉద్యమాలు అవసరం. బహిరంగంగానే ప్రజల మధ్య, ప్రజల చైతన్య స్థాయిని అనుసరించి అందరిని కలుపుకొని ముందుకు సాగాలి. వారు ఈ పనిని చాలా కాలం క్రితమే , చేయాల్సింది.

ఎపుడైతే నిర్బంధం ప్రారంభమైందో 1984 ఎన్.టి.ఆర్ ప్రభుత్వం పడిపోయి మళ్ళీ ఎన్నికలు పెట్టిన తర్వాత అప్పుడు నిర్బంధాన్ని చాలా సీరియస్ గా అమలు జరిపారు. ఎంత సీరియస్ గా అంటే జైలు బయట అరెస్ట్ చేసి ఆ తర్వాత ఒక 50 మందిని కాల్చి చంపేసి బూడిద కూడా లేకుండా చేశారు.

### ప్రజల చైతన్యం పార్టీ చైతన్యం కన్నా గొప్పది

దానివల్ల 1989 ఎన్నికల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా (పీపుల్స్ వార్ పార్టీ ఎన్నికల బహిష్కరణ పిలుపు ఇచ్చినా సరే) ప్రజలు దానిని ధిక్కరించి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసినారు. అట్లా డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చారు. తనకు ఆ విషయం తెలుసు. అందువల్ల 'మీరు బహిరంగ సభలు పెట్టుకోండి. ఎంతంటే అంత చేసుకోండి. కొండపల్లి సీతారామయ్య గారికి ఆరోగ్యం బాగా లేదని తెలిసింది.. నేను వైద్య బృందాన్ని కూడా పంపిస్తాను. ఎవరికైనా ఉద్యోగాలు లేకపోతే ఉద్యోగాలు కూడా ఇప్పిస్తాను' అని చెప్పి అపారమైన గౌరవంతో సభ ఆహ్వానించింది.

### గౌరవం పెంచిన చెన్నారెడ్డి- అవమానించినా బిజేపి

అపారమైన గౌరవంతో మర్రి చెన్నారెడ్డి ఆహ్వానించినప్పుడే 1990లో గద్దర్ బయటికి వచ్చినాడు, నేను బయటకు వచ్చినాను. వరవరరావు కూడా జైలు నుంచి బయటకు వచ్చినాడు. ఆ తర్వాత 1990 నుండి బహిరంగ ఉద్యమాలు అద్భుతంగా జరిగాయి. ఆ తర్వాత రాజకీయ పోరాటంలో తెలంగాణ వారిని వదిలేసి ఆంధ్రా వారు రావడం కోసం ప్రతిసారి కుట్రలు చేసిన విషయం మనంద రికీ తెలుసు. అపారమైన గౌరవంతో బయటకు రావడం వేరు. నేడు జరుగుతున్న లొంగుబాటు పేరిట జరుగుతున్నది వేరు. ఒకటి గౌరవ ప్రదమైనది. మరొకటి అవమానకరమైనది. బిజేపీ అత్యంత అవమానకరంగా ప్రవర్తించింది. ప్రజా ఉద్యమాల పట్ల ప్రజా స్వామ్యంలో ఇంత అవమానకరం గా ప్రవర్తించిన వారు లేరు.

నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం కోసం పాతబస్తీలో అల్లర్లు సృష్టించడం, ఆ తర్వాత మర్రి చెన్నారెడ్డి రాజీనామా చేయడం, ఆయన వచ్చిన తర్వాతే తీవ్రమైన నిర్బంధాన్ని ప్రవేశపెట్టి చివరికి పీపుల్స్ వార్ పార్టీని నిషేధించాడు. నిషేధించాల్సిన అవసరమే లేదు నిజానికి అప్పుడు.

ఆ తర్వాత మళ్ళీ ఎన్టీఆర్ అధికారంలో రావడం, చంద్రబాబు అధికారంలోకి రావడం, చివరికి 2003 లో కూడా కాంగ్రెస్ కి ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు ఇచ్చి వై.ఎస్.ఆర్ అధికారంలోకి రావడానికి ఉపయోగపడ్డారు. ప్రపంచంలో అనేక మార్గాలున్నాయి. మార్క్సిజం కలెగూర గంప. కిచిడా సిద్దాంతం

అయితే ఈ పద్ధతిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు ఇచ్చే బదులుగా ప్రత్యక్షంగా బహుజన సమాజ్ పార్టీ లాగా, సి.పి.ఐ పార్టీ లాగా, సి.పి.ఎం పార్టీ లాగా మేము బయటినుంచి అయినా, లోపలి నుంచి అయినా మద్దతు ఇస్తామని ప్రకటించి ఉంటే మన ఓట్లకు బార్ గైనింగ్ కెపాసిటీ ఉండేది. మన డిమాండ్లు ఒక ట్రేడ్ యూని యన్ లాగా, ఒక సిపిఎంలాగా అడిగి మనం ఇవి నెరవేర్చుకునే అవకాశం ఉండేది. ఆ అవకాశాన్ని కోల్పోయినాము.

వాళ్ళు ఎదిగిన తర్వాత మళ్ళీ మన మీద నిర్బంధం ప్రయోగిస్తు న్నారు. ఉదాహరణకి మావోయిస్ట్ పార్టీ లేకుండా మమత బెనర్జీ వెస్ట్ బెంగాల్ లో సిపిఎం ని ఎదిరించి అధికారంలోకి వచ్చే అవకాశమే లేదు. కిషన్‌జీ, అక్కడున్న మావోయిస్ట్ పార్టీ అద్భుతంగా సహకరించారు. సిపిఎం యొక్క నిర్బంధాన్ని వ్యతిరేకించారు. ఈమె అధికారంలోకి వచ్చాకా రెండు సంవత్సరాల లోపే కిషన్ జీ ని ఎన్ కౌంటర్ లో చంపేశారు. ఇదంతా దేని వల్ల జరిగింది ? మనం ఎన్నికలను బహిష్కరించడం వల్ల జరిగింది. అంటే ఎన్నికల తోటి ఆ ఓట్ల తోటి వచ్చేటటువంటి ఏదైతే పవర్ ఉందో బార్ గైనింగ్ కెపాసిటీ ఉందో ప్రజల యొక్క ఓట్లు వేయకుండా చేసినాము, ఆ ఓట్లతోటీ మనం బార్ గైనింగ్ చేయలేకపోయినాము. కనుక ఈ నష్టాలు జరుగుతూ వచ్చాయి. ఈ నిర్ణయం అపుడే తీసుకొని వుం టే వేలాది ప్రాణాలు పోయేవి కాదు. ఈ నిర్ణయం అప్పుడే తీసుకొని ఉంటే బాగుండేది. 1977 నుండి 1984 దాకా జరిగిన ఉద్యమం అద్భుతమైన ఉద్యమం. విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, రైతు కూలీ సంఘాలు, పౌర హక్కులు సంఘాలు, విప్లవ రచయితల సంఘాలు, టీచర్ల సంఘాలు, ఎన్‌జిఓ సంఘాలు, ఆర్‌టిసి సంఘా లు, సింగరేణి కార్మిక సమాఖ్య మొదలైనవన్నీ ఒక రెండు నెలల పాటు దక్షిణ భారతదేశం అంతటా 360 రైళ్ళు బంద్ అయిపోయి నాయి సింగరేణి సమ్మె వల్ల బొగ్గు ఉత్పత్తి లేక. ఇంత గొప్ప శక్తి సామర్థ్యాలు సాధించుకున్న ఈ ఉద్యమం. ప్రజల హృదయాలను గెలుచుకున్న ఉద్యమం ఇవాళ అవమాన కరమైన స్థితిలో ఇవాళ విషాదంగా ముగియడం ఏమిటి?ఎందుకు ఇలా? ఇలా కావడాని కి మనం నిర్బంధాలకు గురి కావడం. నిర్బంధాలకు గురి కావడా నికి కారణం ఎన్నికల్లో పార్టిసిపేట్ చేయలేకపోవడం, తర్వాత నిర్బంధా లకి సంబంధించి అనేక సంఘటనలు జరగడం, ఆ సంఘ టనలు జరగకుండా చూసుకుంటే మనకు ఈ నిర్బంధాలు ఉండేవి కావు.

### మేమే గొప్ప అనే అహంకారం మార్క్సిజమే నేర్పిందా?

బహుజన సమాజ్ పార్టీ లాగా, సి.పి.ఐ పార్టీ లాగా, సి.పి.ఎం లాగా సోషలిస్ట్ అయినటువంటి ములాయం సింగ్ యాదవ్, లాలూ ప్రసాద్ యాదవ్, ఇప్పటిదాకా ఉన్నటువంటి నితీష్ కుమార్, రామ్ మనోహర్ లోహియా, జయప్రకాష్ నారాయణ్ మొదలైన వారు చూపెట్టిన మార్గంలో గనుక మనం నడిపించి ఉంటే ఈ నిర్బంధా లు ఉండేవి కావు. రాజకీయాల్లో ఇంత అవినీతి, ధన ప్రవాహం ఉండేది కాదు. అసమానతలు ఇంత పెరిగేవి కావు. ఒక శాతం చేతిలో యాభై శాతం సంపద, అధికారం, పేరుకు పోయేది కాదు.

### పార్టీ పరంగా ప్రకటించి వస్తే ఎంత బాగుండేది?

నిజాయితీ గల యువత రాజకీయాల్లోకి రావడం అవసరం. మావోయిస్టులు ఒక పార్టీగా తమ పంథా మార్చుకొన్నామని, ఎన్నిక ల్లో పాల్గొంటామని, ప్రజల సమస్యలపై శాంతియుతంగా ఉద్యమిస్తా మని ప్రకటించి బహిరంగ జీవితంలోకి వచ్చి వుంటే బాగుండేది. వేలాది యువకులు బలి అయ్యే వారు కాదు. దేశ చరిత్ర లో అదొక మలుపు అయ్యేది. అనేక కష్ట నష్టాలకు ఓర్చి పార్టీలో దశాబ్దాలు గా కృషిచేసిన వారు ఇంత దీన, దయనీయ స్థితిలో బహిరంగ జీవితంలోకి రావడం అనే పరిస్థితి ఎందుకు వచ్చింది? పట్టు విడుపులు లేని మొండి తనం. మార్క్సిజం తప్ప మిగతా సిద్ధాంతా లు చదవక పోవడం. మార్క్స్, లెనిన్, మావోలు చేసిన సవాలక్ష పొరపాట్లను గ్రహించక పోవడం. సరే అది వేరే చర్చ.

### స్వాగతం గౌరవ ప్రదంగా స్వాగతిసతున్నాం

అవినీతి వ్యతిరేక పోరాటంతో జయ ప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలో ప్రభుత్వాలు పడిపోయిన విషయం మనకు తెలుసు. అదే నినాదంతో అరవింద్ కేజ్రివాల్ ముఖ్యమంత్రి అయిన విషయం కళ్లముందే వుంది.



**- బి ఎస్ రాములు**
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987



# దేశంలో ఎల్పీజీ సరఫరాపై పెరుగుతున్న ఒత్తిడి!

ప్రపంచ రాజకీయ పరిణామాలు చాలా సందర్భాల్లో దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా ఇంధన రంగం అంతర్జాతీయ రాజకీయాలతో అత్యంత సన్నిహితంగా ముడిపడి ఉంటుంది. ప్రస్తుతం పశ్చిమ ఆసియా ప్రాంతంలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులు భారతదేశానికి కూడా గణనీయమైన ప్రభావాన్ని చూపే అవకాశముంది. అమెరికా-ఇజ్రాయెల్ కూటమి ఒకవైపు నిలబడిన పరిస్థితి, మరోవైపు ఇరాన్‌తో పెరుగుతున్న ఉద్రిక్తతలు పశ్చిమ ఆసియా ప్రాంతాన్ని యుద్ధ వాతావరణంలోకి నెట్టాయి. ఈ పరిణామాలు ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థలో అనిశ్చితిని సృష్టించాయి. ముఖ్యంగా ద్రవీభవించిన పెట్రోలియం వాయువు అయిన ఎల్పీజీ సరఫరాపై భారత్‌కు గణనీయమైన ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉంది.

భారతదేశంలో వంటగ్యాస్ వినియోగం గత దశాబ్దంలో విపరీతంగా పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో కలప, బొగ్గు వంటి సంప్రదాయ ఇంధనాల స్థానంలో ఎల్పీజీ వినియోగాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేసింది. ముఖ్యంగా ఉజ్వల పథకం ప్రారంభమైన తరువాత కోట్లాది కుటుంబాలకు వంటగ్యాస్ కనెక్షన్లు అందాయి. ఫలితంగా దేశవ్యాప్తంగా వంటగ్యాస్ వినియోగం వేగంగా పెరిగింది. ఒకప్పుడు వంటగ్యాస్ వినియోగం ప్రధానంగా పట్టణ ప్రాంతాలకు మాత్రమే పరిమితమై ఉండేది. ఇప్పుడు గ్రామీణ కుటుంబాల వరకు విస్తరించింది. అందువల్ల దేశంలో ఎల్పీజీ అవసరం గతంతో పోలిస్తే భారీగా పెరిగింది.

ఈ పెరుగుతున్న అవసరాన్ని తీర్చడంలో భారత్ పూర్తిగా స్వయం సమృద్ధి సాధించలేకపోయింది. దేశంలో ఉత్పత్తి అయ్యే ఎల్పీజీ మొత్తం అవసరంలో సుమారు 40% మాత్రమే. మిగిలిన భాగాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ దిగుమతుల్లో కూడా అధిక భాగం పశ్చిమ ఆసియా దేశాలపై ఆధారపడుతోంది. ముఖ్యంగా ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్ వంటి దేశాలు భారతదేశానికి ప్రధాన సరఫరాదారులుగా ఉన్నాయి. ఈ దేశాలు ప్రస్తుతం ఉద్రిక్తతలతో ఉన్న ప్రాంతంలోనే ఉన్నందున భారతదేశానికి సరఫరా వ్యవస్థలో అంతరాయం కలిగే ప్రమాదం ఉంది.

భారతదేశంలో ఎల్పీజీ సరఫరాను నిర్వహించే ప్రధాన సంస్థలు ప్రభుత్వ రంగానికి చెందినవే. దేశవ్యాప్తంగా కోట్లాది వినియోగదారులకు వంటగ్యాస్ సరఫరా చేసే ఈ సంస్థలు అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరిగినప్పుడు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటాయి. అయినప్పటికీ సామాన్య ప్రజలకు తక్కువ ధరలో వంటగ్యాస్ అందించడానికి ప్రభుత్వం తరచూ సబ్సిడీలను అందిస్తుంది.

ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టింది. దేశంలోని రిఫైనరీలు ఎల్పీజీ ఉత్పత్తిని గరిష్ట స్థాయికి పెంచాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా ఉత్పత్తి అయ్యే ఎల్పీజీని ఇతర పెట్రోరసాయన ఉత్పత్తుల తయారీలో వినియోగించకుండా నిషేధం విధించింది. ఉత్పత్తి అయ్యే మొత్తం ఎల్పీజీని దేశీయ వినియోగదారులకు అందేలా చర్యలు చేపట్టింది.

అయితే ఇదే సమయంలో కేంద్ర బడ్జెట్‌లో ఎల్పీజీ సబ్సిడీ తగ్గించబడటం మరో ఆందోళనకర అంశంగా మారింది. గత సంవత్సరంతో పోలిస్తే సబ్సిడీ మొత్తాన్ని దాదాపు 27% తగ్గించారు. ఈ నిర్ణయం వల్ల భవిష్యత్తులో వినియోగదారులపై ధరల భారము పెరగవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

భారతదేశం ఇంధన దిగుమతుల విషయంలో పశ్చిమ ఆసియా ప్రాంతంపై ఎంతగా ఆధారపడుతుందో గమనించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా హోర్ముజ్ సముద్ర మార్గం ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైనది. ఇది ఇరాన్, ఒమాన్ దేశాల మధ్య ఉన్న సముద్ర ద్వారం. ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే చమురు, గ్యాస్‌లో పెద్ద భాగం ఈ మార్గం ద్వారానే ప్రపంచ మార్కెట్లకు చేరుతుంది. ఈ మార్గం మూసివేయబడినా లేదా రవాణా అంతరాయం ఏర్పడినా ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది.

పశ్చిమ ఆసియా ప్రాంతంలో ఏర్పడిన యుద్ధ పరిస్థితులు ప్రపంచ ఇంధన రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇంధన దిగుమతులపై అధికంగా ఆధారపడుతున్న దేశాలకు ఆర్థిక ఒత్తిడి మరింత పెరుగుతుంది. భారతదేశం భవిష్యత్తులో ఇలాంటి సంక్షోభాలను ఎదుర్కొనేందుకు సమగ్ర ఇంధన విధానాన్ని అవలంబించాల్సిన అవసరం ఉంది. దేశీయ ఉత్పత్తిని పెంచడం, ఇంధన నిల్వలను పెంపొందించడం, వివిధ దేశాలతో ఇంధన వాణిజ్య ఒప్పందాలను విస్తరించడం వంటి చర్యలు అత్యంత అవసరం. అంతేకాకుండా పునరుత్పాదక ఇంధన వనరులైన సౌరశక్తి, గాలి శక్తి అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టాలి. అప్పుడు మాత్రమే విదేశీ ఇంధనాలపై ఆధారాన్ని కొంతవరకు తగ్గించగలుగుతుం మొత్తం దృష్టిలో పెట్టుకుంటే పశ్చిమ ఆసియా ప్రాంతంలోని యుద్ధ పరిస్థితులు భారతదేశానికి ఒక హెచ్చరికగా భావించవచ్చు. ఇంధన భద్రత ఒక దేశ ఆర్థిక స్థిరత్వానికి ఎంత ముఖ్యమో ఈ పరిణామాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. భవిష్యత్తులో దేశం ఇంధన అవసరాలను స్వయం సమృద్ధితో తీర్చుకునే దిశగా క్రమబద్ధమైన చర్యలు తీసుకుంటే మాత్రమే ఇలాంటి అంతర్జాతీయ సంక్షోభాల ప్రభావాన్ని తగ్గించడం సాధ్యమవుతుంది.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

## పేద రైతుల భూముల్లో అక్రమ ప్రభుత్వం కట్టడాలు వెంటనే ఆపాలి



**ధారూర్, మార్చి 13 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా ధారూర్ మండల పరిధిలోని కొండాపూర్ కుర్దు గ్రామంలో పేద రైతుల భూముల్లో అక్రమ కట్టడాలు చేపడుతున్నారని ఆరోపిస్తూ అడ్డుకున్న మహిళలపై దాడి చేసి చంపేందుకు ప్రయత్నించిన వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకొని వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై బాధిత మహిళలు మరియు సీపీఎం నాయకులు శుక్రవారం ధా రూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని పేద రైతుల భూములను ఆక్రమించుకునే ప్రయత్నం జరుగుతుండగా అడ్డుకున్న మహిళలను కొందరు వ్యక్తులు దాడి చేసి అనేక రకాల బూతులు తిట్టి మహిళలను చూడకుండా తీవ్రంగా దాడి చేసి బెదిరించారని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు వెంటనే స్పందించి దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. బాధిత మహిళలకు రైతులకు న్యాయం చేయకపోతే రాష్ట్ర మహిళా కమిషన్‌తో పాటు రాష్ట్ర డీజీపీని కూడా కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అయిద్వా మహిళా సంఘం నాయకులు జిల్లా కార్యదర్శి అనసూయ, గ్రామ ప్రజలు బాధిత మహిళలు చంద్రమ్మ ప్రసాద్. వెంకటయ్యమమత. హనుమంతు. శాంతమ్మ. చంద్రయ్య. రంగయ్య. రాములు. వెంకటయ్య. రాజు. సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన కలెక్టర్

- రైతులకు సకాలంలో ఎరువులు ఇవ్వండి
- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్ జిల్లా బ్యూరో మార్చ్ 13 (జనం సాక్షి) :** జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులు సమయానికి అందించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారము వికారాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ సమీపంలో ఉన్న ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎం/ఎస్ గుల్షన్ బ్రదర్స్ మరియు ఎం/ఎస్ శ్రీ లక్ష్మీ నారాయణ ఏజెన్సీస్ ఎరువుల దుకాణాలను సందర్శించి అక్కడ ఎరువుల విక్రయ విధానం, నిల్వలు మరియు రికార్డులను పరిశీలించారు. దుకాణాల్లో ఉన్న యూరియా, డి.ఏ.పీ, పొటాష్ తదితర ఎరువుల నిల్వలను పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయిస్తున్నారా, సరైన బిల్లులు ఇస్తున్నారా అనే విషయాలను తనిఖీ చేశారు. దుకాణదారులు స్టాక్ రిజిస్టర్, విక్రయాల రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎరువులను సరఫరా చేయాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు అవసరమైన ఎరువులు సరిపడా నిల్వ ఉంచాలని సంబంధిత అధికారులకు



ఆదేశించారు. ఈ తనిఖీలో భాగంగా ఎరువుల విక్రయం ఈ-పాస్ యంత్రం ద్వారా జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, ఎరువుల బుకింగ్ యాప్‌లో నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించి సంబంధిత రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. దుకాణాల్లో ఉన్న ఎరువుల వాస్తవ నిల్వలను (గ్రౌండ్ బ్యాలెన్స్) కూడా పరిశీలించి రికార్డులతో సరిపోల్చి తనిఖీ చేశారు. అదేవిధంగా పురుగుమందుల విక్రయానికి సంబంధించిన లైసెన్సులు మరియు ప్రిన్సిపల్ సర్టిఫికేట్లను కూడా పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులు మరియు పురుగుమందులు విక్రయించాలని, ప్రతి విక్రయాన్ని తప్పనిసరిగా ఈ-పాస్ యంత్రంలో నమోదు చేయాలని దుకాణదారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరఫరా వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో గృహ వినియోగ ఎచ్ పి గ్యాస్ సరఫరా విధానం సక్రమంగా జరగాలనిజిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్యాస్ సిలిండర్ల నిల్వలు, పంపిణీ విధానం, బుకింగ్ ప్రక్రియ మరియు వినియోగదారులకు సకాలంలో గ్యాస్ సరఫరా జరుగుతున్నదా అనే అంశాలను కలెక్టర్ పరిశీలించారు. గ్యాస్ బుకింగ్ నుండి డెలివరీ వరకు నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ సెంటర్‌లో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా, అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయా అనే అంశాలను కూడా పరిశీలించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సిలిండర్ల సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా సేవలు అందించాలని, ఎలాంటి అక్రమాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హెచ్చరించారు. ఈ పరిశీలనలో డి ఎం సి ఎస్ మురళి కృష్ణ, డి ఎస్ ఓ సుదర్శన్, సంబంధిత శాఖ అధికారులు గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

**కుత్బుల్లాపూర్, మార్చి 13 (జనం సాక్షి) :** వేసవికాలం ప్రారంభ దశలోనే తాగునీటిని అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని జగద్గిరి గుట్ట డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆరోపించారు. జగద్గిరిగుట్ట డివిజన్ ఆర్ జి కే కాలనీలో గత రెండు నెలల నుండి మంచినీటి సరఫరా చేయడం లేదని కాలనీవాసులు మాజీ కార్పొరేటర్ కు ఫిర్యాదు చేశారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆర్ జి కె నివాసితులతో కలిసి జగద్గిరిగుట్ట జలమండలి కార్యాలయం వద్ద కాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో రోజు విడిచి మూడు గంటల పాటు నిరవధికంగా మంచినీటి సరఫరా చేసి స్థానిక ప్రజలకు ఎలాంటి నీటి కొరత లేకుండా చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన నాటి నుండి మూడు



రోజులకు ఒకసారి నీటి సరఫరా చేస్తున్నారని అది కూడా కేవలం ఒక గంట పాటు మాత్రమే సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మార్చి నెలలోనే తాగునీటి కొరత ఉంటే ఏప్రిల్, మే మాసంలో పరిస్థితిని అంచనా వేస్తేనే భయంగా ఉందన్నారు. తాగునీటి సమస్యతో పాటు మౌలిక సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని ఆయన దుయ్యబట్టారు. సత్వరమే తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే స్థానిక మహిళలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గృహకల్ప వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ధర్మపురి అంజయ్య. నాయకులు భూపతి రెడ్డి. పరశురాములు వెంకటస్వామి గౌడ్., నరసింహారెడ్డి హనుమంతు బ్రహ్మచారి. సంపత్ రెడ్డి సునీల్ రెడ్డి. కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా భద్రత ఏర్పాట్లు పరిశీలన



**నంగునూరు, మార్చి 13 (జనం సాక్షి) :** సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని రాష్ట్ర ముఖ్యమంత్రి శఅనుముల రేవంత్ రెడ్డి ఈనెల మార్చి 22 నా ప్రారంభించనున్న సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించి న భద్రత ఏర్పాట్లను శుక్రవారం రోజు సిద్ధిపేట అదనపు డీసీపీ సీహెచ్ కుశాల్కర్ , సిద్ధిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి తో కలిసి కార్యక్రమ స్థలాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు .సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు, హెలిప్యాడ్ ఏర్పాటు చేసే ప్రదేశం, రైతు మేళా నిర్వహించే ప్రదేశం వంటి అంశాలను పరిశీలించి తగిన సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ నిర్వహణకు తగిన ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. పెద్ద సంఖ్యలో రైతులు మరియు ప్రజలు హాజరయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని పార్కింగ్, రాకపోకలు, భద్రతా ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ యాజమాన్యం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిద్ధిపేట రూరల్ సిఐ శీను, రాజగోపాల్పేట ఎస్సై వివేక్ , ఆయిల్ ఫ్యాన్ ఫ్యాక్టరీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## యువత చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



**హయత్‌నగర్, మార్చి 13 (జనం సాక్షి) :** హయత్ నగర్ లోని జీ స్కూల్ లో అరోరా లీగల్ సైన్స్ ఇన్స్టిట్యూషన్ వారు నిర్వహించిన లీగల్ అవేర్నెస్ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండడం చాలా అవసరమని తెలిపారు. సమాజంలో న్యాయం, సమానత్వం నెలకొనాలంటే యువత చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు తమ హక్కులు, చట్టపరమైన రక్షణ గురించి తెలుసుకోవడం ద్వారా సమాజంలో ధైర్యంగా ముందుకు సాగగలరని అన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వల్ల వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం కూడా నష్టపోతుందని హెచ్చరించారు. విద్య, మంచి విలువలు, చట్టాలపై అవగాహనతోనే మంచి భవిష్యత్తు నిర్మించుకోవచ్చని సూచించారు. ఇలాంటి లీగల్ అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంచడంతో పాటు సమాజ అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించిన అరోరా లీగల్ సైన్స్ ఇనిస్ట్యూట్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అరోరా కాలేజీ ప్రిన్సిపాల్ యాదగిరి, హై కోర్ట్ రిజిస్టర్ మంజుల, జీ స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణ దేవి శ్రీవాస్తవ్, డైరెక్టర్లు డాక్టర్ సామ సురేందర్, డాక్టర్ అనంతరెడ్డి, డాక్టర్ నాగేంద్ర బాబు, స్కూల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చేగుంటలో పేకాటపై పోలీసుల దాడి

- పేకాట ఆడుతున్న ఆరుగురిపై కేసు నమోదు
- రూ.57,830నగదు, 3 ఫోన్లు స్వాధీనం
- జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు

**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 13 (జనం సాక్షి) :** జిల్లాలోని చేగుంట మండలం బోనాల గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.57,830 నగదు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మడుగుల అరుణ్, కేదారి చంద్రం, చిట్టం వెంకటేష్, పరా ప్రవీణ్, గోపాటి పెంటయ్య, మచ్చు శ్రీకాంత్‌లను పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ దాడి నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఘటనపై చేగుంట పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే



వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేకాట, బెట్టింగ్ వంటి అక్రమ చర్యల వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని తెలిపారు. ముఖ్యంగా యువత ఇలాంటి చెడు మార్గాలకు దూరంగా ఉండాలని సూచించారు. అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కు తెలియజేయాలని ప్రజలను కోరారు.

## ఉపాధ్యాయుల చేతుల్లోనే దేశ భవిష్యత్



**హయత్‌నగర్, మార్చి 13 (జనం సాక్షి) :** తపస్ రంగారెడ్డి జిల్లా శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో జడ్.పి.హెచ్.ఎస్ ఎల్బీనగర్ పాఠశాలలో తపస్ రంగారెడ్డి జిల్లా మహిళ కన్వీనర్ వనం సుమ రంజిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నీతుబెన్ టి ఎస్ జి ఎల్ బి జాయింట్ డైరెక్టర్ హాజరైనారు. ఈ సందర్భంగా నీతుబెన్ మాట్లాడుతూ మహిళలు ఒకవైపు కుటుంబ భాధ్యతలు నిర్వహిస్తూనే తమ ఉద్యోగ భాధ్యతలు కూడ ఉన్నతంగా నిర్వహించాలని, మన కీర్తి ప్రతిష్టలు పెంచుకొనేలా మన పనితీరు ఉండాలని, మహిళ టీచర్లు మాతృ హృదయంతో భోదించాలని అన్నారు. అడిషనల్ డైరెక్టర్ మాట్లాడుతూ మన పిల్లలకు మన సంస్కృతి సంప్రదాయాలు మరియు విలువలను నేర్పించే భాధ్యత మహిళలదే అని పేర్కొన్నారు. తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి, సమాజంలో విలువలు పెంచడం తో పాటు 2047 వికసిత్ భారత్ అభివృద్ధిలో మహిళ టీచర్ల పాత్ర ఎంతో ముఖ్యమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 120 మంది ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట్ల కాశి రావు, రాష్ట్ర భాద్యులు శ్రీహరి కృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, మహేష్ కుమార్, లలిత, తపస్ మహిళ విభాగం భాద్యులు సుజాత, భాగ్యమ్మ, నందిత, జ్యోతి, బిందు, స్వాతి, మౌనిక, గౌరీ, తపస్ రాష్ట్ర, జిల్లా, మండల ప్రాథమిక సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి పరీక్షలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి

- నేటి నుండి ప్రారంభం
- రెండు సెంటర్లు ఏర్పాటు
- 8 పాఠశాలల నుండి పరీక్షలు రాయనున్న
- 540 మంది విద్యార్థులు
- 144 సెక్షన్ అమలు

**బొంరాస్‌పేట, మార్చి 13 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేటి నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని మండల విద్యాధికారి హరిలాల్ తెలిపారు. మొత్తం ఏ,బి రెండు సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, బొంరాస్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బొట్లవానితండా గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, రేగడి మైలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చౌదర్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బురాన్ పూర్ బిసి గురుకుల పాఠశాల, దుద్యాల జిల్లా పరిషత్ ఉన్నత



పాఠశాల, హకీంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెట్టుపల్లితండా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన మొత్తం 540 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు 26 మంది ఇన్విజిలేటర్లను కేటాయించడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రం పరిసరాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కొనసాగుతుందని, పరీక్ష ప్రారంభ సమయం కంటే గంట ముందుగా విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అన్నారు. శుక్రవారం ఎంఈవో హరిలాల్ ఇన్విజిలేటర్లతో సమావేశం నిర్వహించి పరీక్ష కేంద్రంలో అనుసరించాల్సిన నియమ నిబంధనలను తెలియజేశారు.

## ఆలయానికి 10 ఎకరాల భూమిని ఇవ్వాలని తహసీల్దార్‌కు వినతి



**నవాబుపేట్, మార్చి 13 (జనం సాక్షి) :** ఎల్లకొండ శ్రీ పార్వతీ పరమేశ్వరుల ఆలయ అభివృద్ధి కోసం 10ఎకరాల భూమిని మంజూరు చేయాలని ఎల్లకొండ గ్రామస్తులు నవాబ్ పేట్ తహసీల్దార్ బుచ్చయ్య విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నవాబుపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ బుచ్చయ్యను ఎల్లకొండ మాజీ సర్పంచ్ రావుగారి వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు గాలయ్య, నరేష్, శ్రీను, మాజీ వార్డు సభ్యులు ప్రభాకర్ రెడ్డి, గ్రామ పెద్దలు నర్సిములు, పర్మయ్య, జంగయ్య, మొదలైన వారు కలిసి ఎల్లకొండ ఎల్లకొండ శ్రీ పార్వతీ పరమేశ్వరుల ఆలయ అభివృద్ధి కోసం పది ఎకరాల భూమిని మంజూరు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యంత పురాతనమైన భక్తుల ఆరాధ్యదైవమైన ఎల్లకొండ శ్రీ పార్వతి పరమేశ్వరుల దేవాలయానికి పెరుగుతున్న భక్తుల రద్దీ, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఎల్లకొండ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 1 లో 10 ఎకరాల భూమిని శ్రీ పార్వతీ పరమేశ్వరుల దేవాలయానికి ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో విజయ్ రెడ్డి, ప్రకాష్, రవీందర్, మల్లేశం, గోపాల్, జంగయ్య, మహేందర్, బాగారెడ్డి, కిరణ్ తదితరులు ఉన్నారు.

# దేశ నిర్మాణంలో యువ మేనేజ్‌మెంట్ పాత్ర కీలకం

- యువ మేనేజ్‌మెంట్ నిపుణుల తీర్చిదిద్దే వేదికగా బ్లిట్జ్‌క్రిగ్-2కే26
- ఉస్మానియాలో మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో విద్యార్థుల సందడి

**సికింద్రాబాద్, మార్చి 13 (జనంసాక్షి) :** నాయకత్వ లక్షణాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, దేశనిర్మాణం లో యువ మేనేజ్‌మెంట్ నిపుణుల పాత్ర అత్యంత కీల కమని ఈసీఐఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనేష్ కుమార్ శర్మ పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న రెండు రోజుల మేనేజ్‌మెంట్ ఫెస్ట్ "బ్లిట్జ్‌క్రిగ్-2కే26"ను శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇలాంటి మేనేజ్‌మెంట్ ఉత్సవాలు విద్యార్థుల్లో నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా, కార్పొరేట్ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయని అన్నారు. అలాగే సాంకేతిక మార్పులకు అనుగుణంగా ఆలోచన విధానాన్ని మార్చుకుని, సృజనాత్మకతతోముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమాలు విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవాన్ని అందించడంతో పాటు, టీమ్‌వర్క్, నిర్ణయ సామర్థ్యాలను పెంపొందించడంలో తోడ్పడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పద్మావతి కన్స్ట్రక్షన్స్ ప్రతినిధి వేదాంతం సుబ్బారావు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా సికింద్రాబాద్ డీజీఎం భాస్కర్ తమ పరిశ్రమల అనుభవాలను విద్యా ర్థులతో పంచుకున్నారు. యువతలో ఔత్సాహిక వ్యాపార దృక్పథం పెంపొందించుకుని స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. ఫెస్ట్‌లో భాగంగా వివిధ మేనేజ్ మెంట్ గేమ్స్, వ్యాపార ప్రణాళిక పోటీలు, గ్రూప్ చర్చలు ,ప్రెజెంటేషన్లు , సాంస్కృ తిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు



తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ సీనియర్ ప్రొఫెసర్ డి.శ్రీరాములు, విభాగాధిపతి ప్రొఫెసర్ వై. జహంగీర్, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
14 మార్చి 2026

# వినియోగదారులకు గ్యాస్ కొరత లేకుండా సరఫరా

● గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**గద్వాల నడిగడ్డ, మార్చి 13 (జనం సాక్షి) :** గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ల ను కొరత లేకుండా వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. గ్యాస్ సిలిండర్ల, రబీ పంటలకు సాగునీరు సరఫరా,వరి ధాన్యం కొనుగోలు అంశాలపై శుక్రవారం హైదరాబాదు నుంచి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రబీలో వివిధ ప్రాజెక్టుల పరిధిలో రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పంటల కోత వరకు లష్కర్ స్థాయి నుంచి సిఈ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సాగునీటి సరఫరా విషయంలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు సంబంధిత నీటిపారుదల, వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ రైతుల పంటలు చేతికొచ్చేవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ల సరఫరా విషయంలో కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ సభ్యులను సమన్వయం చేసుకుంటూ



గృహవసరాలకు వినియోగించే గ్యాస్ సరఫరాలో వినియోగదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలన్నారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో తగు చర్యలు తీసుకోవాలని, పంటల స్టోరేజ్ పాయింట్స్ గుర్తించి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఆయిల్ పామ్, ఉద్యాన పంటలపై రైతులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. సిఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ల కొరతపై కొన్ని మీడియా, సామాజిక మాధ్యమంలో వస్తున్న వార్తల పట్ల ప్రజలు అపోహలకు గురికాకుండా సంబంధిత శాఖల అధికారులు గ్యాస్ ఏజెన్సీ లపై పర్యవేక్షణ చేయాలన్నారు. గ్యాస్ నిల్వలు తగ్గిపోతాయనే అపోహతో కొంతమంది వినియోగదారులు ముందుగానే గ్యాస్ బుకింగ్ చేసుకోకుండా బుకింగ్ పీరియడును 15 రోజుల నుంచి 25 రోజులకు పెంచడం జరిగిందన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం 99 రోజులపాటు నిర్విఘ్నంగా కొనసాగించాలని ఆదేశించారు. ఏప్రిల్ రెండవ తేదీన గ్రామ, వార్డు సభలను నిర్వహించి అందులో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా అవగాహన కలిగించాలన్నారు. గద్వాల ఐడిఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధించిన శాఖల అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీసి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలు గృహ సంబంధ గ్యాస్ సిలిండర్ల సరఫరా లో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు ఈ విషయంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ముందుకు వెళ్లాలన్నారు. జిల్లాలో వివిధ ప్రాజెక్టుల పరిధిలో రబీలో పంటలు వేసుకున్న రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీటి సరఫరా విషయంలో ఇరిగేషన్ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పామ్ పంటల సాగును పెంచేందుకు రైతులకు అవగాహన కలిగించాలని ఉద్యానవన శాఖ అధికారికి సూచించారు. రబీ పంటలకు స్టోరేజ్ పాయింట్స్ కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్, మేనేజర్ విమల, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, పిజెపి ఎస్ఈ రహీముద్దీన్, ఈఈ శ్రీనివాస్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 25న జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నా విజయవంతం చేద్దాం



**గద్వాల నడిగడ్డ, మార్చి 13 (జనం సాక్షి) :** వివిధ ప్రభుత్వ శాఖల్లో నాలుగు దశాబ్దాలు పైగా అటెండర్ నుండి ఐ.ఏ.ఎస్ కలెక్టర్లూ, ఐ.జీలూ, ఎస్. పీ. లదాకా జీవితకాలం సేవలు అందించి రిటైర్ అయిన పెన్షనర్ల బతుకుల్లో నిప్పులు పోస్తూ కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం మార్చి 25న దుర్మార్గ చట్టం రూపొందించిందనీ, ఇది రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమనీ బేషరతుగా ఇలాంటి పెన్షనర్ల వ్యతిరేక చట్టాన్ని రద్దుచేయాలని అఖిలభారత పెన్షనర్ల పెడరేషన్ మార్చి 25 న దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కలెక్టరేట్లలో నిరసన ప్రకటించి ప్రధానమంత్రికి విజ్ఞాపన పత్రాలు పంపాలని పోరాట కార్యక్రమాన్ని రూపొందించిందనీ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ ఎం.డి.ఇక్బాల్ పాషా, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర ప్రభాకర్ గద్వాలలో విలేఖరుల సమావేశంలో అన్నారు. ఈనెల 25న జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు.

## గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి

● అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**జడ్చర్ల, మార్చి 13 (జనంసాక్షి) :** పారిశుధ్య నిర్వహణలో ఎక్కడా అలసత్వం వహించకూడదని, ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ స్పష్టం చేశారు. మండలంలోని పోచమ్మ గడ్డ, మల్లె బోయిన పల్లి గ్రామాల్లో శుక్రవారం ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 8వ రోజు కార్యక్రమాలు ముమ్మరంగా సాగాయి. ఈ పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఇంచార్జి డి.పి.ఓ వెంకట రెడ్డి స్వయంగా పర్యవేక్షించి సంబంధిత అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. డ్రై డే - ఫ్రైడే సందర్భంగా పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ తిరిగి నీటి నిల్వల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లోని ఓ.హెచ్.ఎస్.ఆర్ తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎం.పి.డి.ఓ, ఎం.పి.ఓ, స్థానిక సర్పంచ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణలో సాయుధ దళ పాత్ర కీలకం

● జిల్లా ఎస్పీ సునిత రెడ్డి

**వనపర్తి బ్యూరో, మార్చి 13 (జనం సాక్షి) :** పోలీసు సిబ్బంది సంక్షేమం, ఆరోగ్యం, కుటుంబ స్థిరత్వం మరియు పిల్లల విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపడం ద్వారా మాత్రమే పోలీసుశాఖ మరింత బలపడుతుందని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, తెలిపారు.శుక్రవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయం సమావేశ భవనంలో వనపర్తి జిల్లా సాయుధ దళ ఏ ఆర్ పోలీసు సిబ్బందితో ఎస్పీ సునిత రెడ్డి, పోలీసు దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది తమ సేవలకు సంబంధించిన సమస్యలు, వీక్లీ ఆఫ్, పెండింగ్ బిల్లులు మరియు విధుల్లో ఎదురయ్యే ఇబ్బందులను ఎస్పీకి వివరించారు. సిబ్బంది సమస్యలను ఎస్పీ స్వయంగా విని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణలో, బందోబస్తు విధుల్లో, ప్రత్యేక ఆపరేషన్లలో, పండుగలు మరియు ఎన్నికల సమయంలో సాయుధ దళ పోలీసుల సేవలు అత్యంత కీలకమని తెలిపారు. క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ పోలీసుశాఖ ప్రతిష్టను మరింత పెంచాలని సూచించారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉండటం అత్యంత అవసరమని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఒత్తిడిని



అధిగమించేందుకు మానసిక స్థైర్యం పెంపొందించుకోవాలని తెలిపారు. విధులతో పాటు కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు మరియు పిల్లల పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.ముఖ్యంగా పోలీసు సిబ్బంది తమ పిల్లల విద్యాభివృద్ధిపై దృష్టి పెట్టి మంచి భవిష్యత్తు కల్పించాలని తెలిపారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం ద్వారా పోలీసుశాఖపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. క్రమశిక్షణ, సమయపాలన, విధి పట్ల నిబద్ధత ప్రతి పోలీసు సిబ్బందికి తప్పనిసరి అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సాయుధ దళ అదనపు ఎస్పీ వీరారెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు వినోద్, మగ్దూం భారీ, సాయుధ దళ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫామ్ పంట నాలుగో సంవత్సరం నుంచి కోత ప్రారంభం



**శివ్వంపేట, మార్చి 13 (జనంసాక్షి) :** ఆయిల్ పామ్ పంట నాలుగవ సంవత్సరం నుండి కోతకు రావడం ప్రారంభమవుతుందని లీవ్ ఫామ్ కంపెనీ టెక్నికల్ డైరెక్టర్ డా. రంగనాయకులు తెలిపారు. ఉద్యానవన శాఖ వారి ఆధ్వర్యంలో శుక్రవారం శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్ల గ్రామానికి చెందిన రైతు గడ్డం లక్ష్మీ ఆయిల్ ఫామ్ పంట సాగు పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరూ సంవత్సరాల వయస్సు గల ఆయిల్ పామ్ పంటను పరిశీలించారు. అనంతరం రంగనాయకులు మాట్లాడుతూ ఎకరాకు నెలకు సగటున 0.7 - 0.8 టన్నుల దిగుబడి తద్వారా ఎకరాకు సంవత్సరానికి 8--10 టన్నుల దిగుబడి వస్తుందన్నారు. ప్రస్తుతం మార్కెట్ ధర టన్నుకు సుమారు 22 వేల రూపాయలుగా ఉందని దీని ఆధారంగా, ఎకరాకు నెలకు సుమారు రూ. 15 వేల నుండి రూ. 18 వేల వరకు ఆదాయం ఎకరాకు సంవత్సరానికి సుమారు రూ. 1,75,000/- నుండి రూ. 2,20,000/- వరకు స్థూల ఆదాయం లభిస్తుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి సంతోష్, హెచ్ఈవో గోవింద్, ఆయిల్ పామ్ టెక్నికల్ పర్సన్ అజయ్ లతో పాటుగా 60 మంది రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి



**చేర్యాల, మార్చి 13 (జనంసాక్షి) :** విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సర్పంచ్ కామ్రేడ్ గొర్రె శ్రీనివాస్ కోరారు. చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం ఉపసర్పంచ్ వట్టిపల్లి ఆగయ్యతో కలిసి సర్పంచ్ శ్రీనివాస్ పరిశీలించారు.భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు మంచి ఆహారం అందించాలని ఉపాధ్యాయులకు, మధ్యాహ్న భోజన కార్మికులకు సూచించారు.అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈ.రాజు పాల్గొన్నారు.

## పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**మల్దకల్, మార్చి 13 (జనంసాక్షి) :** మండలంలోని పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన 3 కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాధికారి జి సురేష్ తెలిపారు.పరీక్షలు ప్రశాంతంగా,పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించబడినట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు సరిపడా బెంచీలు, తాగునీరు, విద్యుత్,ఫస్ట్ ఎయిడ్ వంటి సౌకర్యాలు ఏర్పాటు జరిగిందని,పిఎం శ్రీ మల్దకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 72మంది బాలురు,128 మంది బాలికలు మొత్తం 200 విద్యార్థులు,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మల్దకల్ కేంద్రంలో 44మంది బాలురు, 89 మంది బాలికలు మొత్తంగా 133 విద్యార్థులు, మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 57మంది బాలురు,108 మంది బాలికలు మొత్తంగా 165 విద్యార్థులు పరీక్షలకు హాజరు కాబోతున్నారు.3కేంద్రాల యందు 173 మంది బాలురు, 325మంది బాలికలు మొత్తంగా 498 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు.ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష జరుగుతుంది.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్దకల్ పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్ గా విజయ శివకుమార్, డిపార్ట్మెంటల్ అధికారిగా అరుణశ్రీ , ప్రాథమిక పాఠశాల పరీక్ష కేంద్రానికి



చీఫ్ సూపరింటెండెంట్‌గా నాగరాజు, డిపార్ట్మెంటల్ అధికారిగా యువతి, ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్ గా ఆర్. హనుమంతు,డిపార్ట్మెంటల్ అధికారిగా విజయలక్ష్మి వ్యవహరించనున్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి హాజరై, నిబంధనలు పాటించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ శ్రీ రిజ్వాన్ భాషా షేక్ జూమ్ మీటింగ్ ద్వారా చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ అధికారులకు పరీక్షలకు సంబందించి తగు సూచనలు చేశారని తెలిపారు.పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



**వెల్దండ, మార్చి 13 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం ఎంపీడీవో ఈసం కృష్ణయ్య అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వెల్దండ మండలానికి వివిధ దశల్లో మొత్తం 425 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, అందులో 159 ఇండ్లు స్లాబ్ ,ప్లాస్టింగ్ పూర్తయ్యాయని తెలిపారు. వచ్చేనెల ఏప్రిల్ 20 నుంచి 26 వరకు 75 ఇండ్లు గృహప్రవేశం చేయించుటకు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఇందిరమ్మ కమిటీ సభ్యుల సహకారం తీసుకొని సంబంధిత లబ్ధిదారులను చైతన్య పరచుటకు సూచనలు చేయడం జరిగింది. అలాగే 32 గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల యందు నాణ్యమైన విత్తనాలు నాటించుటకు, షెడ్ నెట్స్ ఏర్పాటు చేయాలని, వందశాతం ఇంటి టాక్స్ లు వసూలు చేయాలని, ట్రేడ్ లైసెన్సులు పునరుద్ధరణ చేయించాలని తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్ నాయక్, ఏపీఓ ఈశ్వర్ జీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

● ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో, మార్చి 13 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలన్నింటినీ అభివృద్ధి పథంలో నడిపించేందుకు కాంగ్రెస్ పార్టీ అనేక సంక్షేమ పథకాలను చేపట్టి ముందుకెల్తోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణం పనులను ప్రారంభించారు.సి సి రోడ్డు నిర్మాణం నాణ్యవంతంగా ఉండాలని అధికారులకు సూచించారు.అనంతరం గ్రామంలో అంతర్గత డ్రైనేజ్ నిర్మాణానికి క్షేత్రం ఆయన పనులను ప్రారంభించారు.

### విద్యార్థులతో శ్రమదానం

వనపర్తి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్సిసి క్యాంపులో భాగంగా పెద్దగూడెం గ్రామంలో వారి సేవలను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి కాసేపు శ్రమదానం చేశారు.విద్యార్థులు క్యాంపు అయిపోయి లోగా గ్రామ మొత్తం



పరిశుభ్రంగా మారాలని చివరి రోజు నేనే వచ్చి మీకు విందు భోజనం ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే విద్యార్థులతో చెప్పారు.విద్యార్థి దశలో ఇలాంటి క్యాంపులు నూతన ఉత్సాహాన్ని కలుగజేస్తాయని గ్రామ ప్రజలతో సఖ్యతగా మెలిగి శిబిరం ఉద్దేశాన్ని అమలు చేయాలని ఆయన విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుష్పలత శివకుమార్, శేఖర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శారదమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ల పునరుద్ధరణకు నిధులు మంజూరు

### నేడు పనుల ప్రారంభం చేసిన ఎమ్మెల్యే

వనపర్తి పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల టీచర్స్ కమ్యూనిటీ హాల్, 11వ వార్డు ఎన్టీఆర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ కోసం ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు మంజూరు చేశారు.ఈ క్రమంలో రూ. 8 లక్షల వ్యయంతో పునరుద్ధరించే టీచర్స్ కాలనీలో టీచర్స్ కమ్యూనిటీ హాల్ కు, ఐదు లక్షలతో పునరుద్ధరించే ఎన్టీఆర్ కాలనీలోని తాపీ మేస్త్రి సంఘం భవన పునరుద్ధరణ కోసం ఆయన శుక్రవారం పనులను ప్రారంభించారు. ఐదో వార్డ్ లోని కుమ్మరులను వారి చేసే పనితీరును అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, ఆయా వార్డుల కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ను త్వరితగతిన పూర్తి చేయాలి



**నారాయణపేట, మార్చి 13 (జనం సాక్షి) :** ఇందిరమ్మ మొదటి విడత ఇళ్లను త్వరిత గతిన పూర్తి చేయాలని హౌసింగ్ పిడి శంకర్ నాయక్ ఆదేశించారు.శుక్రవారం నారాయణపేట మండలం అప్పిరెడ్డి పల్లి గ్రామంలో హౌసింగ్ పిడి ఇందిరమ్మ 3నిర్మాణాలను పరిశీలిం చారుపురోగతి లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల లో భాగంగా మొండి గజాలమ్మ, బేగం ఇంటిని పరిశీలించి స్లాబ్ లెవెల్ లో ఉన్న ఇండ్ల ను పూర్తి చేయాలనీ ఆదేశించారు.ఈ కార్యక్రమం లో గ్రామం సర్పంచ్ పోలీస్ వెంకట్ రెడ్డి, ఉపసర్పంచ్ అంజనమ్మ హన్మత కోహిలి, వార్డ్ సభ్యులు పోలీస్ రవి, బొక్క లక్ష్మి ఇందిరమ్మ కమిటీ సభ్యులు గాండ్ల దేవేంద్రప్ప, అవుసలి హన్మంతు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలి

- ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడంలో నిర్లక్ష్యం వహించకూడదు
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ ప్రతినిధి, మార్చి 13 (జనంసాక్షి) : వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సురక్షిత తాగునీటి సరఫరా, నీటి వనరుల నిర్వహణపై ఎంపిడిఓలు, నీటి పారుదల, మిషన్ భగీరథ అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో గల అన్ని మండలాల వారీగా నీటి లభ్యతపై క్షుణ్ణంగా సమీక్షించి, వివరాలను అడిగి తెలుసుకొని, పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో లిజిల్లా కలెక్టర్లి మాట్లాడుతూ.. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి వనరుల పరిస్థితిని అధికారులు నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పని చేయకుండా ఉన్న బోర్లు, నీటి సరఫరా పైప్ లైన్లు, చేతి పంపులను వెంటనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకు రావాలని ఆదేశించారు. నీటి నిల్వ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాల న్నారు. అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయడానికి ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా నిరంతరం జరిగేలా చూడాలన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఎండాకాలంలో ఎక్కడా కూడా తాగునీటి కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని లికలెక్టర్లి స్పష్టం చేశారు. ప్రజలకు తాగునీటి సమస్యలు ఎదురైతే వెంటనే స్పందించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అదే విధంగా గ్రామాలు, పట్టణాల్లోని ప్రజలకు తాగునీటి సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1800ను కలెక్టరేట్ లో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో డీపీఓ వసంత, ఈఈ మిషన్ భగీరథ (ఇంట్రా) శ్రీకాంత్, ఈ ఈ మిషన్ భగీరథ (గ్రిడ్) సూర్య, నీటి పారుదల శాఖ ఎస్ఈ సీతారాం, ఈఈ రాజు, అన్ని మండలాల ఎంపీఓలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

## జనాభా గణన సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ..



వరంగల్ ప్రతినిధి, మార్చి 13(జనంసాక్షి): జనాభా లెక్కలు 2027, ప్రభుత్వ పథకాల అమలు, దేశాభివృద్ధికి కీలకమని, జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో జనాభా గణన-2027 నిర్వహణపై జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి అధికారులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాస్థాయిలో జనాభా గణనను సమర్థమంతంగా నిర్వహించేందుకు అవసరమైన విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. జనాభా గణన కార్యక్రమం రెండు దశల్లో నిర్వహించబడుతుందని తెలిపారు. మొదటి దశలో ఇళ్ల జాబితా (హౌస్‌లిస్టింగ్) మరియు గృహాల గణన నిర్వహించబడుతుందని, తెలంగాణ రాష్ట్రంలో ఈ దశ మే 11, 2026న ప్రారంభమై జూన్ 9, 2026 వరకు కొనసాగుతుంది. రెండవ దశలో జనాభా గణన (పాపులేషన్ ఎన్యుమరేషన్) ప్రక్రియ ఫిబ్రవరి 2027లో నిర్వహించబడుతుందని, మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారని అన్నారు. ఈసారి జరగనున్న జనాభా గణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారని, మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌లను ఉపయోగించి గణన ప్రక్రియను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి చంద్రకళ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ శాఖల అధికారుల బాధ్యతలను వివరించారు. అన్ని శాఖల సమన్వయంతో జనాభా గణన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని జనాభా గణన విభాగం హైదరాబాద్‌కు చెందిన సంయుక్త సంచాలకులు డి. సుబ్బరాజు, గణాంక అధికారి ఎస్. సతీష్ మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, వై వి గణేష్, డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి,సిపిఓ చంద్రకళ, ఆర్డీఓలు సుమా, ఉమారాణి, మునిసిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి, మార్చి 13, (జనంసాక్షి) : విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ లో, నస్పూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఆకస్మికంగా సందర్శించి భోజనశాల, వంటశాల, అత్యవసర సామాగ్రి నిల్వలు, విద్యార్థుల హాజరు పట్టిక, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అనేక చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులు, విద్యుత్, త్రాగునీరు, విద్యార్థిని విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందిస్తుందని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య ఈ సంవత్సరం 3 శాతం పెంపొందిందని, మరింత పెంపొందించేలా ఉపాధ్యాయులకు కృషి చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు విధుల పట్ల సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు తీరును మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ తో కలిసి పరిశీలించారు. కార్యక్రమం అమలుపై గ్రామపంచాయతీ సర్పంచ్ లు, మున్సిపల్ కార్పొరేషన్/మున్సిపాలిటీ మేయర్/చైర్ పర్సన్ లు, డిప్యూటీ మేయర్/ వైస్ చైర్ పర్సన్ లు, కార్పొరేటర్లు/ కౌన్సిలర్లకు శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. జూన్ 12వ తేదీ వరకు 99 రోజుల పాటు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి లలో కార్యచరణ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పారిశుధ్యం, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్ తదితర అంశాలపై కార్యాచరణ, సమాజ హిత అంశాలపై ప్రణాళికలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. సామాజిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, కార్యక్రమంలో భాగంగా 2, 3 వార్డులలో 3, 4 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రజా ప్రతినిధులు కార్యక్రమాలలో పాల్గొని ప్రజలను భాగస్వామ్యులను చేయాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ నిరంతరాయంగా కొనసాగించాలని తెలిపారు. అనంతరం మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి జిల్లాలో జాతీయ రహదారి విస్తరణ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన భూసేకరణకు సంబంధించి అందిన దరఖాస్తుల పరిష్కారం వివరాలను పరిశీలించారు. అభివృద్ధిలో భాగంగా భారత జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన 63, 163జి రహదారుల ఏర్పాటులో భాగంగా జిల్లాలోని దేవులవాడ, మందమర్రి, తిమ్మాపూర్, కోటపల్లి ప్రాంతాలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కార చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల అధికారులు ఉపాధ్యాయులు, 14వ డివిజన్ కార్పొరేటర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చిల్పూర్ దేవాలయాన్ని 10 కోట్లతో అభివృద్ధి చేస్తా

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- నూతనంగా 5వ సారి చైర్మన్ గా ప్రమాణం చేసిన పొట్లపల్లి శ్రీధర్ రావు
- ఘనంగా చిల్పూర్ దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకారం



స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 13 (జనంసాక్షి) : తెలంగాణలో రెండవ తిరుపతిగా పేరుగాంచిన చిల్పూర్ మండలంకేంద్రంలోని శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో గురువారం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావుతో పాటు పాలక మండలి సభ్యులు ప్రమా ణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహ రి హాజరై చైర్మన్ ను పాలక మండలి సభ్యులను శాలువా తో సన్మానిం చి శుభాకాంక్షలు తెలిపారు. పొట్లపల్లి శ్రీధర్ రావు చైర్మన్ కావడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ శు భాకాంక్షలు తెలిపా రు.ఆ తర్వాత ఆలయ ఈవో లక్ష్మీ ప్రసన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. ఆలయ పాలక వర్గంతో దేవాదాయ శాఖ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పాలక వర్గం ఆలయ పాలక వర్గం చైర్మన్ గా పొట్లపల్లి శ్రీధర్ రావు ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా నాపై నమ్మకంతో ఆలయ కమిటీ చైర్మన్ గా రెండవ సారి అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి కి ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పొట్లపల్లి శ్రీధర్ రావు భక్తి భావంతోనే కాకుండా సేవా భావంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలి పారు. శ్రీధర్ రావు స్వంత ఖర్చులతో ఆలయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయానికి ఉమ్మడివరంగల్ జిల్లాలోనే ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. చిల్పూర్ బుగులు వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుంటే తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నట్లే అని అన్నారు. చిల్పూర్ ఆలయ అభివృద్ధికి 10కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపొంది స్తున్నట్లు తెలిపారు. ఈ 10కోట్ల నిధులను ముఖ్యమం త్రి గారిని కలిసి రెండు నెలల్లో మంజూరు చేయిస్తానని తెలిపారు. ఏడాదిలో 10కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేసి భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఆలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించను న్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఆలయానికి ఎదురుగా ఇండ్లు నిర్మించుకున్న వాటికీ వేరే చోట ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఇప్పటికే ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా హద్దులు నాటి ఫెన్సింగ్ ఏర్పా టు చేసినట్లు వెల్లడించారు. గ్రామస్తులు సహకరిస్తేనే ఆలయ అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో లక్ష్మి ప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, పాలక వర్గ సభ్యులు గోలి రాజశేఖర్, పుల్యాల నారాయణరెడ్డి, డాక్టర్ వేముల వెంకటేశం, గనగోని రమేష్, కొండూరి రంగరాజు, దారం రా జన్ బాబు, గొల్లపెల్లి వాసు, బి కుమారస్వా మి , బత్తుల సూర్యనారాయణ, ఎడ్ల యాదయ్య, భూక్య శ్రీనివాస్ గూడేల్లి అరుణ రమేష్ రెడ్డి, ఎలగందుల రత్నాకర్ రెడ్డి, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకులు, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

- రాష్ట్ర అభివృద్ధిలో డీలర్స్ పాత్ర కీలకం
- ఫర్టిలైజర్స్ అసోసియేషన్ సన్మాన సభలో రాష్ట్ర అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు



వరంగల్ బ్యూరో, మార్చి 13 (జనం సాక్షి) : రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తేనే డీలర్స్ ను ఎక్కువగా నమ్ముతారని, రాష్ట్రా అభివృద్ధిలో డీలర్స్ పాత్ర కీలకమని తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్,పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్,డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. వరంగల్ నుండి శివనగర్ లో గల ది వరంగల్ ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్,డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు సభా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో... ఇటీవల ఎన్నికైన నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గం ఏదైనా నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయాన్ని కొనసాగించాల్సినటువంటి బాధ్యత డీలర్ల అందరి పైన ఉందని, దీన్ని తప్పకుండా పాటించాల్సినటువంటి అవసరం ఉందన్నారు. కార్యవర్గంలో చర్చించి నిర్ణయం తీసుకున్న తర్వాత ఆ నిర్ణయాన్ని కట్టుబడి, ఆ నిర్ణయం పట్ల మనమందరం కూడా తన వంతు పాత్రను పోషించాలన్నారు. జై జవాన్ జై కిసాన్...నిజంగా మనం కూడా రైతు రాజు కావడానికి మన వంతు పాత్ర ఉందన్నారు.ఫస్ట్ మనం పాటించాల్సింది క్వాలిటీ.రైతుకు మనం వెన్ను దండగా ఉండాల్సినటువంటి బాధ్యత మన పైన ఉంది.రైతులకు అందుబాటులో ఉండి నాణ్యమైన విత్తనాలు, నాణ్యమైన పురుగు మందులు అందించాలన్నారు. క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కావద్దని, నాణ్యమైనటువంటి కంపెనీ విత్తనాలను మాత్రమే రైతులకు అందించాలని అందరికీ కోరుకుంటున్నానని అన్నారు. విత్తనాన్ని చెక్ చేసిన తర్వాతనే మనం రైతు కు అమ్మాలి తప్ప, మనం ఏ విత్తనాన్ని గాని, ఏ పురుగుమందు గానీ ఏదైనా కూడా ట్రయాల్ చూడకుండా ప్రమోట్ చేయవద్దని విషయాన్ని తెలిపారు. రైతుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత మన పైన ఉందన్న విషయాన్ని కూడా ఈ సభా సందర్భంగా గుర్తు చేశారు. మండల స్థాయి, జిల్లా స్థాయి జిల్లా స్థాయి రాష్ట్ర స్థాయి వరకు కూడా కమిటీలను పటిష్టం చేయాల్సినటువంటి పరిస్థితి ఉందని,అవన్నీ కూడా జిల్లాల వారిగా ఇంకా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని,వరంగల్ జిల్లాలో మాదిరిగా మన ఆత్మగౌరవ భవనాన్ని రాష్ట్ర స్థాయిలో కూడా తప్పకుండా భవన నిర్మాణం మీ అందరి సహకారంతోటి పూర్తి చేస్తానని అన్నారు.. ఎవరైనా వచ్చినా కూడా ఒక రెస్ట్ తీసుకోవడానికి కొన్ని రూమ్స్ ఇవ్వాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించుకున్నామని, తప్పకుండా మీ అందరి యొక్క సహకారం తో బిల్డింగ్ నిర్మాణాన్ని చేసి తప్పకుండా నెరవేరుస్తామని తెలిపారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామడుగు మనోహర్ మాట్లాడుతూ డీలర్స్, డిస్ట్రిబ్యూటర్స్ కు ఎటువంటి కష్టమొచ్చినా అండగా ఉండాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరు కూడా పని చేయకూడదని అన్నారు.రాష్ట్ర కోశాధికారి సిద్ధి నాగరాజు మాట్లాడుతూ భవన నిర్మాణానికి కావలసినటువంటి నిధులను సేకరించి భవన నిర్మాణం త్వరలో చేపడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బొద్ది రెడ్డి నరసింహారెడ్డి, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ రెడ్డి, కేదారి, పాండు రంగయ్య, వివిధ జిల్లాల నాయకులు మాడిశెట్టి అశోక్, శేఖర్,రతన్,రాజేందర్ రెడ్డి, రమేష్, రవి, అమూల్య ప్రవీణ్, సదానందం, మురళితో పాటు తదితరులు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ ప్రతినిధి, మార్చి 13 (జనంసాక్షి): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి పైన గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలెక్టర్ శుక్రవారం మినీ కాన్ఫెరెన్స్ హల్ లో సమీక్షా నిర్వహించారు. జిల్లా లో మంజూరు అయిన ఇండ్లు ఇప్పటి వరకు ఏ ఏ దశ లో ఉన్నాయని..గ్రామా ల వారీగా కలెక్టర్ రివ్యూ చేసి... వివరాలను అడిగి తెలుసుకొని ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలనీ వారికి లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇప్పటివరకు జిల్లా లో రెండు విడత లుగా 5647 ఇల్లు మంజూరు కాగ... 241 ఇల్లు నిర్మాణం పూర్తి అవ్వగా..స్లాబ్ లెవల్ లో 2920, రూఫ్ లెవల్ లో 544, బెస్మెంట్ లో 1128... మార్క్ ఔట్ అయినప్పటికీ బెస్మెంట్ లెవల్ కి రాని ఇల్లు 450 ఉన్నాయని పీడీ హౌసింగ్ తెలిపారు. ఈ సమావేశం లో పీడీ హౌసింగ్ మాతృ నాయక్, డి ఈ, ఎ ఈ లు పాల్గొన్నారు.

## పుష్కరాలపై మంత్రి శ్రీధర్ బాబు సమీక్ష

- అధికారులపై ఆగ్రహం
- పలు పనులకు శంకుస్థాపనలు , ప్రారంభోత్సవాలు



కాళేశ్వరం , మార్చ్ 14 (జనంసాక్షి) : పూర్తి చేయాల్సిన పనులకు డెడ్ లైన్ పెట్టండి అప్పటి వరకు పూర్తి చేయకపోతే అధికారులకు షోకాజ్ నోటీ సులు జారీ చేసి శాఖ పరంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. శు క్రవారం మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. కాళేశ్వరం నుంచి పలుగుల వరకు 22 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించబోయే 7 కిలోమీటర్ల డబుల్ బీటీ రోడ్డు పనులకు, అదేవిధంగా కాళేశ్వరం లో 1.20 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న మ్యూజియం పనులకు, ఆది ముక్తేశ్వర దేవస్థానం నుండి సరస్వతి ఘాట్ వరకు 2 కోట్ల 38 లక్షల రూపాయల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, 1 కోటి 55 లక్షల రూపాయలతో నిర్మించిన అన్నదాన సత్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం, అన్నారం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. అనంతరం కాళేశ్వరం ఈఓ కార్యాలయంలో సరస్వతి అంత్య పుష్కరాలు మరియు రాబోయే గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమైన సమావేశానికి ఎస్ ఈ స్థాయి అధికారులు హాజరు కాకపోవడంపై మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మాకేం పని లేదనుకుంటున్నారా? పుష్కరాల కంటే ముఖ్యమైన పనులు ఏమి ఉన్నాయి? అని అధికారులను ప్రశ్నించారు. పుష్కరాల నిర్వహణకు సంబంధించిన పనులను అధికారులు సమన్వయంతో మే మొదటి వారం వరకు వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. బస్ స్టాండ్ స్థలం గెజిట్ లేదు కదా ఎందుకు ఆటంకం కలిగిస్తున్నారని అటవీ శాఖ అధికారులను ప్రశ్నించారు . బస్ స్టాండ్ లేకపోవడం వల్ల భక్తులు ఇబ్బంది పడుతున్నారని, చెరువు సర్వే చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ నిర్దేశించిన టైం లో గా అన్ని శాఖల అధికారులు వారి కేటాయించిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ధార్మిక సంస్థ సలహాదారుడు గోవింద హరి, ఎస్పీ సంకీర్త్, అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, దేవాదాయ, ఇరిగేషన్, విద్యుత్తు, పీఆర్, ఇరిగేషన్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వంట గ్యాస్ కొరత లేదు

- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి): జిల్లాలో వంట గ్యాస్ కొరత ఏ మాత్రం లేదని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రాజర్షి షా హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని విమల్ గ్యాస్ ఏజెన్సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సిలిండర్ల స్టాక్ వివరాలు, ఆన్లైన్ బుకింగ్, ఇతర అంశాలపై సమీక్షించి నిర్వాహకులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... సిలిండర్ల కొరతపై సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, జిల్లాలో మాత్రం ఎలాంటి కొరత లేదని వెల్లడించారు. ఆన్లైన్లో బుక్ చేసుకున్న వెంటనే వినియోగదారులకు సిలెండర్ లను అందజేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. బ్లాక్ మార్కెట్ చేస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

## గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవు

- డిమాండ్‌కనుగుణంగా లభ్యత
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్
- గ్యాస్ సరఫరాలో అసత్య ప్రచారాలను నమ్మవద్దు, తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు
- జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్



మహబూబాబాద్ బ్యూరో, మార్చి 13 (జనం సాక్షి): శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, అదనపు కలెక్టర్ రెవెన్యూ అనిల్ కుమార్, సివిల్ సప్లై, గ్యాస్ డీలర్స్, విద్యాశాఖ, హాస్పటల్ సంబంధిత అధికారులతో కలిసి గ్యాస్ సరఫరా పై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం (11) ఏజెన్సీల పరిధిలో 2,12131 గ్యాస్ కనెక్షన్లు కలవని, గతవారం రోజుల నుండి పైన తెలిపిన 11 గ్యాస్ ఏజెన్సీల ద్వారా 13985 సిలిండర్ల వినియోగదారులకు పంపిణీ చేయడం జరిగిందని, డిమాండ్ కు అనుగుణంగా సంబంధిత ఏజెన్సీల వద్ద వినియోగదారులకు సరిపడా గ్యాస్ సిలిండర్లు నిల్వలో సిద్ధంగా ఉన్నాయన్నారు, అనవసరంగా ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మవద్దని, డిమాండ్ కనుగుణంగా గ్యాస్ లభ్యత ఉందని, తెలిపారు. కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. సివిల్ సప్లై విజిలెన్స్ కమిటీ సభ్యులు నిత్యం గ్యాస్ డీలర్ల వద్ద ఉన్న స్టాకును గమనిస్తూ ఉండాలని వినియోగదారులతో పాటు ఆసుపత్రులకు, విద్యాసంస్థలకు, ప్రభుత్వ సంస్థలకు గ్యాస్ సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచిం చారు. హోటళ్ళు, రెస్టారెం ట్లలో కమర్షియల్ సిలిండర్ మాత్రమే ఉపయోగించాలని, డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్యాస్ డెలివరీ చేసే సమయంలో డెలివరీ బాయ్ కి ఓటీపీ చెప్పి సహకరించాలని, వారి విధులకు ఎవరైనా ఆటంకము కలిగించినట్లయితే, అలాంటి వినియోగదరులపైన కూడా చట్టపరముగా చర్యలు తీసుకోబడతాయని అన్నారు. ఎల్పీజీ వినియోగదారులు తప్పనిసరిగా కేవైసీ పూర్తి చేసుకోవాలని, గ్యాస్ ఏజెన్సీల వద్ద, ఆన్లైన్లో కానీ గ్యాస్ కంపెనీ అధికారిక వెబ్సైట్ లేదా యాప్ లో, గ్యాస్ సిలిండర్ పంపిణీ సమయంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల వద్ద కేవైసీ పూర్తి చేసుకోవచ్చని సూచించారు.జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్ సరఫరా లో ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు లేవని సోషల్ మీడియా వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని ఏట్టి పరిస్థితిల లో అలాంటి వార్తలను నమ్మ వద్దని తెలిపారు,

## పోతిరెడ్డిపల్లిలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం




**చేర్యాల, మార్చి 13 (జనంసాక్షి) :** మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవం జరిగింది. ఎంఈఓగా అభిరామ్, ప్రధానోపాధ్యాయులుగా భానుతేజ, ఉపాధ్యాయులుగా సింధుజ, తేజశ్రీ, అక్షర, శివకేశవ , రేవంత్ రెడ్డి పీఈటీ గా అభిలాష్ లు వ్యవహరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టిన్గిరికార్ కిషన్ మాట్లాడుతూ.. విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని దాంతోపాటు మంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని ఉపాధ్యాయులగా వ్యవహరించిన ప్రతి ఒక్కరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దొంగల ఆయిల్ రెడ్డి, ఈగ ఆంజనేయులు, కర్రోల్ల విజయకుమార్,సంధ్యారాణి స్వరూప, కవిత, ఏపీపీసీ చైర్మన్ లత విద్యార్థుల తల్లిదండ్రులు వార్డు సభ్యులు శ్రీలత, సుమన తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం

- ఆర్టీసి యాజమాన్యానికి సమ్మె నోటీసు అందించిన జేఏసీ

**ముషీరాబాద్, మార్చ్ 13 (జనం సాక్షి) :** ప్రభుత్వ అధికారులు, ఆర్టీసీ యాజమాన్యం స్పందించి ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మె దిగుతామని తెలంగాణ ఆర్టీసీ జేఏసీ నాయకులు ఆర్టీసీ యాజమాన్యానికి, లేబర్ కమిషనర్ కు శుక్రవారం సమ్మె నోటీసులు అందించారు. ఆర్టీసి కార్మికుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసి యాజమాన్యానికి, ప్రభుత్వానికి ఎన్ని మెమోరాండమ్ లు సమర్పించినా స్పందన లేకపోవడంతో విధిలేని పరిస్థితిలో సమ్మె నోటీస్ ఇవ్వాల్సి వచ్చిందని ఆర్టీసి జెఎసి నాయకులు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆర్టీసి జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి. మౌలానా, కో కన్వీనర్ కె.యాదయ్య, కో కన్వీనర్ ఎస్.సురేష్, బి.యాదగిరి లు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2017 వేతన సవరణ ఇచ్చారని, కాని ఆ వేతన సవరణకు సంబంధించిన ఎరియర్స్ నేటివరకు చెల్లింపు కాలేదన్నారు. ఆ వేతన సవరణలో జరగాల్సిన అలవెన్స్ లు, ఫ్రింజ్ బెనిఫిట్స్ పెంచకపోవడం చాలా



విచారకరమన్నారు. పాత అలవెన్స్ లే ఇవ్వటం వలన ఆర్టీసి కార్మికులకు ఆర్థిక నష్టం జరిగిందన్నారు. 2017 లో రిటైరైన కార్మికులకు ఫిక్సేషన్లు జరిగినా, నేటివరకు వారికి సెటిల్మెంట్స్ చేయలేదని తెలిపారు. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్మెంట్ తో ఆర్టీసి కార్మికులకు అందజేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, ఆయన ముఖ్యమంత్రి అయి రెండున్నర సంవత్సరాలు గడిచినా విలీన ప్రక్రియ నేటివరకు మొదలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ నేటివరకు నెరవేరకపోవడంతో కార్మికులలో అసంతృప్తి నెలకొందని అన్నారు. విధినిర్వహణలో ఆర్టీసి ఉద్యోగి చనిపోతే బ్రెడ్ విన్నర్ స్కీమ్ కింద ఆ కుటుంబంలో అర్హులైన ఒకరికి ఉద్యోగం ఇస్తారు కాని ఆర్టీసిలో ఇచ్చే ఉద్యోగం రెగ్యులర్ ప్రాతిపదికన కాకుండా కన్సాలిడేటెడ్ బేసిస్ లో కారుణ్య నియామకాలు చేపట్టడం అత్యంత దురదృష్టకరమన్నారు. కాబట్టి సింగరేణి, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఆర్టిసి లో బ్రెడ్ విన్నర్ స్కీమ్ కింద చేసే నియామకాలు రెగ్యులర్ ప్రాతిపదికన ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. 2019 నుండి బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసిలో ట్రేడ్ యూనియన్లను నిర్వీర్యం చేసిందని, దానివలన ఆర్టీసి కార్మికులపై యాజమాన్యం వేధింపులు ఎక్కువయ్యాయని, అధికారులు పనిభారాలను పెంచి కార్మికుల నడ్డి విరుస్తున్నారని ఆయన విమర్శించారు. ఆర్టీసిలో ట్రేడ్ యూనియన్లను రెస్టోర్ చేస్తూ, చట్ట ప్రకారం నిర్వహించాల్సిన ఎన్నికలు జరపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తక్షణమే అధికారులు స్పందించి ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున సమ్మెకు దిగుతామని, సిద్ధం సిద్ధం సమక్షం అంటూ ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లకు కొరత లేదు

- వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 13 (జనంసాక్షి) :** జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు.శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలు, పౌరసరఫరాల అధికారులతో ఎల్పిజి గ్యాస్ సరఫరాపై సమావేశం నిర్వహించారు. గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సరఫరా లో ఏలాంటి కొరత లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.సూర్యాపేట జిల్లాల్ 415509 డొమెస్టిక్ కనెక్షన్లు ఉన్నాయని,ప్రస్తుతం జిల్లాలో 17647 డొమెస్టిక్ సిలిండర్లు, 552 కమర్షియల్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్యాస్ బుక్ చేసుకున్న రెండు మూడు రోజుల్లోనే వినియోగదారులకు సకాలంలో డెలివరీ చేయడం



జరుగుతుందని వివరించారు. కమర్షియల్ సరఫరాలో ఏర్పడిన కొరతను అధిగమించేందుకు ఉపశమనం వైపు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ ను ఎవరైనా కమర్షియల్ గా వాడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత లేనందున ప్రజలు ఆందోళనకు గురై అనవసరంగా గ్యాస్ బుక్ చేసుకోవద్దని కోరారు. సీనియారిటీ ప్రకారం ఏజెన్సీలు గ్యాస్ ను సరఫరా చేయడం జరుగుతున్నదని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే సరిపడా గ్యాస్ సిలిండర్లు ఉన్నట్లు చెప్పారు.గ్యాస్ బుకింగ్ కు సంబంధించి సర్వర్ సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై కూడా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.ఈ విషయమై సంబంధిత గ్యాస్ ఏజెన్సీ లతో మాట్లాడడం జరిగిందని, త్వరలోనే సర్వర్ సమస్యను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా ఏజెన్సీ నిర్వాహకులు అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జిల్లా పౌర సరఫరా అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ సివిల్ సప్లై రాము, తదితరులు పాల్గొన్నారు.

## దేవగిరి నగరంలోని రాక్షస గుహలను పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్



**పినపాక, మార్చి 13 (జనం సాక్షి) :** పినపాక మండలం పాండురంగాపురం గ్రామపంచాయతీ పరిధిలోని దేవగిరి నగరంలో ఉన్న ప్రాచీన రాక్షస గుహలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ శుక్రవారం పరిశీలించారు. ప్రాంతీయంగా ప్రత్యేకత కలిగిన ఈ గుహలను ప్రత్యక్షంగా సందర్శించిన ఎస్పీ, అక్కడి పరిస్థితులు, భద్రతా అంశాలను అధికారులతో కలిసి సమీక్షించారు.గుహల చుట్టుపక్కల ఉన్న అడవి ప్రాంతం, అక్కడికి వెళ్లే మార్గాలు, వంటి విషయాలపై వివరాలు తెలుసుకున్నారు. గుహల ప్రాంతంలో అనవసరంగా ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేవగిరి ప్రాంతంలోని రాక్షస గుహలు చారిత్రకంగా, సహజసిద్ధంగా ప్రత్యేకత కలిగిన ప్రదేశమని తెలిపారు. ఈ ప్రాంతాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. గుహల వద్ద పరిశుభ్రతను కాపాడాలని, ప్రకృతికి హాని కలిగించే చర్యలు చేయవద్దని ప్రజలకు సూచించారు. అలాగే స్థానిక యువత, గ్రామస్థులు ఈ ప్రాంతాన్ని సంరక్షించడంలో సహకరించాలని కోరారు. అవసరమైతే పర్యాటకులు, సందర్శకుల భద్రత కోసం పోలీసు శాఖ తరపున తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ పరిశీలన కార్యక్రమంలో మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సురేష్,స్థానిక పోలీసులు, సింగిరెడ్డిపల్లి ఉపసర్పంచ్ కిషోర్,అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

- యువత ర్యాష్ డ్రైవింగ్,త్రిబుల్ రైడ్ చేస్తే కేసులు నమోదు...
- గంజాయి తాగిన, విక్రయించిన జైలుకే...
- పిడిఎస్ బియ్యం విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు
- వైరా ఏసిపి ఎస్.సారంగపాణి



**మధిర, మార్చి 13 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అక్రమ రవాణా ప్రభుత్వ నిబంధనలకు లోబడి రవాణా చేయాలని అలాకాకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే అట్టి ఇసుక ట్రాక్టర్ల పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వైరా ఏసిపి సారంగపాణి తెలిపారు. శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో వైరా ఏసిపి సారంగపాణి మాట్లాడుతూ మధిర ఆంధ్ర సరిహద్దు ప్రాంతం నుండి అక్రమంగా ఇసుక తరలిస్తే సతపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అదేవిధంగా రాష్ డ్రైవింగ్ చేసిన త్రిబుల్ రైడింగ్ డ్రైవింగ్ చేసిన లైసెన్స్ ఆర్ సి హెల్మెట్ లేకుండా రోడ్డుపై వాహనాలు నడిపిన అలాంటి వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారన్నారు. అదేవిధంగా వైరా డివిజన్ పరిధిలోని గంజాయి తాగిన అమ్మకాలు చేపట్టిన అలాంటి వారిపై కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారన్నారు. ఇసుక అక్రమ రవాణా జరిగే సమాచారాన్ని ప్రజలు ఇస్తే సమాచారం ఇచ్చిన వారికి తగిన పారితోషం ఇవ్వటం జరుగుతుందని వారు తెలిపారు. ముందుగా ఇసుక రవాణా చేసే వారితో అవగాహన సమావేశం ఏర్పాటు చేసి వారికి తగిన సూచనలు ఇవ్వటం జరుగుతుందని ఆ తర్వాత ఇసుక అక్రమ రవాణా జరిగితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో మధిర సీఐలు మధు రమేష్ రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి పాల్గొన్నారు.

## చందానగర్ లో అర్ధరాత్రి అను ఫర్నిచర్ షోరూం దగ్ధం

- తేరుకునేలోపే భారీ ఆస్తి నష్టం

**శేరిలింగంపల్లి, మార్చి 13 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ పరిధిలో ముంబై జాతీయ ప్రధాన రహదారిపై గురువారం రాత్రి 5 అంతస్తులు కలిగిన అనూ ఫర్నిచర్ షోరూమ్ అగ్ని కీలలలో చిక్కి పూర్తిగా దగ్ధం అయిపోయింది. ముంబై జాతీయ ప్రధాన రహదారి కావడంతో శేరిలింగంపల్లిలో ఫర్నిచర్ షోరూం దగ్ధం వార్త దావానలంలా వ్యాపించడంతో భారీ సంఖ్యలో ప్రజలు గుమిగూడడం జరిగింది. అను ఫర్నిచర్స్ షో రూమ్ మేనేజర్, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... ప్రతిరోజు లాగే గురువారం రాత్రి 11 గంటలకు షోరూం ను మూసివేసి తాళాలు వేసుకుని ఇంటికి బయలుదేరిన మేనేజర్ కు సరిగ్గా అరగంటలో సెక్యూరిటీ విభాగం నుండి ఫోన్ కాల్ వచ్చింది. దాని సారాంశం ప్రకారం... షోరూం కింది గోదాం నుండి భారీగా దట్టమైన పొగలు విస్తరిస్తున్నాయని, లోపల ఏదైనా అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చని సమాచారం అందింది. దీంతో హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకునేసరికే మూడు ఫైర్ ఇంజన్లు అక్కడికి చేరుకొని మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ పరుపులు, నైలాన్ వస్తు సామాగ్రి, ప్లాస్టిక్ వస్తువులు అధికంగా ఉండడంతో చూస్తుండగానే



మంటలు ఐదంతస్తులకు విస్తరించి షో రూమ్ కాస్త పూర్తిగా కాలిపోవడం జరిగింది. దీంతో కొన్ని గంటలపాటు ముంబై జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ తో పాటు కలకలం కూడా రేగింది. షోరూం పూర్తిగా అగ్నికి ఆహుతి కావడంతో మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రాథమిక అంచనా ప్రకారం విద్యుత్ ఘాతానికి గురై షోరూం తగలబడిపోయి ఉంటుందని, ఎలాంటి ప్రాణ నష్టం జరగనప్పటికీ భారీగా ఆస్తి నష్టం జరిగిందని, దాదాపు కోటి రూపాయల వరకు విలువైన సామాగ్రి తగలబడిపోయిందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

## పది పరీక్షలకు సర్వం సిద్ధం

**తలకొండపల్లి, మార్చి 13 (జనంసాక్షి) :** పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు మండల విద్యాధికారి చాంప్లా నాయక్ తెలిపారు.మండల కేంద్రంలో రెండు,వెల్జాల్ గ్రామంలో ఒకటి పరీక్ష కేంద్రాల్లో మండల వ్యాప్తంగా ఉన్న 15 పాఠశాలల కు చెందిన 448 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.శనివారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షల కోసం విద్యార్థులు కేంద్రాలకు 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన అనుమతించనున్నట్లు తెలిపారు.ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం,వైద్య సౌకర్యం,విద్యుత్తు సౌకర్యం



కల్పించారు.అలాగే సీసీ కెమెరాల పర్యవేక్షణలో విద్యార్థుల పరీక్షలు రాయనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి ఆటంకం కలగకుండా పోలీసుల పర్యవేక్షణలో 144 సెక్షన్ విధించినట్లు,పరీక్ష జరుగుతున్న కేంద్రాల సమీపంలో పరీక్ష అయిపోయేంతవరకు జిరాక్స్ కేంద్రాలను మూసివేసే విధంగా ఆదేశాలు జారీ చేసినట్లు మండల విద్యాధికారి చాంప్లా నాయక్ తెలిపారు.విద్యార్థులు తమ వెంట తెచ్చుకున్న వస్తువులు దాచుకోవడానికి పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక రూములు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాయాలని ఆయన సూచించారు.

## సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన




**బూర్గంపహాడ్, మార్చి 13 (జనంసాక్షి) :** బూర్గంపహాడ్ మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో ఐటీసీ పీఎస్పీడీ సీఎస్ఆర్ నిధులు రూ.50 లక్షలతో నాలుగు సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు కొబ్బరికాయ కొట్టి శుక్రవారం ప్రారంభించారు. ఐటీసీ సీఎస్ఆర్ నిధులతో ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా విద్య, వైద్య రంగాల అభివృద్ధికి నిధులు ఖర్చు చేస్తుందని అందులో భాగంగా గ్రామంలో డ్రైనేజీ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. తొలుత గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ఆ తర్వాత అభివృద్ధి పనులను ప్రారంభించారు. మండల పర్యటనలో భాగంగా సందెళ్ల రామాపురంలో సమ్మక్క, సారలమ్మ జాతరలో పాల్గొని అమ్మవార్లకు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, ఐటీసీ అడ్మిన్ మేనేజర్ చంగల రావు, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్, కాంగ్రెస్ నాయకులు బాదం రమేష్ రెడ్డి, నాగిరెడ్డి, కైపు శ్రీనివాసరెడ్డి, గుండె వెంకన్న, భజన ప్రసాద్, ఇంగువ రమేష్, మారం వెంకటేశ్వరరెడ్డి, ఎడమకంటి సుధాకర్రెడ్డి, సారెడ్డి అశోక్ రెడ్డి, నిమ్మల హరీష్, దునుకు రాము, కందుల రాము, నరేష్, బాలకృష్ణ, కాటం వెంకట్రామిరెడ్డి, గాదె వెంకటేశ్వరరెడ్డి, ఎడమకంటి రోశిరెడ్డి, శేషిరెడ్డి, ఆవుల నాగిరెడ్డి, పాలెం లక్ష్మిరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లకు కనీసం 18 వేల వేతనం ఇవ్వాలి

- ఎమ్మెల్యేకు వినతి

**నర్సాపూర్, మార్చి 13 (జనంసాక్షి) :** ఆశ వర్కర్లకు కనీసం 18 వేల రూపాయలు వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు అన్నారు శుక్రవారం ఈ సందర్భంగా సిఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం 18 వేల రూపాయలను వెంటనే అమలు చేయాలని ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రకటించాలని కోరుతూ వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. పేదలకు వైద్య సేవలు అందిస్తున్న నుంచి హెచ్ ఎం కు సరిపడా నిధులు కేటాయించాలని. పెండింగ్ లో ఉన్న ఫిబ్రవరి రెండు నెలల పారితోష్కాలను వెంటనే చెల్లించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20



సంవత్సరాలు నుండి పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని వీరంతా మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే అత్యధికలు ఉన్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కరోనా సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు వైద్య సేవలు అందించారని తెలిపారు. ఆశా కార్యకర్తల యొక్క సేవలను గుర్తించి ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్ఓ ఆరోగ్య కార్యకర్తలను గ్లోబల్ లీడర్స్ గా అవార్డునందించిందని తెలిపారు. అనేక సేవలందిస్తున్న ఆశా కార్యకర్తలకు చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం పక్కా రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ లో మాదిరిగా ఫిక్స్ వేతనం ఇప్పటివరకు చేయలేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆశలకు కనీస వేతనం 18 వేల రూపాయలు అమలు చేస్తామన్న హామీ నేటికీ నెరవేరలేదన్నారు. 50 లక్షల ఇన్సూరెన్స్ 5 వేల మట్టి ఖర్చులు ,రిటర్మెంట్ బెనిఫిట్స్ తదితర హామీలు ఇచ్చినప్పటికీ అవి హామీలుగానే మిగిలిపోతున్నాయని ఆందోళన వంటి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు శ్యామల నాయకులు మంజుల, తదితరులు పాల్గొన్నారు.

## అమరవాయిలో శ్రీనల్లారెడ్డి చింతల మునిస్వామి రథోత్సవం

**మల్దకల్, మార్చి 13 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం అమరవాయి గ్రామంలో శ్రీ నల్లారెడ్డి చింతల మునిస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఉగాది పండుగ పర్వదినానికి ముందుగా ఉత్సవాలు జరగడం ఆనవాయితీ వస్తుంది. ఆలయ నిర్వాహకులు గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రథోత్సవంతోపాటు పల్లకి సేవ దేవాలయం నుండి ఊరేగింపుగా గ్రామంలోని ఉన్న ఆంజనేయస్వామి గుడి వరకు రథోత్సవాన్నిలాగి యధా స్థానానికి చేరుకుంటుంది.శుక్రవారం దేవాలయంలో బిందెసేవ పంచామృతభిషేకం, తదితరు కార్యక్రమాలు పూజలు జరిగాయి.శనివారము వివిధ గ్రామాల ప్రజలు భక్తులు స్వామి వారికి దాసంగాలు పెట్టి మొక్కుబడులు తీర్చుకుంటారు.



# విపణి

## అడోబ్ సీఈఓ పదవి నుంచి వైదొలగనున్న శంతను నారాయణ్

**వాషింగ్టన్:**అమెరికాకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ అడోబ్‌లో నాయకత్వ మార్పు జరగనుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా కొనసాగుతోన్న శంతను నారాయణ్ ఆ పదవి నుంచి దిగిపోనున్నారు. ఈ మేరకు కంపెనీ తాజాగా ఓ ప్రకటన చేసింది. తదుపరి సీఈఓ ఎంపిక పూర్తయిన తర్వాత శంతను ఆ బాధ్యతల నుంచి వైదొలగనున్నట్లు పేర్కొంది. అయితే, బోర్డు ఛైర్మన్‌గా ఆయన కొనసాగుతారని తెలిపింది.అయితే, ఈ మార్పునకు గల కారణాన్ని మాత్రం కంపెనీ గానీ.. శంతను నారాయణ్ గానీ వెల్లడించలేదు. "సీఈవో బాధ్యతల నుంచి మారాలనుకుంటున్న నా నిర్ణయాన్ని బోర్డుకు తెలియజేశాను. దానికి బోర్డు అంగీకరించింది. ఇది గుడ్‌బై ఎంతమాత్రం కాదు. బోర్డు ఛైర్మన్‌గా కంపెనీ కోసం శ్రమిస్తూనే ఉంటా" అని ఉద్యోగులకు రాసిన మెయిల్‌లో శంతను పేర్కొన్నారు. మరోవైపు, అడోబ్ తదుపరి సీఈఓ ఎంపిక కోసం బోర్డు ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసింది.

అమెరికా తయారీకి చేటు చేస్తున్నాయా?

భారత్‌కు చెందిన 62 ఏళ్ల శంతను నారాయణ్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఎంబీఏ చదివారు. తొలుత సిలికాన్ గ్రాఫిక్స్, యాపిల్‌లో కొంతకాలం పనిచేసిన ఆయన.. 1998లో అడోబ్‌లో జనరల్ మేనేజర్‌గా చేశారు. 2007లో కంపెనీ సీఈఓగా బాధ్యతలు అందుకున్నారు. ఆయన నాయకత్వంలో కంపెనీ రికార్డు రెవెన్యూను సాధించింది. క్రియేటివ్, డిజిటల్ మీడియా సాఫ్ట్‌వేర్‌లో ప్రత్యేక స్థానం సాధించింది. బిజినెస్ రంగంలో శంతను అందించిన సేవలకు గానూ.. భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

## నీటి సీసాలకు 'యుద్ధ సెగలు'

### మార్కెట్‌లోకి 19 మిలియన్ బ్యారెళ్ల చమురు..

**న్యూఢిల్లీ:**ఇప్పటికే లోడ్ అయిన చమురు రవాణాకు అమెరికా ఆంక్షలు సడలించడంతో.. అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లో రష్యాకు చెందిన 30 ట్యాంకర్లలోని చమురు కొనుగోలు కోసం అందుబాటులో ఉంది. ఈ నౌకల్లో 19 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు, 3,10,000 టన్నుల రిఫైన్డ్ ఉత్పత్తులు ఉన్నాయి.రష్యాకు ఊహించని లాభాలు..అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో పశ్చిమాసియా దేశాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. యుద్ధం వల్ల ఇంధన ధరలు పెరగడం రష్యాకు అనుకూలిస్తోందని, యుద్ధంలో రష్యానే విజేత అని యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా ఇటీవల వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఆ మాటే నిజమవుతోంది. భగ్గుమంటోన్న ధరల కారణంగా పుతిన్ ప్రభుత్వానికి బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరుతోందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయిగురువారం సెనెట్ సాయుధ సేవల కమిటీ విచారణ సందర్భంగా యూఎస్ సెనెటర్ ఆంగస్ కింగ్ మాట్లాడుతూ.. "ఈ యుద్ధంలో స్పష్టమైన విజయం పుతిన్, రష్యాదే. ఈ యుద్ధం మాస్కోకు ఊహించని లాభాలు తెచ్చిపెడుతోంది" అని అన్నారు.

# బేర్‌మన్న సూచీలు..

### ఇన్వెస్టర్ల జేబులకు మరో రూ.10 లక్షల కోట్లు చిల్లు



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి భారీ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు, చమురు ధరలు పెరుగుదల, ఎఫ్ఐఐల విక్రయాలు వంటివి సూచీలపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో సూచీలు వరుసగా మూడోరోజూ భారీ నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ ఓ దశలో 1500 పాయింట్లు నష్టపోయింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.10 లక్షల కోట్లు క్షీణించి రూ.429 లక్షల కోట్లకు చేరింది.అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 75,444.22 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,034.42) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 74,454.60 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1470.50 పాయింట్ల నష్టంతో 74,563.92 వద్ద ముగిసింది. నిఫ్టీ 488 పాయింట్ల నష్టంతో 23,151 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.45గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హిందుస్థాన్ యూనిలీవర్, భారతీ ఎయిర్‌టెల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. ఎల్అండ్‌టీ, టాటా స్టీల్, ఎస్‌బీఐ, బీఈఎల్, మారుతీ సుజుకీ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100.61 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5091 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు కొనసాగుతున్నాయి. ఖమేనీ మరణంతో ఎంతోకాలం కొనసాగదనుకున్న ఈ పోరు.. ప్రాంతీయ యుద్ధంగా విస్తరించడమే కాకుండా రెండు వారాలు కూడా పూర్తి చేసుకుంటుండడం ప్రతికూల ప్రభావం చూపింది.తగ్గినట్లే తగ్గిన చమురు ధర మళ్లీ 100 డాలర్ల మార్కును దాటింది. చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిని ప్రత్యర్థులపై 'ఒత్తిడి తెచ్చే సాధనం'గా మొజ్తాబా పేర్కొన్నారు. యుద్ధం ముగిసే వరకు దీని మూసివేత కొనసాగుతుందని ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ పేర్కొనడంతో చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. చమురు ధరలు పెరగడం మన రూపాయి విలువపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. దిగుమతుల బిల్లు పెరగడంతో రూపాయిపై ఒత్తిడి పెరుగుతోంది. దీంతో రూపాయి ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరింది.మరోవైపు అమెరికాలో రెండేళ్ల కాలవ్యవధి కలిగిన బాండ్లపై రాబడులు ఆరు నెలల గరిష్ఠ స్థాయికి చేరాయి. 10 ఏళ్ల బాండ్ ఈల్డ్స్ కూడా భారీగా పెరిగాయి. అమెరికాలో బాండ్లపై రాబడులు పెరిగితే మనలాంటి వర్ధమాన దేశాల స్టాక్ మార్కెట్‌లకు నిధుల ప్రవాహం తగ్గుతుంది.దేశీయంగా ఎఫ్ఐఐల అమ్మకా లు కొనసాగుతున్నాయి. వరుసగా 10 రోజైన గురువారం కూడా రూ.7050 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించడం ప్రతికూల ప్రభావం చూపింది. గడిచిన 10 ట్రేడింగ్ సెషన్లలో రూ.57వేల కోట్ల షేర్లను ఎఫ్ఐఐలు విక్రయించడం గమనార్హం.

**6 వేల పాయింట్లు.. రూ.33 లక్షల కోట్లు!**

అమెరికా టారిఫ్‌లు, ఏఐ భయాలు.. ఇవీ మార్చి నెలకు ముందు వరకు మన స్టాక్ మార్కెట్‌ను వెంటాడిన అంశాలు. కానీ, మార్చి నెలలో ప్రవేశిస్తూనే దేశీయ స్టాక్ మార్కెట్ వార్ జోన్‌లోకి వెళ్లిపోయింది. గడిచిన 9 ట్రేడింగ్ సెషన్లలో రెండు ట్రేడింగ్ సెషన్లు మినహా మిగతా అన్ని రోజులూ నష్టాలు మూటగట్టుకుంది. దీంతో బెంచ్ మార్క్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు 8 శాతం మేర పతనమయ్యాయి. మదుపర్లకు రూ.33 లక్షల కోట్ల నష్టాన్ని మిగిల్చాయి. ఫిబ్రవరి 27న సెన్సెక్స్ 81,287.19 పాయింట్ల వద్ద నష్టాల్లో ముగిసింది. ఆ మరుసటి రోజే ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం మొదలైంది. మార్చి నెలలో నేటి వరకు 13 రోజులకు గానూ 9 రోజులు స్టాక్ మార్కెట్ (శని,ఆదివారాలు, హోలీ మినహా) తెరుచుకుంది. మార్చి 13న 74,563.92 వద్ద ముగిసింది. అంటే ఫిబ్రవరి 27 తర్వాత సెన్సెక్స్ 6,700 పాయింట్ల మేర పతనం అయ్యింది.నిఫ్టీ కూడా ఫిబ్రవరి 27న 25,178.65 పాయింట్ల వద్ద ముగియగా.. నేడు (మార్చి 13న) 23,151 పాయింట్ల వద్ద ముగిసింది. అంటే దాదాపు 2 వేల పాయింట్లకు పైగా క్షీణించింది.మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ సైతం భారీగా పడిపోయింది. ఫిబ్రవరి 27న రూ.463 లక్షల కోట్లుగా ఉండగా.. నేడు రూ.429 లక్షల కోట్లకు దిగి వచ్చింది. దాదాపు రూ.33 లక్షల కోట్లకు మదుపర్ల సంపద ఆవిరైంది.దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో విదేశీ మదుపర్ల విక్రయాలూ కొనసాగుతున్నాయి. ఈ ఒక్క నెలలోనే దాదాపు రూ.52 లక్షల కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను ఎఫ్ఐఐలు విక్రయించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో పాటు క్రూడాయిల్ బ్యారెల్ ధర 100 డాలర్ల మార్కు దాటడం స్టాక్ మార్కెట్ పతనానికి ప్రధాన కారణం

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,48,200 | ₹ 1,61,680 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,90,000

## చమురు మంటల్లో రష్యాపై సిరుల వాన..

### రోజుకు రూ.3,700 కోట్ల ఆదాయం

మాస్కో:పశ్చిమాసియాలో యుద్ధం ముగింపు ఛాయలు కనిపించడం లేదు. ఈ సంక్షోభంతో చమురు ధరలు భగ్గుమంటున్నాయి దీంతో రష్యా చమురుపై విధించిన మరికొన్ని ఆంక్షలను అమెరికా ప్రభుత్వం సడలించింది. ఇప్పటికే నౌకల్లో లోడ్ అయిన చమురు కొనుగోలుకు అనుమతులు ఇస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఓ ప్రకటన చేసింది. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో స్థిరత్వాన్ని తీసుకువచ్చేందుకే ఈ తాత్కాలిక చర్యలు అని ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ వెల్లడించారు. "ఇప్పటికే రవాణాకు సిద్ధమైన చమురుకు మాత్రమే ఈ నిర్ణయం వర్తిస్తుంది. ఇది రష్యా (ఖీబీబబతిజీ)కు ఎలాంటి ఆర్థిక ప్రయోజనాన్ని ఇవ్వదు" అని వెల్లడించారు. ఇటీవల భారతీయ శుద్ధి కర్మాగారాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడానికి తాత్కాలికంగా 30 రోజులు మినహాయింపు ఇస్తున్నట్లు బెసెంట్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై రష్యా నుంచి స్పందన వచ్చింది. ప్రపంచ ఇంధన మార్కెట్లకు రష్యా చమురు ఎంత కీలకమో తాజా ప్రకటన వెల్లడి చేస్తోందని పేర్కొంది. తమ చమురు లేకుండా అంతర్జాతీయ మార్కెట్లు స్థిరంగా ఉండలేవని వ్యాఖ్యానించింది.



# అమెరికాను భయపెడుతున్న ఇరాన్ 'దోమల దండు'..!





**వాషింగ్టన్:**ప్రపంచ చమురు జీవనాడి హర్మూజ్‌పై ఉక్కు పిడికిలి బిగించేందుకు ఇరాన్ ఓ ప్రత్యేక దళాన్నే సిద్ధం చేసింది. అయితే ఇది పూర్తిస్థాయిలో రంగంలోకి దిగలేదు. అమెరికా మూడు భారీ యుద్ధ విమాన వాహక నౌకలను గల్ఫ్ ప్రాంతానికి పంపినా.. అవి హర్మూజ్ వైపు వచ్చేందుకు తటపటాయిస్తున్నాయి. మరోవైపు ఐఆర్‌జీసీ మాత్రం అమెరికా నౌకలు ఎప్పుడు వచ్చినా అభ్యంతరం లేదని.. వాటికి తగిన సమాధానం చెబుతామని ప్రకటించింది. అగ్రదేశాల రక్షణ వ్యవస్థలను అలసిపోయేలా చేసే ఆయుధాలతో ఇరాన్ దళాలు హర్మూజ్ వద్ద సిద్ధంగా ఉన్నాయి. ఇరాన్ చిన్నపాటి ఫాస్ట్ బోట్స్ ఇప్పటి వరకు యుద్ధంలో ఎటువంటి ప్రభావం చూపలేదు. కానీ సముద్ర దిగ్బంధ వ్యూహంలో "మస్కిటో ఫ్లీట్"గా పిలిచే ఈ చిన్న పడవలదే కీలకపాత్ర. దాదాపు 10 టన్నుల బరువుతో ఉండే ఈ రకం ఫాస్ట్ బోట్స్ 1,500 వరకు ఇరాన్ ఐఆర్‌జీసీ నేవీ వద్ద ఉన్నాయి. టెహ్రాన్‌కు చెందిన భారీ నౌకలను ధ్వంసం చేశామని సంబరపడుతున్న అమెరికాకు ఇవి షాకిస్తున్నాయి. రెండో ప్రపంచ యుద్ధంలో పీటీ బోట్ల వ్యూహాలను నేటి ఆధునిక యాంటీ షిప్ మిసైల్ బోట్లతో సమ్మిళితం చేసి ఇరాన్ వాడుతోంది. ఈ తరహా బోట్లు 300 వరకు ఉన్నట్లు అంచనా. నాసర్, కౌసర్ వంటి షార్ట్ రేంజి సూపర్ సోనిక్ గైడెడ్ క్షిపణులను వీటిపై అమర్చి వాడుతున్నారు. వీటితోపాటు తీర ప్రాంతాల నుంచి ప్రయోగించేలా ఘదెర్, జాఫర్, అబు మహదీ వంటి క్షిపణులున్నాయి. ఇక ఈ చిన్న బోట్లు స్మార్ట్‌మైన్స్‌ను అమర్చడం వంటివి కూడా చేయగలవు.ఈ పడవలు కేవలం 50 లేదా 110 నాట్స్ వేగంతో ప్రయాణించగలవు. సముద్రంపై చురుగ్గా కదలగలవు. గుంపుగా ఈ చిన్నబోట్లు దాడి చేస్తే.. భారీ యుద్ధ నౌకల టార్గెటింగ్ వ్యవస్థలు కూడా సమస్యలను ఎదుర్కొంటాయి. కొన్నాళ్ల క్రితం హర్మూజ్‌లో జరిగిన యుద్ధ విన్యాసాల్లో 40 బోట్లు పాల్గొన్నాయి. వాస్తవానికి ఈ జలసంధి ఇరుగ్గా ఉండటంతో పెద్ద నౌకలు వేగంగా అవసరమైన దిక్కుకు మళ్లే అవకాశాలు లేవు. దీంతో అవి చిన్న బోట్ల దాడులకు ఎరగా మారే అవకాశాలు ఎక్కువ. టెహ్రాన్ తయారు చేసిన చిన్నపాటి డ్రోన్ బోట్‌లు చమురు ట్యాంకర్లకు ప్రాణాంతకంగా మారాయి. ఇప్పటికే ట్యాంకర్లపై దాడుల్లో ఇవి పాల్గొన్నాయి. గతంలో ఉక్రెయిన్ కూడా ఇలాంటి బోట్లనే రష్యాపై వాడింది. ఇటీవల జనవరిలో ఐఆర్‌జీసీ విడుదల చేసిన వీడియోలో ఓ భూగర్భ స్థావరంలో పెద్ద సంఖ్యలో ఈ డ్రోన్‌బోట్లు ఉన్నాయి. ఇరాన్ దళాలకు అనుబంధంగా పనిచేసే హూతీలు ఇప్పటికే డ్రోన్ బోట్లను వినియోగించారు. చిన్న ఫైబర్‌గ్లాస్ లేదా చెక్క పడవలను మానవ రహిత బోట్లుగా తీర్చిదిద్దారు. ఇప్పటికే కువైట్ వద్ద సోనాంగ్ నమిబే, ఇరాక్ సమీపంలో సేఫ్‌సీ విష్ణు, జెఫిరోస్ ట్యాంకర్లపై వీటిని ప్రయోగించినట్టు అనుమానిస్తున్నారు.

అజదార్‌ను అదుపు చేయడం కష్టం..

ఇక ఇరాన్ దళాల వద్ద అజదార్ అనే మానవ రహిత అండర్ వాటర్ వెహికల్ కూడా ఉంది. ఇది నాలుగు రోజులపాటు 600 కిలోమీటర్ల రేంజిలో గస్తీ కాయగలదు. అవసరమైతే నౌకలపై దాడి కూడా చేస్తుంది. దీనిని సైలెంట్ కిల్లర్‌గా వ్యవహరిస్తారు. అమెరికా నౌకలే లక్ష్యంగా అభివృద్ధి చేశారు. వీటిని గగనతలం నుంచి గుర్తించి ధ్వంసం చేయడం చాలా కష్టం. ఇరాన్ పన్నుతున్న ఈ వ్యూహాలు అమెరికా-ఇజ్రాయెల్ ఖర్చును గణనీయంగా పెంచుతాయి. హర్మూజ్‌పై అవి పట్టు సాధించడం అంత సులువేం కాదన్న స్థితిని తీసుకొస్తాయి.

## రాజ్యాంగమే ప్రజల అసలైన గొంతుక

ఇంధన భద్రతలో ఎందుకు రాజీ పడ్డారు? అని కేంద్రాన్ని ప్రశ్నించాను. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రిగా హర్దీప్‌సింగ్ పూరీని నియమించారు. ఇది అమెరికాతో పడిన మొదటి రాజీ. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో పూరీ పేరు ఉంది. ఆయన ఎప్‌స్టీన్‌కు ఫ్రెండ్" అని రాహుల్ పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ఎప్‌స్టీన్, గౌతమ్ అదానీతో రాజీ పడడం వల్ల అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భారత్ ప్రయోజనం పొందలేకపోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. నరేంద్ర మోదీ ఇకపై భారతదేశ ప్రధాని కాదని, ఆయన అమెరికా కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. తాను నిన్న (గురువారం) పార్లమెంట్‌లో నిజాలు మాట్లాడుతుంటే, మోదీ లోక్‌సభ నుంచి వెళ్లిపోయారని అన్నారు."కాంగ్రెస్ పేదల పార్టీగా మారింది. అదే సమయంలో బీజేపీ మాత్రం ధనవంతుల పార్టీగా మారింది. బీజేపీ, మోదీ దేశ సంపద మొత్తాన్ని అదానీ చేతుల్లో పెట్టేశారు. అమెరికాలో దాఖలైన న్యాయపరమైన కేసు అదానీపై కాదు, బీజేపీపైనే. దీన్ని ఆసరాగా చేసుకుని వాణిజ్య ఒప్పందంపై అమెరికా భారత్‌పై ఒత్తిడి తెచ్చింది. ఫలితంగా మోదీ ఇప్పుడు అమెరికా కనుసన్నల్లో పనిచేస్తున్నారు. పార్లమెంటు నుంచి హఠాత్తుగా బయటకు వెళ్లి, మరెవరినీ సంప్రదించకుండానే కేవలం ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడి మోదీ ట్రేడ్ డీల్‌ను ఖరారు చేశారు" అని రాహుల్ విమర్శించారు.

**'సిద్ధాంతాల విషయంలో కాన్షీరామ్ ఎప్పుడూ రాజీపడలేదు'**

కాన్షీరామ్ తన సిద్ధాంతాల విషయంలో ఎప్పుడూ రాజీపడలేదని రాహుల్ గాంధీ తెలిపారు. ఒకవేళ ఆయన అలా చేసి ఉంటే ఆయన చిత్రపటం ఇక్కడ ఎప్పటికీ ప్రదర్శితమయ్యేది కాదన్నారు. ఈ రోజు కాన్షీరామ్ స్మరించుకుందామని అన్నారు. ఆయన పోరాటం, దార్శనికత దేశ రాజకీయాలపై ప్రభావం చూపిందన్నారు. మన ఆలోచనల కోసం పోరాడకపోతే ఏమీ సాధించలేమన్నారు."ఈ ప్రసంగం చేసే ముందు బాబాసాహెబ్ అంబేడ్కర్ విద్య గురించి ఎలా మాట్లాడేవారో నేను ఆలోచిస్తున్నాను. ఆయన సంస్థాగత ప్రాముఖ్యత గురించి మాట్లాడారు. కాన్షీరామ్ రాత్రిపూట ఉత్తర్‌ప్రదేశ్ అంతటా తిరిగేవారు. ఆయన తనతో ఒక పెన్ను తీసుకెళ్లేవారు. సమాజంలోని 15 శాతం మంది కచ్చితంగా ప్రయోజనం పొందుతున్నప్పటికీ 85 శాతం మంది కూడా ప్రయోజనం పొందే విధంగా పెన్ను ఉండాలని అభిప్రాయపడేవారు. కానీ ఇప్పుడు ఏమి జరిగింది? బీజేపీ ఒక కొత్త వ్యవస్థను ప్రవేశపెట్టిందని అన్నారు.



# చమురు మంటలు

**న్యూఢిల్లీ:**పశ్చిమాసియాలో రేగిన యుద్ధ మంటతో ముడిచమురు ధర పెరిగిపోతోంది. ఇప్పటికే బ్రెంట్ ముడిచమురు బ్యారెల్ ధర 89 డాలర్లు మించింది. ఉద్రిక్తతలు కొనసాగితే గల్ఫ్ నుంచి కొద్ది వారాల్లో ఎగుమతులు ఆగిపోతాయని, అపుడు బ్యారెల్ చమురు ధర 150 డాలర్లకు చేరొచ్చని ఖతార్ ఇంధన మంత్రి సాద్ అల్ కబీ హెచ్చరించారు. వారాల తరబడి యుద్ధం కొనసాగి, గల్ఫ్‌లో ఇంధన ఉత్పత్తి ఆగి - హర్మూజ్ నుంచి ఎగుమతులు స్తంభిస్తే ఈ పరిస్థితి ఏర్పడొచ్చన్నారు. ఇదే జరిగితే అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి మందగమనం పాలవ్వడమే కాదు.. పలు దేశాలకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. పలు వస్తువుల తయారీకి ఉపయోగించే పెట్రో రసాయనాలనూ గల్ఫ్ నుంచే వివిధ దేశాలు దిగుమతి చేసుకుంటుండటం గమనార్హం.ద్రవీకృత సహజ వాయువు(ఎల్ఎన్‌జీ) ఉత్పత్తిలో రెండో అతిపెద్దదేశం ఖతార్. ఇరాన్ డ్రోన్ దాడిలో దెబ్బతినడం వల్ల తమ అతిపెద్ద ఎల్ఎన్‌జీ ప్లాంటు రాస్ లఫన్‌ను ఈ దేశం మూసేసింది. భద్రతా కారణాలే ఇందుకు కారణమని ఈ కంపెనీ సీఈఓ కూడా అయిన కబీ పేర్కొన్నారు. దాడులు జరిగిన 24 గంటల్లోగా 9000 మంది సిబ్బందిని బయటకు పంపినట్లు తెలిపారు. దాడులు పూర్తిగా ఆగాకే ఉత్పత్తిని తిరిగి మొదలుపెడతామని స్పష్టం చేశారు. ప్లాంటు మరమ్మతులకు ఎంత సమయం పడుతుందో తెలియదని మంత్రి అన్నారు. ఉద్రిక్తతలు కొనసాగితే సహజవాయువు (గ్యాస్) ధర ఒక్కో ఎమ్ఎమ్‌బీటీయూకు 40 డాలర్లకు పెరగొచ్చని కబీ అంచనా వేస్తున్నారు.అంతర్జాతీయ మార్కెట్లో శుక్రవారం బ్రెంట్ చమురు ఫ్యూచర్స్ ధర 89.23 డాలర్లకు చేరింది. గత రెండేళ్లలో ఈ స్థాయి కనిపించలేదు. చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుండడం ఇందుకు నేపథ్యం. రష్యా చమురును కొనుగోలు చేయడానికి 30 రోజుల మినహాయింపు ఇచ్చినందున, ధరలు కాస్త శాంతించే అవకాశం లేకపోలేదు. అమెరికా-బ్రిటన్ ఆర్థిక సేవల సంస్థ ఫిచ్ మాత్రం 2026లో బ్యారెల్ చమురు సగటు ధర 63 డాలర్లుగానే ఉంటుందని అంచనా వేయడం గమనార్హం. బ్యారెల్ బ్రెంట్ చమురు ధర ఒక డాలరు పెరిగినా, ఏడాదికి భారత్‌పై రూ.13,000 కోట్ల అదనపు భారం పడొచ్చని అంచనా. ఆ లెక్కన 150 డాలర్లకు ధర చేరితే, యుద్ధానికి ముందు ధర (70 డాలర్ల) కంటే అదనంగా 80 డాలర్లు పెరిగినట్లవుతుంది. అంటే ఏటా రూ.10.4 లక్షల కోట్ల భారం అన్నమాట.

ఐరోపా దేశాలకు బదులుగా ఆసియాకు రిలయన్స్ నౌకలు రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి ఇంధనం నింపుకున్న రెండు ట్యాంకర్లు ఐరోపా దేశాలకు వెళ్లాల్సి ఉండగా, యూ టర్న్ తీసుకుని ఆసియాకే వెళుతున్నట్లు వార్తా సంస్థ బ్లూమ్‌బర్గ్ తెలిపింది. ఫిబ్రవరి 28న లక్ష మెట్రిక్ టన్నుల(7.45 లక్షల



బారెళ్లు) డీజిల్‌ను జామ్‌నగర్ రిఫైనరీ నుంచి తీసుకెళ్లిన ఒక నౌక ఇపుడు సింగపూర్‌కు దగ్గర్లో ఉంది. 75,000 టన్నుల విమాన ఇంధనం(ఏటీఎఫ్)తో వెస్ట్-ఆఫ్- సూయిజ్ దేశాలకు బయలు దేరిన నౌక ఇపుడు ఆగ్నేయాసియా వైపుగా వెళుతోందని కెప్లర్ షిప్‌ట్రాకింగ్ సమాచారం తెలుపుతోంది. దీనిపై రిలయన్స్ స్పందించలేదు.సీఎన్‌జీ, పైపుల ద్వారా ఇళ్లకు సరఫరా చేసే వంట గ్యాస్(పీఎన్‌జీ) ధరల్లో మార్పు చేయలేదని అదానీ టోటల్ గ్యాస్ తెలిపింది. కొన్ని పెద్ద పారిశ్రామిక వినియోగదార్లపై సరఫరా పరిమితులు పెట్టినట్లు కంపెనీ అధికారులు స్పష్టం చేశారు. కంపెనీ గ్యాస్ పరిమాణంలో 70% వరకు దేశీయంగానే సమకూర్చుకుంటుండడం ఇందుకు నేపథ్యమని తెలిపారు. 30% వరకు దిగుమతి చేసుకునే ఎల్ఎన్‌జీని పారిశ్రామిక వినియోగదార్లకు పంపుతారు. అంతక్రితం కుదుర్చుకున్న కాంట్రాక్టు పరిమాణంలో 40 శాతానికి పాత ధరలే వర్తిస్తాయని, ఆ పైన మాత్రం స్పాట్ ధరలు(మూడింతలు) అమలు చేస్తామని అధికారులు చెబుతున్నారు.అత్యవసర పరిస్థితుల్లో వాడే ఎస్మా (నిత్యావసర వస్తువుల చట్టం 1955) అధికారాలను కేంద్రం వినియోగించింది. వంటగ్యాస్ (ఎల్‌పీజీ) ఉత్పత్తి పెంచాలని చమురు రిఫైనరీ కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. తద్వారా దేశీయంగా వంట గ్యాస్ కొరత రాకుండా చూడనుంది. 2024-25లో మనదేశం 31.3 మి. టన్నుల ఎల్‌పీజీని వినియోగించింది. ఇందులో 12.8 మి. టన్నులే దేశీయంగా ఉత్పత్తి కాగా, మిగతా దిగుమతి చేసుకున్నాం. హర్మూజ్ జలసంధి ద్వారా రవాణా జరిపే సౌదీ అరేబియా వంటి దేశాల నుంచే 85-90% దిగుమతులు వస్తున్నాయి. మిగులు రిఫైనింగ్ సామర్థ్యం ఉండడం వల్ల ప్రభుత్వ, ప్రైవేటు రిఫైనరీలన్నీ గరిష్ఠ ఉత్పత్తి చేపట్టాలంటూ చమురు మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది.

# ఒకే ఏడాదిలో 50 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజ ఉత్పత్తి

- మొట్టమొదటి మైనింగ్ కంపెనీగా భారతదేశంలో ఎన్ఎండీసీ రికార్డు
- దశాబ్దాల విస్తరణలో అతి వేగవంతమైన దశ
- 2015 నుంచి ఉత్పత్తి దాదాపు మూడింట రెండు వంతులు పెరిగింది
- ఉక్కు తయారీకి దేశీయ సరఫరా భద్రతకు కీలకం
- ఎన్ఎండీసీ 2.0లో బలమైన పురోగతి: చైర్మన్ అమితవ ముఖర్జీ



**హైదరాబాద్, మార్చి 13 (జనం సాక్షి):** భారతదేశంలో అతిపెద్ద ఇనుప ఖనిజ ఉత్పత్తిదారు, ఉక్కు మంత్రిత్వ శాఖ పరిధిలోని నవరత్న సీపీఎస్ఈ ఎన్ఎండీసీ లిమిటెడ్ ఒకే ఆర్థిక సంవత్సరంలో 50 మిలియన్ టన్నుల (ఎమ్ టీ) ఇనుప ఖనిజాన్ని ఉత్పత్తి చేసి చరిత్ర సృష్టించింది. 2025--26 ఆర్థిక సంవత్సరం ముగింపుకు కొన్ని రోజుల ముందు సాధించిన ఈ మైలురాయి దేశంలో మొట్టమొదటి మైనింగ్ కంపెనీగా ఎన్ఎండీసీని నిలిపింది.

1958లో భారతదేశ ఇనుప ఖనిజ వనరుల అభివృద్ధికి స్థాపించబడిన ఎన్ఎండీసీ 1978లో దాదాపు 10 ఎమ్ టీలను ఉత్పత్తి చేసింది. దశాబ్దాలుగా క్రమంగా విస్తరించిన ఉత్పత్తి 2025-26లో చారిత్రాత్మక 50 ఎమ్ టీకి చేరుకుంది. ఇది భారతదేశ ఇనుప ఖనిజ సరఫరా గొలుసుకు వెన్నెముకగా కంపెనీ స్థిరమైన పరివర్తనను ప్రతిబింబిస్తోంది. ఇటీవలి సంవత్సరాల్లో వృద్ధి వేగం గణనీయంగా పెరిగింది. 2015 నుంచి ఉత్పత్తి దాదాపు మూడింట రెండు వంతులు పెరిగి 30 ఎమ్ టీ నుంచి 50 ఎమ్ టీకి చేరుకుంది. గత నాలుగు సంవత్సరాల్లో మాత్రమే ప్రస్తుత సామర్థ్యంలో దాదాపు ఐదవ వంతు జోడించబడింది. ఇది కంపెనీ చరిత్రలో అత్యంత వేగవంతమైన విస్తరణ దశగా నిలిచింది.

2030 నాటికి ఉక్కు తయారీ సామర్థ్యాన్ని 300 మిలియన్ టన్నులకు విస్తరించాలనే జాతీయ లక్ష్యం వైపు దేశం ముందుకు సాగుతున్న నేపథ్యంలో స్థిరమైన, నమ్మదగిన దేశీయ ఇనుప ఖనిజ సరఫరా వ్యూహాత్మక ప్రాధాన్యతగా మారింది. ఈ విజయంపై వ్యాఖ్యానిస్తూ ఎన్ఎండీసీ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ అమితవ ముఖర్జీ మాట్లాడుతూ "50 మిలియన్ టన్నులకు చేరుకోవడం ఒక ముఖ్యమైన విజయం. ఎన్ఎండీసీ 2.0 కింద మేము సాధించిన బలమైన పురోగతిని ఇది ప్రతిబింబిస్తుంది. ఒకప్పుడు దశాబ్దాలు పట్టిన దానిని మేము కొన్ని సంవత్సరాల్లో పదునైన అమలు, బాధ్యతాయుతమైన మైనింగ్ పద్ధతులు, జాతీయ ప్రాధాన్యతలకు నిబద్ధతతో వేగవంతం చేశాము. భారతదేశంలో అతిపెద్ద ఇనుప ఖనిజ ఉత్పత్తిదారుగా ఉండటం భారీ బాధ్యతతో వస్తుంది. ఈ మైలురాయి మా కార్యకలాపాల బలాన్ని మాత్రమే కాకుండా దేశ ఉక్కు పర్యావరణ వ్యవస్థకు మద్దతు ఇవ్వడానికి మాపై ఉంచిన నమ్మకాన్ని కూడా ప్రతిబింబిస్తుంది" అన్నారు.

ఛత్తీస్‌గఢ్, కర్ణాటక ఖనిజ సంపన్న ప్రాంతాల్లో అత్యంత యాంత్రిక కార్యకలాపాలతో ఎన్ఎండీసీ దేశ ఇనుప ఖనిజ భద్రతను నిర్ధారిస్తోంది. కంపెనీ తదుపరి దశ వృద్ధిని ఎదురుచూస్తూ కార్యాచరణ శ్రేష్ఠత, సాంకేతిక పురోగతి, బాధ్యతాయుత మైనింగ్ పద్ధతులపై దృష్టి సారిస్తోంది.

# కరీంనగర్ పీటీసీలో 99 నూతన కానిస్టేబుళ్ల దీక్షాంత పరేడ్






- శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లోకి సిద్ధం : సీపీ గౌష్ ఆలం
- 100 శాతం ఉత్తీర్ణత సాధించిన శిక్షణార్థులు
- 27 మహిళా కానిస్టేబుళ్లు కూడా ఉత్తీర్ణులు

**కరీంనగర్ బ్యూరో, మార్చి 13 ( జనంసాక్షి) :** కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో 99 మంది నూతన కానిస్టేబుళ్ల దీక్షాంత పరేడ్ శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. గత ఏడాది జూన్ 16న ప్రారంభమైన బేసిక్ ఇండక్షన్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ కానిస్టేబుళ్లు ఇక నుంచి విధుల్లోకి చేరనున్నారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం గౌరవ వందనం స్వీకరించారు. పీటీసీ ప్రిన్సిపాల్ ఎం. పిచ్చయ్య సీపీకి పూలమొక్కను అందజేసి సాదరంగా ఆహ్వానించారు. వివిధ కారణాల వల్ల గతంలో శిక్షణకు హాజరు కాలేకపోయిన పలు బ్యాచ్‌ల అభ్యర్థులు కూడా ఈ తొమ్మిది నెలల శిక్షణలో పాల్గొన్నారు. సివిల్‌లో 25 మంది, ఆర్మ్డ్ రిజర్వ్‌లో 13 మంది, తెలంగాణ స్పెషల్ పోలీస్‌లో 55 మంది, ఎస్‌పీఎఫ్, పీటీఓ, ఐటీ అండ్ సీలో 6 మంది మొత్తం 99 మంది 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 27 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు.

శిక్షణలో శారీరక దృఢత్వంతో పాటు నూతన చట్టాలు, మేజర్-మైనర్ యాక్ట్స్, ఫోరెన్సిక్ సైన్స్, వెపన్ హ్యాండ్లింగ్, ఫైరింగ్, డ్రిల్, యోగా, కరాటే, మానసిక ఒత్తిడి నిర్వహణ, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై సమగ్ర శిక్షణ అందించారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి సీపీ చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. బెస్ట్ ఆల్ రౌండర్‌గా జి. రోహన్ (వరంగల్), బెస్ట్ ఇండోర్ టాపర్‌గా టి. అఖిల్ (సివిల్, నారాయణపేట), బెస్ట్ అవుట్‌డోర్‌గా బి. సురేష్ (ఎఆర్, మహబూబాబాద్), బెస్ట్ ఫైరర్‌గా బి. మహేష్ (కొమురం భీం ఆసిఫాబాద్) ఎంపికయ్యారు.

సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశంలోనే అగ్రగామిగా ఉందని, సైబర్ నేరాలు పెరుగుతున్న తరుణంలో నూతన కానిస్టేబుళ్లు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజలకు జవాబుదారీగా ఉంటూ నేరాలను అరికట్టడంలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పీటీసీ ప్రిన్సిపాల్ ఎం. పిచ్చయ్య మాట్లాడుతూ 2010లో ప్రారంభమైన ఈ శిక్షణ కళాశాల ద్వారా వేలాది మందికి శిక్షణ ఇచ్చామని, పీటీసీ అభివృద్ధికి సహకరిస్తున్న సీపీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పీటీసీ వైస్ ప్రిన్సిపాల్ మహేష్, డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి

- 34 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- 7317 మంది విద్యార్థులు హాజరు
- 144 సెక్షన్, సెల్‌ఫోన్లు నిషేధం
- కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆల్ ది బెస్ట్



**రాజన్న సిరిసిల్ల, మార్చి 13 (జనం సాక్షి):** ఈ నెల 14వ తేదీ శనివారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని 34 పరీక్షా కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులు పరీక్షా సమయానికి అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. జిల్లాలో మొత్తం 7317 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో బాలురు 3511 మంది, బాలికలు 3806 మంది ఉన్నారు. పరీక్షా కేంద్రాల్లో డెస్కులు, తాగునీరు, టాయిలెట్లు, ట్యూబ్ లైట్లు సహా అన్ని సౌకర్యాలు కల్పించారు. పరీక్షా సమయం తర్వాత ఐదు నిమిషాల వరకు మాత్రమే విద్యార్థులను అనుమతిస్తారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సమీపంలోని జిరాక్స్ దుకాణాలు మూసివేయాలి. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని అధికారులు హెచ్చరించారు.

పరీక్షల పర్యవేక్షణకు చీఫ్ సూపరింటెండెంట్లు 34 మంది, డిపార్ట్‌మెంటల్ అధికారులు 34 మంది, సిట్టింగ్ స్క్వాడ్ 34 మంది, ఫ్లయింగ్ స్క్వాడ్ రెండు టీములు, అదనపు డిపార్ట్‌మెంటల్ అధికారులు, స్టేట్ లెవల్ అబ్జర్వర్లు, కస్టోడియన్ అధికారులను నియమించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని, విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, పరీక్షా సమయానికంటే ముందే చేరుకోవాలని తెలిపారు.

# కమిషన్ల కోసమే టెండర్ల జాప్యమా?

- రూ.50 కోట్ల అభివృద్ధి పనులు ఆమోదం..
- ఇంకా టెండర్లు ఓపెన్ ఎందుకు లేవు?



**కరీంనగర్ టౌన్, మార్చి 13 (జనం సాక్షి):** ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక పేరుతో 99 రోజుల కార్యాచరణ చేపట్టిన ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం మొత్తం క్షేత్రస్థాయిలో సమస్యలు పరిశీలించి మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రకటించింది. అయితే కరీంనగర్ నగరంలో రూ.50 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం వచ్చినా టెండర్లు ఇంకా ఓపెన్ కాకపోవడం సంచలనంగా మారింది.

అక్టోబర్ 25, 2025న జీవో 715 విడుదల చేసి యూఐడీఎఫ్ (రూ.40 కోట్లు) రాష్ట్ర ఫండ్ (రూ.10 కోట్లు) కింద 87 అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతి మంజూరు చేశారు. ఎన్నికల కోడ్ లేని సమయంలోనే జనవరి 17, 2026న టెండర్లు పిలిచి కట్టబెట్టినా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. బీజేపీ ప్రభుత్వం బేరసారాల ప్రభుత్వమా? కేంద్ర మంత్రి బండి సంజయ్ 10% కమిషన్ల కోసం బేరసారాలు చేస్తూ టెండర్లు ఓపెన్ చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేనిఫెస్టోలో నగరపాలక సంస్థ అభివృద్ధికి ఎన్‌హెచ్‌బీ ద్వారా రూ.40 కోట్లు, రాష్ట్ర వాటాగా రూ.10 కోట్లు కేటాయించామని ప్రకటించారు. అయినా ఎన్నికల కోడ్ రాకముందే టెండర్లు పిలిచినా పనులు ప్రారంభం కాకపోవడం ప్రజాపాలన పేరుతో మోసమని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఫండ్ ప్రత్యేక స్కీమ్ ఫండ్ కాబట్టి కమిషన్ల కోసమే టెండర్లు ఆలస్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది. నగరంలో అభివృద్ధి పనులకు పెద్ద గండి ఉందని, ప్రతి విషయాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు కమిషన్ల కోసం నగరపాలక సంస్థ అభివృద్ధిని అడ్డుకుంటున్నా యని విమర్శలు వినిపిస్తున్నాయి.

నూతనంగా ఏర్పడిన కరీంనగర్ నగరపాలక సంస్థకు 30 రోజులు గడిచినా ప్రజల కోసం 30 నిమిషాల సమయం కేటాయించకపోవడం సిగ్గుచేటని వాపోతున్నారు. ఇప్పటికైనా కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెంటనే అభివృద్ధి అనుమతులు (ఫాలా) అందజేయాలని, నగర మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నారు. కొత్త కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, అధికారులు వెంటనే పనులపై శ్రద్ధ చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పూర్తిస్థాయిలో పన్ను బకాయల వసూలు చేయాలి

**మున్సిపల్ కమిషనర్ అరుణ శ్రీ**

**గోదావరిఖని, జనంసాక్షి :** ఆర్థిక సంవత్సరం ముగింపు దృష్ట్యా పూర్తి స్థాయిలో పన్ను బకాయల వసూళ్లు చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ ఆదేశాలు జారీ చేశారు . పన్ను వసూళ్ల పురోగతిపై శుక్రవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం లో వార్డు అధికారులు, రెవెన్యూ విభాగం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారీ బకాయదారుల జాబితా లో ఉన్న వారికి రెడ్ నోటీస్‌లు జారీ చేసి చట్ట ప్రకారం పన్ను వసూలుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గడువు తేదీ దాటినప్పటికీ పన్ను చెల్లించని వారికి మున్సిపల్ సేవలు నిలిపివేయాలని అన్నారు. డివిజన్ లలో అన్ అస్సెస్సడ్, అండర్ అస్సెస్స్ డ్ ఉండవద్దని అన్నారు, ప్రతి నిర్మాణం పన్ను పరిధిలోకి రావాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్ ఓ ఆంజనేయులు, ఆర్ఐ. ఖాజా, వార్డు అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



# స్క్రాప్ పేరుతో ఫర్నిచర్ అమ్మకం?

- ఓ కాంట్రాక్టర్ పేరుతో కొనుగోలు చేశాడని ప్రచారం
- నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఘటన

**ఆర్మూర్,మార్చి 13 (జనంసాక్షి):** లక్షల విలువ చేసే ఫర్నిచర్ ను స్క్రాప్ పేరుతో నీటిపారుదల శాఖ కార్యాలయంలో విక్రయం చేశారనే ఘటన ఆర్మూర్ పట్టణంలో దుమారం రేపుతుంది.నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. నీటిపారుదల శాఖ కార్యాలయంలో గత కొన్ని సంవత్సరాలుగా వాడకంలో ఉన్న అతి విలువైన టేకు కలపతో చేసిన ఫర్నిచర్ ను లోపాయి కారి ఒప్పందంతో విక్రయించారని తెలిసింది. ప్రభుత్వానికి సంబంధించిన ఎలాంటి ఆస్తులను అమ్మకం జరపాలంటే బహిరంగంగా నోటీసులు అంటించడం,మీడియా ముఖంగా తెలియజేసి బహిరంగ వేలం పాటను నిర్వహించి అమ్మకం చేయాల్సి ఉంటుంది.ఇవేమీ లేకుండానే అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి ఓ కాంట్రాక్టర్ పేరును పెట్టి కొనుగోలు చేశాడని ప్రచారం జరుగుతుంది.ఫర్నిచర్ టేకు కలప విలువ పెద్ద మొత్తంలో ఉండగా,స్క్రాప్ అనే పేరుతో వాటి విలువ మొత్తాన్ని తక్కువగా చూపించి అమ్మారనే ఆరోపణలు వస్తున్నాయి.ఈ విషయమై ఆ శాఖ ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి రాకుండా చేసి,క్రింది స్థాయి అధికారులు ఒకరికొకరు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు.అధికారుల మధ్య సమన్వయ లోపంతో కార్యాలయంలో ఏం జరుగుతుందో ఎవరికి అంతు పట్టడం లేదు.ఓ అధికారి లోపాయి కారి ఒప్పందంతో అదే కార్యాలయంలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగి కొనుగోలు చేశాడని సమాచారం.ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి విక్రయంపై నిజా నిజాలు నిగ్గు తేల్చాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఫర్నిచర్ విక్రయంపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరపాలంటూ ప్రజలు కోరుతున్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యం

- త్వరలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి
- ప్రజల అవసరాలకు అనుగుణంగా చర్యలు
- మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

**అంబర్పేట్, మార్చి 13 (జనం సాక్షి):** అంబర్పేట్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను ప్రణాళికాబద్ధంగా త్వరలో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్పష్టం చేశారు. నిన్న కాచిగూడలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం చేయడం ద్వారా వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభమయ్యాయని, మిగిలినవి త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు. ప్రజల నుండి వచ్చిన సూచనలు, ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా కాలనీలలో రహదారుల మరమ్మతులు, నీటి నిల్వ సమస్యలు, డ్రైనేజీ లైన్ల మెరుగుదలపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. స్థానికులు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరుతున్న నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను సమయానికి పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గాన్ని మౌలిక వసతుల పరంగా మరింత అభివృద్ధి చేసే దిశగా కృషి కొనసాగుతుందని ఆయన హామీ ఇచ్చారు.

# హైదరాబాద్ నుంచి మరో 3 కొత్త రెగ్యులర్ రైళ్లు

- తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు కేంద్రం గుడ్‌న్యూస్
- స్పెషల్ రైళ్లు రెగ్యులర్‌గా మార్చారు
- కాచిగూడ-ట్యుటికోరిన్, హైదరాబాద్-కన్యాకుమారి, చర్లపల్లి-షాలిమార్.. 3 హైస్పీడ్ కారిడార్లు
- కిషన్ రెడ్డి హర్షం.. ప్రధాని, రైల్వే మంత్రికి కృతజ్ఞతలు
- తెలంగాణకు రూ.36,286 కోట్ల రైల్వే బడ్జెట్..

**ముషీరాబాద్, మార్చి 13 (జనం సాక్షి):** పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా భారతీయ రైల్వే నూతన సర్వీసులను నిరంతరం ప్రారంభిస్తోంది. 2014 నుంచి ఇప్పటివరకు హైదరాబాద్ కేంద్రంగా 91 కొత్త రైలు సర్వీసులను ప్రారంభించింది. ఇవన్నీ హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ, చర్లపల్లి టర్మినల్‌ల నుంచే నడుస్తున్నాయి. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు మరో గుడ్‌న్యూస్ వచ్చింది. మూడు స్పెషల్ రైళ్లను రెగ్యులర్ సర్వీసులుగా మార్చేందుకు భారతీయ రైల్వే నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.

రైలు నం. 07191/07192 కాచిగూడ-మధురై-కాచిగూడ స్పెషల్‌ను రైలు నం. 17165/17166 కాచిగూడ-ట్యుటికోరిన్-కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌గా మార్చారు. ఇకపై ప్రతి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కాచిగూడ నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10:45 గంటలకు ట్యుటికోరిన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బుధవారం ఉదయం 7:45 గంటలకు ట్యుటికోరిన్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1:25 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లె రోడ్, పీలేరు, పాకాల, చిత్తూరు స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుంది. రైలు నం. 07230/07229 హైదరాబాద్-కన్యాకుమారి-హైదరాబాద్ స్పెషల్‌ను రైలు నం. 17069/17070 హైదరాబాద్-కన్యాకుమారి-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌గా మార్చారు. ప్రతి బుధవారం సాయంత్రం 5:20 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి శుక్రవారం తెల్లవారుజామున 2:30 గంటలకు కన్యాకుమారి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో శుక్రవారం తెల్లవారుజామున 5:15 గంటలకు కన్యాకుమారి నుంచి బయలుదేరి శనివారం మధ్యాహ్నం 2:30 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. సికింద్రాబాద్, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి జంక్షన్, సత్తెనపల్లి, గుంటూరు జంక్షన్, తెనాలి జంక్షన్, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు జంక్షన్, రేణిగుంట జంక్షన్, తిరుపతి, పాకాల జంక్షన్, చిత్తూరు స్టేషన్ల మీదుగా సాగుతుంది.

రైలు నం. 07225/07226 చర్లపల్లి-షాలిమార్-చర్లపల్లి స్పెషల్‌ను రైలు నం. 17065/17066 చర్లపల్లి-షాలిమార్-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌గా మార్చారు. ప్రతి మంగళవారం ఉదయం 7:15 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11:20 గంటలకు షాలిమార్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బుధవారం మధ్యాహ్నం 12:50 గంటలకు షాలిమార్ నుంచి బయలుదేరి గురువారం సాయంత్రం 7 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. కాజీపేట్, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, రాయనపాడు, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తుంది.

ఈ మూడు స్పెషల్ రైళ్లను రెగ్యులర్ సర్వీసులుగా మార్చిన నిర్ణయంపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో రైల్వే అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తోందని కిషన్ రెడ్డి అన్నారు.

2014 నుంచి ఇప్పటివరకు తెలంగాణకు రూ.36,286 కోట్ల రైల్వే బడ్జెట్ కేటాయించారని, ప్రస్తుతం రూ.47,984 కోట్ల పనులు జరుగుతున్నాయని తెలిపారు. రూ.2,668 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 40 రైల్వేస్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్లుగా అభివృద్ధి చేస్తున్నారని, దీంతో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. తెలంగాణకు దేశంలోనే ఏ రాష్ట్రానికి లేని విధంగా 3 హైస్పీడ్ రైల్ కారిడార్లు మంజూరయ్యాయని, ఇవి రాష్ట్ర సామాజిక, ఆర్థికాభివృద్ధికి కీలకమవుతాయని చెప్పారు. ప్రస్తుతం తెలంగాణ నుంచి 5 వందే భారత్ రైళ్లు, 4 అమృత్ భారత్ రైళ్లు సేవలు అందిస్తున్నాయని, రానున్న రోజుల్లో మరిన్ని అధునాతన రైళ్లు, రద్దీ మార్గాలకు సర్వీసులు ప్రారంభిస్తామని కిషన్ రెడ్డి తెలియజేశారు.

# రైతులను అడలెత్తిస్తున్న బర్రెల చోరీ

- ఫ్యూచర్ సిటీ పోలీస్ స్టేషన్లు దాటిపోతున్న దొంగలు
- కర్ణాటక బార్డర్లో లభ్యమైన బర్రెల జాడ
- పోలీసులకు చిక్కని దొంగలు
- గతంలో మేకల చోరీ.. నేడు బర్రెల చోరీ



**జిల్లేడు చౌదరిగూడ, మార్చి 13 (జనం సాక్షి):** రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో రైతులను అడలెత్తిస్తున్న బర్రెల చోరీలు కొనసాగుతున్నాయి. చౌదరిగూడ గ్రామానికి చెందిన గొల్ల చిన్న చిన్నయ్య, సీతారాములు తండ్రి చంద్రయ్యల ఆరు బర్రెలు (ఒక్కొక్కరికి మూడు) శుక్రవారం తెల్లవారుజామున మాయమయ్యాయి. గురువారం సాయంత్రం పొలం దగ్గర కట్టేసి వచ్చిన రైతులు తెల్లవారు జామున చూసేసరికి బర్రెలు అదృశ్యమైనట్లు గుర్తించారు.

బాధితులు జిల్లేడు చౌదరిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అయితే దొంగలు ఫ్యూచర్ సిటీ పోలీస్ స్టేషన్ పరిధి దాటి కర్ణాటక బార్డర్ వైపు పరారయ్యారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి బర్రెల జాడ కర్ణాటక సరిహద్దులో లభించినా దొంగలను ఇంకా అదుపులోకి తీసుకోలేకపోయారు. ఒక బర్రె చనిపోయే స్థితిలో ఉందని రైతులు చెప్పారు. ఒక్కొక్క బర్రె లక్ష 30 వేల వరకు విలువ చేస్తుందని, వాటితోనే తమ జీవనం కొనసాగుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం పది లక్షల విలువైన బర్రెలు దొంగల చేతికి చిక్కాయని తెలిపారు. ఇదే పోలీస్ స్టేషన్ పరిధిలో కొన్ని నెలల క్రితం మేకల చోరీ కూడా జరిగింది. ఆ దొంగలు కూడా ఇప్పటికీ పోలీసులకు చిక్కకుండా ఉన్నారు. దొంగలకు సమాచారం ఇచ్చేది ఎవరని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తక్షణం చర్యలు తీసుకుని దొంగలను అదుపులోకి తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## టేక్రియాల్ చెరువు వద్ద నిర్వహిస్తున్న శానిటేషన్ పనులు పరిశీలించిన కలెక్టర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పంచాయితీ, మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తు న్న పరిశుభ్రత కార్యక్రమం లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని టెక్రియాల్ చెరువు వద్ద నిర్వహిస్తున్న శానిటేషన్ పనులన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు.అనంతరం సదాశివ నగర్ క్రుప్రియల్ హైవే ఇరుపక్కల జరుగుతున్న శానిటేషన్ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.టెక్రియాల్ చెరువులో గణేష్,దుర్గాదేవి నిమజ్జనం జరిగిన ప్రదేశాలలో చెరువు పరిసర ప్రాంతాల్లో శుభ్రతను కాపాడేందుకు సంబంధిత శాఖల అధికారులు చెరువు వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, శానిటేషన్ పనులు పూర్తి చేసి, శుక్రవారం సాయంత్రం లోపు ఆ ప్రాంతాన్ని సమతలంగా చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చూడాలని ప్రజాప్రతినిధులు పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కలెక్టర్ తెలిపారు.ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ మురళీ, మున్సిపల్ కమిషనర్ రాజేందర్, డిఎల్‌పిఓ శ్రీనివాస్, మున్సిపల్ ఛైర్పర్సన్ ఇప్ప ఉమారాణి, వైస్ చైర్ పర్సన్ కాసర్ల గోదావరి, కౌన్సిలర్ కొత్తపల్లి లలిత,పంచాయతీ, మున్సిపల్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### చెత్త వేస్తే భారీ జరిమానాలు విధించాలి

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామపంచాయతీ పరిదిలో జరుగుతున్న పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తనిఖీ చేశారు. అడ్లూర్ శివారులో గ్రామ అధికారుల ద్వారా నిర్వహిస్తున్న ప్లాస్టిక్ సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన తగు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా నేషనల్ హైవే పైన ఉన్న డాబా హోటళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. హైవే పైన ఉన్న అన్ని డాబా హోటళ్లకు పంచాయతీ కార్యదర్శులు నోటీసులు జారీ చేసి, వారికి సంబంధిత లైసెన్సులు ఉన్నాయా, నేషనల్ హైవే అధికారుల అనుమతి తీసుకున్నారా అనే విషయాలను పరిశీలించాలని ఆదేశించారు. ప్రయాణికులు, ప్రజలు నేషనల్ హైవే పైన ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాస్టిక్, ఫుడ్ వేస్టేజ్, పేపర్ వేస్టేజ్ వంటి చెత్తను వేయకుండా రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ దిశగా గ్రామపంచాయతీలు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా నేషనల్ హైవే పైన ఉన్న డాబా హోటళ్లను పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓ, ఎంపీడీవోలు సంయుక్తంగా తనిఖీ చేసి, నేషనల్ హైవే అనుమతులు, గ్రామపంచాయతీ అనుమతులు ఉన్నాయా లేదా పరిశీలించాలని ఆదేశించారు.

- నెలన్నర రోజులుగా గైనిక్ వైద్యురాలి పోస్ట్ ఖాళీ..
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- దురుసు ప్రవర్తన, ప్రైవేటు ఆసుపత్రులకు మళ్లింపు
- అత్యవసర సమయంలో సిబ్బంది అసహనం
- ప్రసవాలు పెంచాలని ప్రభుత్వం ఆదేశాలు.. నిజం మాత్రం వేరు
- వైద్యురాలి నియామకం కోసం గర్భిణుల వేడుకోలు



# గర్భిణులకు నరకయాతన

## వేములవాడ ఏరియా ఆసుపత్రిలో అందని గైనిక్ సేవలు

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని ఇటు ప్రభుత్వం అటు అధికారులు తరచూ వైద్య సిబ్బందికి సూచిస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నారు.జిల్లా స్థాయిలో వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ సూచనలు చేస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధంగా పరిస్థితులున్నాయి.**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 13 (జనంసాక్షి)**

వేములవాడ ఏరియా ఆసుపత్రిలో సుమారు 45 రోజులుగా గైనిక్ వైద్యురాలు (స్త్రీ వైద్య నిపుణురాలు) పోస్టు ఖాళీగా ఉండడం ఇందుకు నిదర్శనం. అత్యవసర సమయంలో ఏరియా ఆసుపత్రికి వస్తున్న గర్భిణులపై సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామానికి చెందిన ఓ గర్భిణి సుమారు రెండు నెలల క్రితం వేములవాడ ఏరియా ఆసుపత్రికి వచ్చింది. ఐదు గంటలు వేచి ఉనప్పటికీ వైద్యురాలు అందుబాటులోకి రాకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి కాన్పు చేయించుకున్నారు.ఇటీవల చిన్నారి టీకా కోసం ఆరోగ్య ఉప కేంద్రానికి వెళ్లిన మహిళతో ఏఎన్ఎం దురుసుగా ప్రవర్తించగా ఆమెను డిప్యూటేషన్‌పై రుద్రంగి మండలం మానాలకు పంపారు.

వేములవాడ ఏరియా ఆసుపత్రికి రెండు రోజుల క్రితం గర్భిణీకి పురిటి నొప్పులతో 108 వాహనంలో ఆసుపత్రికి వచ్చింది. గైనిక్ వైద్యురాలు లేదని సిబ్బంది సిరిసిల్లకు వెళ్లాలని దురుసుగా ప్రవర్తించారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు వైద్య సిబ్బందితో సమీక్షలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో గర్భిణులను గుర్తించడంతో పాటు ప్రతి నెల ఇంజెక్షన్లు,బరువు, ఇతర చెకప్‌లు ఆరోగ్య కేంద్రంలో జరిగే విధంగా చూడాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా ప్రసవం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా సమీపంలోని ఏరియా జిల్లా ఆసుపత్రిలో జరిపించాలని అందుకు సంబంధించి గర్భిణులతో వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించి ప్రభుత్వ వైద్య సేవలపై నమ్మకం కలిగించాలనీ పేర్కొంటున్నారు.

**ప్రభుత్వ ఆసుపత్రిలో పెరిగిన ప్రసవాల సంఖ్య.**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆసుపత్రిలో సదుపాయాలు కల్పించడంతో ఇటీవలి కాలంలో ప్రసవాల సంఖ్య పెరిగింది. పేద, మధ్య తరగతి ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం వైపు చూస్తున్నారు. అయితే అనేక చోట్ల సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపణలున్నాయి.

**నెలన్నర రోజులుగా గైనిక్ వైద్యురాలి పోస్ట్ ఖాళీ..**

వేములవాడ ఏరియా ఆసుపత్రికి బోయినపల్లి, చందుర్తి, రుద్రంగి వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్, కోనరావుపేట మండలాల నుంచి వైద్య సేవల కోసం వస్తుంటారు. అయితే సాధారణ కాన్పులు,శస్త్ర చికిత్స కోసం వేములవాడ ఏరియా ఆసుపత్రికి పంపిస్తుంటారు. అయితే ఇక్కడికి వస్తున్న గర్భిణులు ఇటీవల పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలన్నర రోజులుగా గైనిక్ వైద్యురాలి పోస్ట్ కాళిగా ఉంది. దీంతో గర్భిణులకు వైద్య సేవలు అందడం లేదు.జిల్లా అధికారులు స్పందించి గైనిక్ వైద్యురాలి నీ నియమించాలని పలువురు కోరుతున్నారు.



# వేసవికాలం ప్రజలు జాగ్రత్తలు వహించాలి : జిల్లా వైద్యాధికారి రజిత

**ఎల్లారెడ్డిపేట, మార్చి 13, (జనంసాక్షి) :**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక వైద్య నిపుణుల శిభిరాన్ని జిల్లా వైద్యాధికారి రజిత సందర్శించి ప్రజలు వేసవి కాలం వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఎల్లారెడ్డిపేట గ్రామ సర్పంచ్ ఎలగందుల నరిసింహులు శుక్రవారం ప్రత్యేక వైద్య శిభిరాన్ని ప్రారంభించారు. ప్రత్యేక వైద్య నిపుణులైన, స్త్రీల వైద్య నిపుణులు, పిల్లల, ఎముకల, నేత్ర, దంత వైద్య నిపుణులతో పాటు జనరల్ ఫిజిషియన్‌లు వచ్చిన 212 మంది రోగులకు వైద్యం చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి రజిత మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులకు పరీక్షించిన వెంటనే మందులు పంపిణి చేయాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కవగా ఉన్నందున ఈ వైద్య శిభిరంలో ఓఆర్ఎస్ ప్యాకేట్లు పంపిణి చేయాలన్నారు. ఎండ తీవ్రత ఉన్నందున ప్రజలు 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా నీడ ప్రాంతములోనే ఉండాలన్నారు. అత్యవసర



పరిస్థితులలో బయటకి వస్తే తలకు టోపి ధరించి నీళ్ల బాటల్‌తో వెళ్లాలన్నారు. చెమట రూంలో నీరు అధికంగా శరీరం నుండి బయటకు పోతుందని నీరు, మజ్జిగ, కొబ్బరి బొండం, నిమ్మరసం లాంటివి అధికంగా సేవించాలని వ్యాధిగ్రస్తులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి డాక్టర్ సారియా అంజుమ్, ప్రత్యేక వైద్యనిపుణులు వంశీగౌడ్, నవీన, సూపర్‌వైజర్, ఎంఎల్‌హెచ్‌పిస్స్, ఏఎన్ఎం, ఆశ వర్కర్లులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉమెన్స్ వాలీబాల్ టీం అసిస్టెంట్ కోచ్‌గా అఖిల

**ఎల్లారెడ్డిపేట, మార్చి 13, (జనంసాక్షి) :** తెలంగాణ ఉమెన్స్ వాలీబాల్ టీమ్ అసిస్టెంట్ కోచ్‌గా ఎల్లారెడ్డిపేట మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన ముద్రకోల అఖిల ఎన్నికయ్యారు. అఖిల భువనేశ్వర్ లో జరిగే జాతీయస్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొనబోయే తెలంగాణ ఉమెన్స్ వాలీబాల్ జట్టు అసిస్టెంట్ కోచ్‌గా సీనియర్ వాలీబాల్ ప్లేయర్ ఎంపికయ్యింది. ఫిబ్రవరి 16 నుండి 20 వరకు వేములవాడ పట్టణ కేంద్రంలో



జరిగినటువంటి తెలంగాణ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మార్చి 2 నుండి 12 వరకు జరిగిన ప్రత్యేక శిక్షణ శిభిరంలో పాల్గొనున్నారు. అఖిల తెలంగాణ ఉమెన్స్ జట్టును భువనేశ్వర్ లో ఈనెల 14 నుండి 20 వరకు జరగబోయే జాతీయస్థాయి ఆటలలో పాల్గొనేందుకు మార్చి13 నాడు ప్రయాణమై వెళ్లారు. తమ గ్రామ క్రీడాకారిణి రాష్ట్ర జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా ఎంపిక అయినందుకు ఎల్లారెడ్డిపేట మండల నాయకులు, ప్రజాప్రతినిధులు అఖిలకు అభినందనలు తెలిపారు.



# జిల్లాలో సిలిండర్ల కొరత

## కట్టెల పొయ్యిలపై హోటళ్ల నిర్వహణ

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 13 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత వచ్చింది.అమెరికా ఇరాన్ యుద్ధం జరుగుతున్న తరుణంలో సిలిండర్ల కొరత ఏర్పడడంతో జిల్లాలోని సిరిసిల్ల,వేములవాడలోని కొన్ని టిఫిన్ సెంటర్లు మూసివేసుకోగా సిలిండర్లు దొరక్కపోవడంతో కట్టెల పొయ్యి పైనే టిఫిన్లు, తినుబండారాలను తయారు చేస్తున్నారు.వేములవాడలో రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఉదయం టిఫిన్లు దొరక్కపోగా వారు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజన్న సన్నిధికి రాష్ట్ర నలుమూల నుండి భక్తులు తరలి వస్తుంటారు. నిత్యం వచ్చే వేలాది భక్తుల మీదే ఆధారపడి అనేక చిరు వ్యాపారాలు వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతారు. ఇందులో ప్రధానంగా టిఫిన్ సెంటర్లు, ఛాయా దుకాణాలు, పలు హోటల్లు దాదాపు పట్టణంలో 150 కు పైగా ఉన్నాయి. ఇరాన్ పై ఇజ్రాయిల్,అమెరికా సంయుక్తంగా దాడి చేస్తున్న క్రమంలో ముడి చమురుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుండగా గ్యాస్ కొరత వల్ల ప్రస్తుతం హోటల్ నిర్వాహకులు యిబ్బందులు పడుతున్నారు.

ఇప్పటికే వేములవాడలో టిఫిన్ సెంటర్లు, కర్రీ పాయింట్లు,ఛాయా హోటల్లు రెండు రోజులుగా వంటగ్యాస్ దొరకగా మూతపడుతూ వస్తున్నాయి. అయితే భక్తులకు ఆహారాన్ని అందించే హోటల్లు మూతపడుతున్నయి.వేములవాడలో ప్రధానంగా భక్తులు అధికంగా ఉండే జాతర గ్రౌండ్, తిప్పాపూర్ బస్టాండ్, భీమేశ్వర ఆలయ పరిసరాలలో సుమారు 100 కు పైగా టిఫిన్ సెంటర్లు, ఛాయ హోటల్ల వ్యాపారాలు ఉన్నాయి. ప్రధానంగా ఈ వ్యాపారులు వంట గ్యాస్ మీదే ఆధారపడి తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.గ్యాస్ సిలిండర్ల కొరత ఏర్పడడంతో కట్టెల పొయ్యి పైనే టిఫిన్లను, తిను బండారాలను తయారు చేస్తున్నారు.

# అర్ధరాత్రి వేళ క్షేత్రస్థాయిలో జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

- ఆపరేషన్ కవచ్... దొంగతనాలు, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం
- పాత నేరస్తుల కదలికలపై డేగ కన్ను
- పాప్లిన్ డివైస్‌తో 285 మంది అనుమానితుల జల్లెడ
- 14 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు
- సిబ్బందితో టీ తాగుతూ ఉత్సాహపరిచిన ఎస్పీ



**కామారెడ్డి, మార్చి 13 (జనం సాక్షి):** ప్రజల ప్రాణాలకు రక్షణ కవచంలా, నేరగాళ్ల గుండెల్లో వణుకు పుట్టించేలా కామారెడ్డి జిల్లా పోలీస్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ కవచ్' నిరంతర నిఘా నేత్రం నగరం నిద్రపోతున్నా, రహదారులు నిశ్శబ్దంగా ఉన్నా ప్రతి మలుపులోనూ పోలీసుల పహారా ఉంటూ దొంగతనాల నియంత్రణకు, రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన ఆయుధంగా మారింది. మనం మేల్కొని ఉంటేనే జిల్లా ప్రశాంతంగా నిద్రపోతుందనే నినాదాన్ని గుండెల్లో నింపుకుని, చీకటి ముసిరిన వేళ ప్రజల కంటి నిండా నిద్ర కోసం తమ కంటి రెప్ప వాల్చకుండా కాపలా కాసే కర్తవ్యంలో భాగంగా జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర స్వయంగా అర్ధరాత్రి వేళ క్షేత్రస్థాయిలో అడుగుపెట్టారు.

ఆపరేషన్ కవచ్ తనిఖీలను ఆకస్మికంగా పర్యవేక్షిస్తూ, నిశీధిలో కూడా ప్రజలకు భరోసాగా నిలిచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దొంగతనాలు జరగకుండా అరికట్టడమే ప్రధాన లక్ష్యంగా సాగుతున్న ఈ తనిఖీల్లో పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ముఖ్యంగా అనుమానాస్పద వ్యక్తులను పాప్లిన్ డివైస్ ద్వారా గురువారం అర్ధరాత్రి 285 మందిని క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగిందని, నేర చరిత్ర ఉన్నవారిని జల్లెడ పడుతున్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడా అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని విధుల్లో ఉన్న సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

ఆపరేషన్ కవచ్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఈ రోజు మొత్తం 305 మందిని తనిఖీ చేయగా 14 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. అనంతరం సిరిసిల్ల రోడ్ చౌరస్తా వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను పర్యవేక్షిస్తూ, అక్కడే విధుల్లో ఉన్న సిబ్బందితో కలిసి ఎస్పీ టీ, స్నాక్స్ తీసుకుంటూ వారిని ఉత్సాహపరిచారు. నిశీధిలో నిరంతరం శ్రమిస్తున్న సిబ్బంది సేవలను ప్రత్యేకంగా అభినందిస్తూ, అలసటకు లోనవకుండా ప్రజల భద్రతే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. చివరగా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ పోలీసులు మీ ప్రాణాల కోసం, ఆస్తుల రక్షణ కోసం 24/7 పహారా కాస్తున్నారని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, కామారెడ్డి ఎస్హెచ్ఓ నరహరి, మాచారెడ్డి ఎస్హెచ్ఓ అనిల్, సదాశివనగర్ ఎస్హెచ్ఓ పుష్ప రాజు, ఎల్లారెడ్డి ఎస్హెచ్ఓ మహేష్, నసరూళ్ళబాద్ ఎస్హెచ్ఓ రాఘవేంద్ర, బాన్స్ వాడ యస్ఐ రాములు తదితరులు రాత్రి విధుల్లో పాల్గొన్నారు.

# గ్యాస్ కొరతపై అపోహ వద్దు

- తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు
- గ్యాస్ సరఫరాపై నిరంతర నిఘా : జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




**వికారాబాద్ జిల్లా బ్యూరో మార్చి 13 (జనం సాక్షి):**

రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని, జిల్లా ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, వందతులను కూడా నమ్మవద్దని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు.శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో గ్యాస్ నిలువలు, సరఫరాపై ఎల్పీజీ డీలర్లు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... యుద్ధం ప్రభావం వలన జిల్లాలో ఎలాంటి ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని, ఇంతకు ముందు గ్యాస్ బుక్ చేసుకున్నా తరువాత సరఫరా ఉన్నట్లే ప్రస్తుతం కూడా అదే విధంగా గ్యాస్ సరఫరా ఉంటుందన్నారు. జిల్లాలో సరిపడా గ్యాస్ నిల్వలు ఉన్నాయని, గృహ అవసరాలకు వినియోగించే ఎల్.పి.జి గ్యాస్ కు ఎలాంటి కొరత లేదని, అదేవిధంగా ఆసుపత్రులు, విద్యాసంస్థలకు చెందిన వసతి గృహాలు, అనాధ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు వంటి సంస్థలకు ఎలాంటి కొరత లేదని ఆయన తెలిపారు . జిల్లా ప్రజలు గ్యాస్ పై వస్తున్న అవాస్తవాలను, వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్బన్ ప్రాంతాలకు చెందిన వారు 25 రోజులకు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒక సారి చొప్పున గ్యాస్ బుక్ చేసుకునే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. గ్యాస్ బ్లాక్ మార్కెట్ చేసినట్లు తమ దృష్టికి వస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఏదేని సమస్యలు అధికారుల దృష్టికి వచ్చినట్లయితే తనకు తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ... గ్యాస్ సరఫరా సందర్భాల్లో శాంతి భద్రతను కాపాడిన బాధ్యత పోలీసు అధికారుల దన్నారు. గ్యాస్ బ్లాక్ మార్కెట్ కాకుండా నిఘా పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వరి, ఆర్డీవో వాసుచంద్ర, డిసిఎస్ఓ సుదర్శన్, డీఎంసిఎస్ మురళి కృష్ణ, డీఎంహెచ్ఓ స్వర్ణ కుమారి, డిఇఓ రేణుకాదేవి, డిబిసిడిఓ మాధవ రెడ్డి, డీఏఓ రాజారత్నం, డిడబ్ల్యుఓ కృష్ణవేణి పాల్గొన్నారు.

## పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

**పోషకాహారం అందించాలి : కలెక్టర్ గరిమ**

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, (జనం సాక్షి) :**

అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.సిరిసిల్ల పట్టణం అశోక్ నగర్ లోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లల హాజరు రిజిస్టర్ తనిఖీ చేసి, మొత్తం ఎందరు పిల్లలు ఉన్నారు? రోజూ ఎందరు వస్తున్నారో ఆరా తీశారు.పలువురు పిల్లల తల్లులతో మాట్లాడి.. గుడ్డు, పోషకాహారం ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లల ఎత్తు, బరువు కొలిచిన వివరాలు, ఆన్లైన్ అలాగే రిజిస్టర్ నమోదు చేసిన వివరాలు పరిశీలించారు. కేంద్రంలో నిలువ ఉన్న గుడ్లు, బాలా అమృతం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలు రోజూ వచ్చేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

- నేటి నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం
- దుద్యాల నుండి 17 కిలోమీటర్ల దూరంలో పరీక్ష కేంద్రం
- పరీక్షా సమయానికి ప్రత్యేక బస్సు నడపండి : విద్యార్థులు



# సీఎం సారు... మేం పరీక్ష రాసేదెలా?

## పదవ తరగతి పరీక్షలకు ప్రైవేటు వాహనాలే దిక్కు!


**దుద్యాల, మార్చి 13 (జనం సాక్షి) :** దుద్యాల మండల పరిధిలోని దుద్యాల,హకీంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,చెట్టుపల్లితండా కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలకు చెందిన విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయడానికి 17 కిలోమీటర్ల దూరంలోని బొంరాస్ పేట మండల కేంద్రానికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. దద్యాల మండల కేంద్రంలోనే పదవ తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తప్పేవని పలువురు విద్యార్థులు వాపోతున్నారు.మండల పరిధిలోని మూడు పాఠశాలల నుండి మొత్తం 184 మంది విద్యార్థులు ప్రైవేటు వాహనాలలోనే పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. సీఎం సారు మా బాధలు ఎన్నడూ తీరుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలోనైనా మండల కేంద్రంలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని కోరుతున్నారు.



**పరీక్షా కేంద్రానికి ప్రత్యేక బస్సు నడపాలి**

దుద్యాల నుండి బొంరాస్ పేట పరీక్షా కేంద్రానికి వెళ్లేందుకు అధికారులు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- టీ. శ్రావణి దుద్యాల



**పరీక్షకు ప్రైవేటు వాహనాలే దిక్కు**

పదవ తరగతి పరీక్షలు రాయాలంటే తాము మండల కేంద్రం నుండి ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.ఆర్టీసీ అధికారులు బస్సు నడిపితే బాగుంటుంది.

- సి.భవిత దుద్యాల

## జిల్లాస్థాయి ఉమెన్ అచీవర్స్ పురస్కారానికి ఎంపికైన ఉపాధ్యాయురాలు

మేడిపల్లి, మార్చి 13(జనంసాక్షి):జగిత్యాల జిల్లా భీమారం మండలం పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంకటరావుపేటలో గణిత ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న భోగ రజిత జిల్లాస్థాయిలో ఉమెన్ అచివర్స్‌గా ఎంపికయ్యారు. పాఠశాల నుండి జిల్లాస్థాయి ఉమెన్స్ అచివర్ గా ఎంపికవడం పట్ల ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి గ్రామ సర్పంచ్ కానుగంటి శ్రీనివాస్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ పల్లి స్వప్న మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయరానికి అభినందనలు తెలిపారు.



# గ్యాస్ కొరత ఏర్పడకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రానిదే

- గ్యాస్ డీలర్లు కృత్తిమ కొరత సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు
- ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**మంథని, (జనంసాక్షి) :** ప్రపంచంలో జరుగుతున్న యుద్ధం పరిణామాల దృష్ట్యా గ్యాస్ కొరత ఏర్పడిందని, గ్యాస్ కొరత ఏర్పడకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అని తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం మంథని పట్టణంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.... ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా గ్యాస్ బండ సామాన్యుడికి గుడిబండల మారిందని తెలిపారు. యుద్ధ వాతావరణం ఏర్పడిన సందర్భంలో గ్యాస్ కొరత ఏర్పడిందని, సామాన్యుడికి గ్యాస్ బండ అందేలా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వాన్ని పేర్కొన్నారు. గ్యాస్ ఏజెన్సీ డీలర్లు గ్యాస్ సిలిండర్లను బ్లాక్ లో విక్రయించినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సామాన్యుడికి అందుబాటులో గ్యాస్ సిలిండర్లు ఉండేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ కొరత లేకుండా ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే గ్యాస్ నిలువల గురించి పౌరసరఫల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేశామని, సామాన్యుడికి అందుబాటులో సిలిండర్ ఉండేలా చర్యలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో గ్యాస్ విలువల గురించి ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి వివరిస్తున్నట్లు మంత్రి వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో భారత ప్రధాని మోడీ గ్యాస్ సరఫరా గురించి తక్షణమే స్పందించాలని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం గ్యాస్ నిల్వలు ఎన్ని ఉన్నాయి, ఇంకా ఎన్ని రోజులకు సరిపడా ఉంటాయి అనే విషయం కేంద్ర ప్రభుత్వం ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఉందని మంత్రి తెలిపారు. ముడి చమురు నిలువల గురించి కూడా కేంద్ర ప్రభుత్వం వివరించాలని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రానికి సంబంధించినటువంటి గ్యాస్ సరఫరా, ముడి చమురు సరఫరా గురించి కేంద్ర ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు వివరాలు తెలుపుతున్న మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రానికి ఎలాంటి కొరత కలుగకుండా సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్ పర్సన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులు, న్యాయవాది శశిభూషణ్ కాచే, నాయకులు సేగ్గం రాజేష్, మంథని సత్యం, సోషల్ మీడియా ఇన్చార్జి ఆరెళ్లి కిరణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్ష కేంద్రాలను సందర్శించిన మండల విద్యాధికారి రాజయ్య

**సుల్తానాబాద్,మార్చి 13(జనంసాక్షి) :** నేటి నుండి జరిగే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య, మాట్లాడుతూ సుల్తానాబాద్ మండలంలో (5 ) పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుల్తానాబాద్ గవర్నమెంట్ హైస్కూల్ సుల్తానాబాద్ సెంట్ మేరీ హైస్కూల్,సుల్తానాబాద్, ఆల్ఫోర్స్ హైస్కూల్ సుల్తానాబాద్,గర్రెపల్లిలో టి ఎస్ ఎం ఎస్ -గర్రెపల్లి సాంఘిక సంక్షేమ (బాలికల) గురుకుల పాఠశాల గర్రెపల్లి లో సెంటర్లను ఏర్పాటు చేయనైనది.గవర్నమెంట్ హై స్కూల్ సుల్తానాబాద్ సెంటర్కు ఎస్ రత్నాకర్ రెడ్డి -చీఫ్ సూపరింటెండెంట్ వి అంజయ్య- డిపార్ట్మెంటల్ ఆఫీసర్.సెయింట్ మేరీస్ హై స్కూల్కు వై రాధాస్వామి -చీఫ్ సూపరింటెండెంట్,డి వెంకటేశ్వర్లు- డిపార్ట్మెంటల్ ఆఫీసర్. ఆల్ ఫోర్స్ హై స్కూల్ కు వి. కవిత -చీఫ్ సూపరింటెండెంట్ కే వెంకటేశ్వర్లు- డిపార్ట్మెంటల్ ఆఫీసర్. టీజీఎంఎస్ గర్రెపల్లి సెంటర్కు కే రవీందర్- చీఫ్ సూపరింటెండెంట్ బి రామకృష్ణ- డిపార్ట్మెంటల్ ఆఫీసర్.టీజీఎస్ డబ్ల్యూఆర్ఐఎస్ గర్రెపల్లి సెంటర్కు డి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

## గృహ వినియోగదారులకు గ్యాస్ సరఫరా

- ఇక్కట్లు లేకుండా...బ్లాక్ మార్కెట్ జరక్కుండా చర్యలు
- పెట్రో డీలర్లతో సిఎస్ రామకృష్ణారావు సమీక్ష



**హైదరాబాద్, మార్చి13 (జనంసాక్షి) :** రాష్ట్రంలో గృహ వినియోగదారులకు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల పంపిణీలో ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్యాస్ కంపెనీలను సిఎం రామకృష్ణారావు ఆదేశించారు. రోజువారి సమీక్ష, బ్లాక్ మార్కెటింగ్ లేకుండా చర్యలు, డిస్టిబ్యూటరీలు, ఏజెన్సీల దగ్గర పోలీస్ నిఘా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇంధన నిల్వలు, గ్యాస్ వినియోగదారులకు పంపిణీ, ప్రస్తుత పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు శుక్రవారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు, సివిల్ సప్లై విభాగం అధికారులతో సమీక్ష చేశారు. మావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ సరఫరా, నిల్వలు, రవాణా వ్యవస్థ, భవిష్యత్ అవసరాలు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో 1.29 కోట్ల గృహ వినియోగదారుల కనెక్షన్లు ఉన్నాయని, ప్రస్తుత డిమాండ్ కు సరిపడా నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆసుపత్రులు, ప్రభుత్వ హాస్టళ్లు కు డిమాండ్ మేరకు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. గృహ వినియోగదారులకు ఎల్పీజీ సిలిండర్ల సరఫరా విషయంలో ఎలాంటి ఆందోళన చేందాల్సిన అవసరం లేదని ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, శాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 810 డిస్టిబ్యూట్రరీ కేంద్రాలు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా చేస్తున్నాయని అన్నారు. వినియోగదారులకు సకాలంలో డెలివరీ జరిగేలా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమయానికి సరఫరా అందేలా సంబంధిత శాఖలతో సమన్వయం పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### అసెంబ్లీ ప్రశ్నలకు సమాధానాలు సిద్ధం చేయండి

ఈనెల 16 వ తేదీ నుండి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నందున ఇప్పటి వరకు వచ్చిన ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు వెంటనే సమర్పించాలని అన్ని విభాగాల ఉన్నతాధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ రావు ఆదేశించారు. సెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో పెండింగులో ఉన్న ప్రశ్నలకు రావాల్సిన సమాధానాలు, సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులతో సి.ఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, శాసన మండలి, శాసనసభ సమావేశాల నేపథ్యంలో గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నలన్నింటికీ రేపటిలోగా సమాధానాలు పంపించాలని అన్నారు. ప్రధానంగా, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ పరిపాలన, ఇంధనశాఖ, రెవిన్యూ తదితర శాఖలకు సంబంధించి అధికంగా ప్రశ్నలున్నాయని, వీటన్నింటికీ వెంటనే సమాధానాలు పంపాలని అన్నారు. బ్జడెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగం తో ప్రారంభమవుతాయన్నారు. బ్జడెట్ సమావేశాల నిర్వహణపై ఉప ముఖ్యమంత్రి ఆదివారం నాడు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నార ని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హైడ్రాకు ఎన్ఆర్ఎస్సీ డేటా వజ్రాయుధం

- ఆ డేటాతోనే ఎఫ్టీఎల్ లెక్కలు తేల్చుతున్నాం
- ఎన్ఆర్ఎస్సీ యూఎంఐ సదస్సులో హైడ్రా కమిషనర్
- జలవనరుల రక్షణలో హైడ్రా చర్యలను అభినందించిన ఇస్రో శాస్త్రవేత్తలు



**హైదరాబాద్, మార్చి 13 (జనంసాక్షి) :** కనుమరగైపోయిన చెరువుల జాడ తెలుసుకోవడంతోపాటు.. ఉన్న వాటి ఎఫ్టీఎల్ లెక్కలు తేల్చడానికి ఎన్ఆర్ఎస్సీ అందిస్తున్న ఉపగ్రహ ఆధారిత డేటా హైడ్రాకు "వజ్రాయుధం" లా మారిందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. చెరువులు, నాలాల ఎఫ్టీఎల్, బఫర్ పరిధిలకు సంబంధించిన సమాచారం ఒక్కో విధంగా ఉందని.. ఇలాంటి సమయంలో ఎన్ ఆర్ ఎస్ సీ డేటా దిక్సూచీలా మారిందన్నారు. వికసిత్ భారత్ ఏ 2047 సాధనలో భూమి పరిశీలన విధానాలు – ధోరణులు, సవాళ్లు అనే అంశంపై ఎన్ఆర్ఎస్సీ సెంటర్లో శుక్రవారం జరిగిన సదస్సులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గౌరవ అతిథిగా హాజరై ప్రసంగించారు. చెరువుల ఎఫ్టీఎల్ నిర్ధారణలోనే కాదు.. ప్రభుత్వ భూములు, పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల లెక్క తేల్చడంలో కూడా ఎన్ ఆర్ ఎస్ సీ డేటా హైడ్రాకు ఎంతో ఉపయోగపడుతోందని అన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి వందలాది మంది వస్తుంటారని.. వారి ఫిర్యాదులను అక్కడికక్కడే పరిశీలించడానికి కూడా ఈ డేటా వాడుతున్నామన్నారు. ఎప్పుడు ఎలా భూ వినియోగం మారిందో ఫిర్యాదుదాలరకు కళ్లకు కట్టినట్టు చూపించి చాలావరకు సమస్యలను పరిష్కరిస్తున్నా మన్నారు.

### చెరువుల కబ్జాలను ఆపాం..

ఓఆర్ ఆర్ వరకూ హైడ్రా పరిధి విస్తరించి ఉందని.. ఎన్ ఆర్ ఎస్ సీ లెక్కల ప్రకారం దాదాపు 61 శాతం చెరువులు మాయం అయ్యాయని.. మరో 15 సంవత్సరాలలో మిగతా చెరువులు కూడా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని హైడ్రా కమిషనర్ హెచ్చరించారు. ఇలాంటి తరుణంలో చెరువుల జాడ తెలుసుకుని వాటిని పరిరక్షించే పనిని ముమ్మరం చేశామని చెప్పారు. హైడ్రా చర్యలతో రియల్టర్లతో పాటు.. ఇతరులెవరూ చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో లే ఔట్‌లు వేయడం, నిర్మాణాలు చేపట్టడం లేదని హైడ్రా కమిషనర్ చెప్పారు. ఎన్ ఆర్ ఎస్ సీ సేవలను మరింత విస్తృత స్థాయిలో వినియోగించుకోడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2006లో ఉన్న ఎన్ ఆర్ ఎస్ సీ అందించిన డెమ్ (డిజిటల్ మోడల్ ఎలివేషన్) డేటాతో చెరువుల ఎఫ్టీఎల్, బఫర్‌లను నిర్ధారించడం జరుగుతోందని.. అవసరమైతే 1970, 1990ల నాటి డేటాను కూడా తాము వినియోగించుకుంటామని చెప్పారు. ఓఆర్ ఆర్ పరిధిలో సుమారు 13,500 ఎకరాల ప్రభుత్వ, ప్రజావసరాలకు ఉద్దేశించిన భూమిని కాపాడామని.. దీని విలువ దాదాపు ?70, 000 కోట్ల వరకూ ఉంటుందని చెప్పారు.

### నీటి నాణ్యతకూ సహకరించండి..

తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్‌లోని చెరువుల నీటి నాణ్యతపై ఉపగ్రహ ఆధారిత అధ్యయనాలు నిర్వహించేందుకు ఎన్ఆర్ఎంసీకి సహకరించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కోరారు. ఈ అధ్యయనాలు కాలుష్య స్థాయిలను పర్యవేక్షించడంతో పాటు శాస్త్రీయ ఆధారాలతో సరస్సుల పునరుద్ధరణ చర్యలకు సహాయపడతా యన్నారు. పర్యావరణ పరిరక్షణలో జల సంరక్షణ కీలకమైనదని.. నీటి వనరులను కాపాడడంలో హైడ్రా చొరవ అభినందనీయమని ఇస్రో ఛైర్మెన్ డా. వి. నారాయణన్ అన్నారు. సదస్సులో వర్చ్యువల్ ద్వారా కీలకోపన్యాసం చేశారు. ఇస్రో సాంకేతిక పరిజ్ఞానాన్ని సామాన్యులకు చేరవేయడంలో హైడ్రా చొరవ మార్గదర్శ కంగా నిలుస్తుందన్నారు. అంతరిక్ష ఆధారిత సాంకేతికతను వినియోగించి ప్రజా ఆస్తులతో పాటు సరస్సులను రక్షించేందుకు హైడ్రా చేస్తున్న కృషిని ఇస్రో శాస్త్రవేత్తలు అభినందిం చారు. ఎన్ ఆర్ ఎస్ సీ డైరెక్టర్ డా. ప్రకాష్ చౌహాన్, ఇస్రో మాజీ ఛైర్మెన్ ఏఎస్ కిరణ్ కుమార్‌తో పాటు పలువురు మాట్లాడారు. చెరువులు, పార్కులు కాపాడడంలో హైడ్రాకు పూర్తి సహకారం అందిస్తామన్నారు.

### 'హైడ్రా-రక్ష' పోర్టల్‌ను ప్రారంభించిన సదస్సు

ఎన్ ఆర్ ఎస్ సీ సెంటర్లో శుక్రవారం జరిగిన సదస్సులో పలువురు శాస్త్రవేత్తల సమక్షంలో 'హైడ్రా-రక్ష' పౌర కేంద్రిత పోర్టల్ ప్రారంభమైంది. ఓఆర్ఆర్ పరిధిలోని చెరువులు, నాలాల హద్దులతో పాటు.. భూముల వివరాలు తెలుసుకునేందుకు హైడ్రా – రక్ష పోర్టల్ ఉపయోగపడుతుంది. చెరువులు, ప్రభుత్వ భూములతో పాటు ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను ప్రజలు కొని మోసపోకుండా సరైన సమాచారం ఈ పోర్టల్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి రానుంది. కొంటున్న ప్లాట్లు చెరువుల చెంత ఉన్నాయా.. నాలాల బఫర్‌లోనివా అనేది తెలుసుకోడానికి వీలు కుదురుతుంది. జిల్లా / మండలం / గ్రామం, సరస్సు పేరుతో పాటు భౌగోళిక సమన్వయాలు ఈ పోర్టల్‌లో ఎంటర్ చేస్తే సంబంధిత ప్రాంతం ఆటోమేటిక్‌గా జూమ్ అవుతుంది. ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్టీఎల్) రిహద్దులు, బఫర్ జోన్‌లు తెలుస్తాయి. 'హైడ్రా–రక్ష' పోర్టల్‌ను మొదట్లో కొన్ని వారాల వరకూ హైడ్రా అంతర్గత వినియోగానికి మాత్రమే వినియోగిస్తుంది. పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చిన తర్వాత ఈ పోర్టల్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తుంది.

## మావోయిస్ట్ అగ్రనేత సంస్మరణ సభలో పాల్గొన్న
# 230 మందికి ఎన్ఐఏ నోటీసులు

**కరీంనగర్, మార్చి 13 (జనంసాక్షి) :** ఇటీవల మావోయిస్టు అగ్రనేత రామచంద్రారెడ్డి (వికల్ప్) అంత్యక్రియలు, సంస్మరణ సభకు హాజరైన మాజీ మావోయిస్టులపై జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ దృష్టి సారించింది. ఈ క్రమంలో సుమారు 230 మందికి నోటీసులు జారీ చేయడం ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో పెద్ద చర్చకు దారితీసింది. గతేడాది అక్టోబరు 18 న హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని కోహెడలో మావోయిస్టు అగ్రనేతలు రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణరెడ్డిల జ్ఞాపకార్థం 'నారాయణపూర్ అమరుల సంస్మ రణ సభ' నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి తెలుగు రాష్ట్రాల్లోలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున మాజీ మావోయిస్టులు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. సభలో పాల్గొన్న వారిపై ఎన్ఐఏ ఆకస్మికంగా నోటీసు లు జారీ చేసింది. ఈ సభలో పాల్గొన్న కొంద రు నాయకులు ప్రభుత్వ వ్యతిరేక, వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా గాదె ఇన్నయ్య లాంటి వారిపై ఇప్పటికే దేశద్రోహం కేసులు నమోదయ్యాయి. నిషేధిత సంస్థలతో సంబం ధాలు లేదా ఆ సంస్థల భావజాలాన్ని ప్రచారం చేస్తున్నారా అనే కోణంలో లోతైన విచారణ చేపట్టడానికి ఈ నోటీసులు ఇచ్చారు. జస్టిస్ చంద్రకుమార్, సోనీ సోరి, పినాకపాణి వంటి ప్రముఖులు ఈ సభలో పాల్గొనడం కూడా దర్యాప్తు సంస్థల దృష్టిని ఆకర్షించింది. నోటీసులు అందుకున్న వారిలో మెజారిటీ వ్యక్తు లు హుజూరాబాద్, సైదాపూర్, భీమదేవ రపల్లి, ముల్కనూరు, కమలాపూర్, ధర్మసాగర్, పరకాల, టేకుమట్ల, వేలేరు ప్రాంతాలకు చెందినవారు ఉన్నారు. దశాబ్దాల క్రితమే జనజీవన స్రవంతిలో కలిసిపోయిన తమకు, ఇప్పుడు పాత సంబంధాల పేరుతో నోటీసులు రావడంపై మాజీ మావోయిస్టులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఇరాన్ వ్యూహాత్మక అడుగులు

- అమెరికాపై పట్టుకు వేగంగా కదులుతున్న పావులు
- గల్ఫ్ దేశాలకు ప్రాణసంకటంగా ఇరాన్ దాడులు

**న్యూఢిల్లీ, మార్చి13 (జనంసాక్షి) :** అమెరికా, ఇజ్రాయిల్ కలసి చేస్తున్న యుద్దంతో ఇప్పుడు ప్రపంచం యావత్తూ అతలాకుతలం అవుతోంది. ప్రధానంగా ఇంధన సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. ఈ యుద్ధం నుంచి వెన్నక్కి తగ్గలేక, ముందుకు వెళ్లలేక గింజుకుంటు న్నాయి. ఈ యుద్దంతో ఇజ్రాయిల్ పెద్దగా నష్టపోకున్నా, అమెరికా మాత్రం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతోంది. అలాగే ఇరాన్‌ను దెబ్బతీయాలన్న లక్ష్యం నెరవేరలేదు. ప్రజల మద్దతుతో ఇరాన్ మరింత బలంగా దాడులను తిప్పికొట్టడానికి సిద్ధం అవుతోంది. ఇది ఓ రకంగా అమెరికాకు పెద్ద నష్టం కానుంది. రష్యా ఉక్రెయిన్‌పై యుద్ధం చేసి కాళ్లూచేతులు కాల్చుకుంటోంది. ఇప్పుడు అమెరికాదీ అదే పరిస్థితి. ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా ముజ్తబా ఖమేనీ ప్రస్తుత హెచ్చరికలు అమెరికాకు గుణపాఠం కావాలి. అమెరికా, ఇజ్రాయెల్... ఇరాన్‌ల మధ్య యుద్ధం తీవ్రస్థాయి ప్రాదేశిక రాజకీయ సంక్షోభంగా మారింది. ఈ పోరు ఇతర గల్ఫ్ దేశాలకూ, సముద్ర రవాణా మార్గాలకూ, అంతర్జాతీయ ఇంధన మార్కెట్లకూ విస్తరిం చడం ఆందోళన కలిగిస్తోంది. హర్మూజ్ జలసంధ వద్ద ఇరాన్ పట్టుతో ప్రపంచ దేశాలకు గమ్యం లేకుండా పోయింది. ఈ పరిస్థితిని అమెరికా అర్థం చేసుకునే స్థితిలో లేదు. ఇరాన్ అధినాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీని అమెరికా, ఇజ్రాయెల్‌లు హతమార్చడం ద్వారా ప్రత్యర్థి దేశపు బలాన్ని అంచనా వేయలేక పోయారు. అధినేతను తొలగిస్తే ఆ దేశాన్ని లొంగదీసుకోవాలన్న ఎత్తుగడలు దెబ్బతిన్నా యి. తమ అధినాయ కుడి మరణం లేదా బలిదానం షియా వర్గాన్ని మరింత భీకర ప్రతిఘటనకు పురిగొల్పుతుంది. తమ అధినేత మరణం ప్రజల్లో ప్రతీకారేచ్ఛను పెంచుతుంది. దేశాన్ని బలహీనపరచే బదులు ప్రభుత్వానికి ప్రజల మద్దతును మరింత విస్తృతం చేస్తుంది. సైనిక దాడుల్లో సాధారణ పౌరులు మరణించడం ద్వారా అమెరికా తలనొప్పులు తెచ్చుకుంది. పలుప్రాంతాల్లో ప్రజాగ్రహాన్ని పెంచుతోంది. బాధితుల వివరాలు సామాజిక మాధ్యమాల్లో, పత్రికలూ టీవీ ఛానళ్లలో వేగంగా ప్రసారమవుతూ అంతర్జాతీయ ప్రజాభిప్రాయాన్నీ, దౌత్య సంబంధాలనూ ప్రభావితం చేస్తున్నాయి. మరోవైపు, తనపై అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడి దాడికి సహకరిం చిన ఇతర గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టింది. ఖతార్, బహ్రె యిన్, కువైట్ తదితరాలపైనా... ముఖ్యంగా అక్కడి అమెరికా సైనిక స్థావరాలపైనా డ్రోన్లు, క్షిపణులతో విరుచుకు పడింది. ఇరాన్ నేరుగా అమెరికా భూభాగంపై దాడి చేయలేక పోవచ్చు కానీ, పశ్చిమా సియాలోని అమెరికా సైనిక వసతులను కకావికలం చేయగలదు. అందుకనే గల్ఫ్ దేశాలు ఇప్పుడు సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొం టున్నాయి. ఇలా జరుగు తందని అమెరికా ఊహించకపోవడం కూడా యుద్ధ వైఫల్యంగానే భావించాలి. ఓ రకంగా ఇరాన్ తెలివిగా అమెరికాను దెబ్బతీస్తోంది. అనేక గల్ఫ్ దేశాలు తమ విధానాలకు అనుగుణంగా అగ్రరాజ్య స్థావరాలకు ఆతిథ్యమిస్తున్నాయి.

# మాజీ డీజీపీ హెచ్‌జె దొర మృతి పట్ల డీజీపీ బి.శివధర్ రెడ్డి సంతాపం





ఈనెల 8వ తేదీన పోలీస్ అకాడమీలో జరిగిన 'రిట్రీట్ - 2026' ప్రారంభ కార్యక్రమంలో పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేసిన దివంగత డిజిపి హెచ్‌జె దొర.. పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు, డిజిపి బి శివదర్ రెడ్డి తదితరులు

**హైదరాబాద్, మార్చి 13 (జనంసాక్షి) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డిజిపిగా విశేష సేవలందించిన ప్రతిభావంతుడైన ఐపిఎస్ అధికారి హెచ్‌జె దొర మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. 1943లో శ్రీకాకుళం జిల్లాలో జన్మించిన హెచ్. జె దొర 1965 బ్యాచ్‌కు చెందిన ఐపిఎస్ అధికారిగా పోలీసు శాఖలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారని గుర్తు చేశారు. ఆయన మరణంతో ఒక నిబద్ధత కలిగిన మార్గదర్శిని కోల్పోయామని శివధర్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. హెచ్.జె. దొర డిజిపిగా ఉన్న సమయంలో పోలీసు శాఖలో చేపట్టాల్సిన సంస్కరణలపై సమీక్షించేందుకు 'రిట్రీట్' పేరుతో ఒక వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించేవారని ఆ స్ఫూర్తితోనే దాదాపు రెండున్నర దశాబ్దాల విరామం తర్వాత, ఈ నెల 8, 9 తేదీల్లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పోలీసు శాఖలో ఈ 'రిట్రీట్' కార్యక్రమాన్ని మళ్లీ ప్రారంభించినట్లు శివధర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 8వ తేదీన జరిగిన ఆ ప్రారంభ వేడుకలో హెచ్.జె. దొర స్వయంగా పాల్గొని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేస్తూ తన సందేశాన్ని అందించారని, ఇంతలోనే ఆయన మరణ వార్త వినాల్సి రావడం అత్యంత విచారకం‍మని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలో ప్రజా సంబంధాల వ్యవస్థను ప్రారంభించడం వంటి వినూత్న కార్యక్రమాలను చేపట్టారని డీజీపీ కొనియాడారు. గతంలో తాను నల్గొండ జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న సమయంలో హెచ్‌జె దొర తనను ఒక పరిణితి చెందిన ఐపిఎస్ అధికారిగా అభివర్ణించారని, ఆ ప్రశంస తన జ్ఞాపకమని తన పాత అనుభవాలను గుర్తు చేసుకున్నారు. దివంగత డిజిపి హెచ్‌జె దొరతో తనకు ఉన్న అనుబంధం ఎంతో గొప్పదని, ఆయనకు వ్యక్తిగతంగా తనపై ఎంతో అభిమానం ఉండేదని డిజిపి బి. శివధర్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. విధి నిర్వహణలో తనను ఎల్లప్పుడూ ప్రోత్సహించే వారని, ఆ చొరవతోనే ఆయన సొంత జిల్లా అయిన శ్రీకాకుళం ఎస్పీగా తనకు పోస్టింగ్ ఇచ్చారని గుర్తు చేసుకున్నారు .పోలీసు శాఖలో హెచ్ . జె దొర ప్రవేశపెట్టిన విప్లవాత్మక మార్పులు, సంక్షేమ పథకాలు చిరస్మరణీయమని కొనియాడారు. సిబ్బంది సంక్షేమం కోసం ఆయన భద్రత, ఆరోగ్య భద్రత వంటి వినూత్న పథకాలను ప్రారంభించారని తెలిపారు. నాటి సీపీఐ (ఎంఎల్) పీపుల్స్ వార్ నక్సలైట్ల జననాట్య మండలికి దీటుగా పోలీసు కళాబృందాలను ఏర్పాటు చేసి, సాంస్కృతిక చైతన్యాన్ని తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. నక్సలిజంపై పోరు అత్యంత కీలక దశలో ఉన్న సమయంలో పోలీసు బలగాల సామర్థ్యాన్ని పెంచడంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారని డిజిపి శివధర్ రెడ్డి వివరించారు. నక్సలైట్లతో అంతిమయుద్ధానికి ఆంధ్రప్రదేశ్ పోలీసులను సన్నద్ధం చేశారని, అందువల్లనే నక్సలైట్లు భారీగా నష్టపోయి 2009–10 సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని విడిచి వెళ్ళి దండకారణ్యం లో తలదాచుకున్నారని శివధర్ రెడ్డి అన్నారు.రాష్ట్ర పోలీసు యంత్రాంగాన్ని సన్నద్ధం చేయడంలో ఆయన కృషి అమోఘమని, అందులో భాగంగానే జిల్లా శిక్షణా కేంద్రాలు (డిటిసిలు), కమిషనరేట్ శిక్షణా కేంద్రాలు (సిటిసిలు), బెటాలియన్ శిక్షణా కేంద్రాలు (బిటిసిలు) నెలకొల్పి శిక్షణ వ్యవస్థను పటిష్టం చేశారని గుర్తుచేశారు. కింది స్థాయి సిబ్బంది క్షేమం పట్ల ఎంతో తపన పడేవారని, యువ అధికారులకు మార్గదర్శిగా నిలుస్తూ వారిని ఎప్పుడూ వెన్నుతట్టి ప్రోత్సహించేవారని కొనియాడారు. పోలీసు విభాగంపై ఆయన వేసిన ముద్ర చెరగనిదని, ఒక గొప్ప దార్శనికుడిగా ఆయన సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని డిజిపి అభిప్రాయ పడ్డారు. సుదీర్ఘకాలం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డిజిపిగా సేవలందించిన హెచ్ జె దొర మృతితో మార్గదర్శిని కోల్పోయామని వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని డిజిపి బి. శివధర్ రెడ్డి తెలియజేశారు.

# అంతర్జాతీయ పోటీలు తెలంగాణలో జరగడం గర్వకారణం

- రాష్ట్ర మంత్రులు సీతక్క అజారుద్దీన్
- ఉరుగ్వే - ఆస్ట్రియా మధ్య వరల్డ్ కప్ క్వాలిఫైయర్స్ హాకీ మ్యాచ్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అంతర్జాతీయ పోటీలు తెలంగాణలో జరగడం గర్వకారణమని రాష్ట్ర మంత్రులు సీతక్క, అజారుద్దీన్ అన్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఉరుగ్వే, ఆస్ట్రియా జట్ల మధ్య జరిగిన మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫైయర్స్ మ్యాచ్‌ను రాష్ట్ర మంత్రులు సీతక్క, అజారుద్దీన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలు తెలంగాణలో నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు మంత్రి సీతక్క ఇరు జట్ల క్రీడాకారిణులను వ్యక్తిగతంగా పరిచయం చేసుకొని వారికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. క్రీడాస్ఫూర్తితో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలని, ఈ పోటీలు అంతర్జాతీయ స్థాయిలో మహిళల హాకీ అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడల ద్వారా దేశాల మధ్య స్నేహ సంబంధాలు మరింత బలపడతాయని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంద న్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొం దించేందుకు ఆధునిక క్రీడా మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి క్రీడా పోటీలను తెలంగాణలో నిర్వహించడం ద్వారా రాష్ట్రం అంతర్జాతీయ క్రీడా పటంలో ప్రత్యేక గుర్తింపు పొందు తోందని అన్నారు. మహిళా క్రీడాకారిణులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. క్రీడలు యువతకు ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవి శ్వాసాన్ని అందిస్తాయని ఆమె అన్నారు. తెలంగాణలో క్రీడల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీలను రాష్ట్రంలో నిర్వహిం చేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. దేశంలోని తొలి క్రీడ యూని వర్సిటీని తెలంగాణలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏటీజీ చైర్మన్ శివసేనా రెడ్డి, ఎండీ సోనీ బాలాదేవి, తెలంగాణ హాకీ అసోసియేషన్ సెక్రటరీ భీమ్ సింగ్, క్రీడా శాఖ అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొ న్నారు. మ్యాచ్‌ను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు హాజరై క్రీడాకారి ణులను ఉత్సాహపరిచారు. తెలంగాణలో ఇలాంటి అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించడం రాష్ట్ర క్రీడా రంగ అభివృద్ధికి దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



**హైదరాబాద్, మార్చి13 (జనంసాక్షి) :** దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు మరోసారి తగ్గుముఖం పట్టాయి. గురువారంతో పోలిస్తే నేశుక్రవారం నాటి మార్కెట్లలో గోల్డ్, సిల్వర్ రేట్లు ఇంకాస్త దిగొచ్చాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో బంగారం, వెండి రేట్లను పరిశీలిస్తే.. 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధరపై రూ.980 పతనమై రూ.1,61,240కు చేరగా.. 22 క్యారెట్ల 10 గ్రాములపై రూ.900 తగ్గి రూ.1,47,800 వద్ద ట్రేడవుతోంది.ఇక వెండి విషయానికొస్తే.. క్రితం రోజుతో పోలిస్తే కిలో వెండిపై రూ.100 తగ్గింది. ప్రస్తుతం మార్కెట్లో కిలో వెండి ధర రూ.2,79,900గా ఉంది. అయితే.. గరిష్ఠాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడమే ధరల తగ్గుదలకు కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల



- మార్చి 16న నోటిఫికేషన్
- 18 నుంచి మే 10వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల పక్రియ

**నిర్మల్, మార్చి13 (జనంసాక్షి) :** తెలంగాణలోని రాజీవ్ గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బాసర, మహబూబ్‌నగర్ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో 2026–27 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైంది. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాల షెడ్యూల్‌ను ఆర్జీయూకేటీ బాసర వీసీ గోవర్ధన్ శుక్రవారం విడుదల చేశారు. దీని ప్రకారం.. మార్చి 16న నోటిఫికేషన్, మార్చి 18 నుంచి మే 10వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల పక్రియ కొనసాగనుంది. అర్హులైన అభ్యర్థులు టీజీఆన్‌లైన్ సెంటర్లు/మీసేవ/యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రొవిజినల్ జాబితాను మే 30న ప్రకటించి తొలి విడత కౌన్సెలింగ్‌ను జూన్ 5న నిర్వహించనున్నట్లు వీసీ తెలిపారు. ఈ షెడ్యూల్ విడుదల కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ ఈ. మురళీ దర్శన్, ప్రవేశాల కన్వీనర్ శీలం శేఖర్, కో–కన్వీనర్ బండి హరికృష్ణ, అసోసియేట్ డీన్‌లు డా.మహేష్, డా. విఠల్, డా.దేవరాజ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370